ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 26-8-2019 సోమవారం సిటీ సంపుటి 46 సంచిక 17
రూ. 6-50. పేజీలు 16+12 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

సాహో స్వర్ణ సింధు

ఇది చరిత్ర ఎరుగని విజయం.. తరతరాలు గుర్తుండే ఘన విజయం.

కొన్నేళ్ల కిందటి వరకు ఏదో ఒక పతకం గెలిస్తేనే అద్భుతం అనుకునే ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా స్వర్ణమే కొల్లగొట్టి దేశం గర్వించేలా చేసింది తెలుగు తేజం... మన సింధు..

అయితే ఇది కేవలం ఓ ఆటలో విజయమే కాదు.. ఆటను దాటి అందరూ నేర్చుకోదగ్గ ఓ పాఠం!

విజయంతో విశ్రమించేవాళ్లు కొందరు..
విజయంతో విర్రవీగేవాళ్లు కొందరు..
విజయం చేజారితే కుంగిపోయేవాళ్లు కొందరు..
విమర్శలకు నీరుగారిపోయేవాళ్లు మరి కొందరు..
అందరికీ గొప్ప పాఠమే నేర్పింది
మన బంగారు సింధు!

నాడు రియో ఒలింపిక్స్‌లో సింధు గెలిచింది రజతమే. కానీ దేశమంతా స్వర్ణాన్ని మించిన సంబరాలు. క్రికెట్ మైకంతో ఊగిపోయే దేశంలో ఒక బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి ఇంతటి ఆదరణా అని ఆశ్చర్యపోయేంతగా సింధుపై అభినందనలు, నజరానాల వర్షం! కానీ అవన్నీ చూసి ఆమె విర్రవీగలేదు! ఏ విజయమూ ఆమెను విశ్రమించేలా చేయలేదు! ఒలింపిక్స్‌లోనే కాదు.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ రెండు సార్లు స్వర్ణం అందినట్లే అంది చేజారింది. సింధు తుది మెట్టుపై బోల్తా కొట్టింది. కానీ ఈ ఓటములతో ఆమె కుంగిపోలేదు!

విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో, ఓటములు నేర్పిన పాఠాలతో.. సింధు ప్రపంచ బ్యాడ్మింటన్ వేదికపై అత్యున్నత విజయాన్నందుకుంది. పట్టుబట్టి పసిడి కలను నెరవేర్చుకుంది.

రెండేళ్ల కిందట తన ఆశల్ని తుంచేసిన ఒకుహరనే చిత్తుగా ఓడించి స్వర్ణం చేజిక్కించుకోవడంతో ఈ విజయం సింధుకు మరింత మధురం! మైదానంలో అడుగు పెడితే ఒక పట్టాన లొంగని ఒకుహరను నిస్సహాయురాలిగా మార్చిన వైనం ఆమె అసాధారణ నైపుణ్యానికి, తిరుగులేని ఆధిపత్యానికి నిదర్శనం!

..వివరాలు ఛాంపియన్‌లో

సింధు పసిడి ప్రయాణం

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో..	
2013	కాంస్యం
2014	కాంస్యం
2017	రజతం
2018	రజతం
2019	స్వర్ణం

ఆదివారం ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 21-7, 21-7తో జపాన్ క్రీడాకారిణి నొజోమి ఒకుహరను ఓడించింది.

2017లో ఇదే టోర్నీ ఫైనల్లో సింధు.. ఒకుహర చేతిలోనే ఓడింది.

అపూర్వ విజయం అనంతరం కోచ్ గోపీచంద్ అభినందనలు

పౌష్టిక సుదృఢ భారత్

ప్రజా ఉద్యమంగా ఫిట్ ఇండియా

- పసి పిల్లల కోసం పోషణ్ అభియాన్
- ప్రధాని మోదీ వెల్లడి
- ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరడదామని జాతికి పిలుపు

ఆగస్టు 29 – జాతీయ క్రీడా దినోత్సవం. ఆరోజున 'ఫిట్ ఇండియా' ఉద్యమానికి శ్రీకారం.

సెప్టెంబరు 11 – 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ప్రారంభం.

సెప్టెంబరు నెల – దేశమంతటా 'పోషణ్ అభియాన్' మాసం'గా జరుపుకోవడం.

అక్టోబరు 2 – మహాత్మా గాంధీ 150వ జయంతిని 'ప్లాస్టిక్ రహిత భారత మాత' కార్యక్రమం.



దిల్లీ: ఆరోగ్యకరమైన భారత్ కోసం మూడు నూతన ప్రజా ఉద్యమాలు చేపట్టనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. దృఢమైన ప్రజానీకం ఉండేలా చూసేందుకు 'ఫిట్ ఇండియా ఉద్యమం', పసిపిల్లల కోసం 'పౌష్టికాహార ఉద్యమం', పర్యావరణ పరిరక్షణ కోసం 'ప్లాస్టిక్ వ్యర్థాల వ్యతిరేక ఉద్యమం' నిర్వహించనున్నట్టు తెలిపారు. తొలి ఉద్యమమైన 'ఫిట్ ఇండియా'ను ఈ నెల 29న ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఈ ఉద్యమాల విషయాన్ని ప్రస్తావించారు. వరుసగా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగే ఈ ఉద్యమాల్లో దేశ ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. 1942 ఆగస్టులోనే 'క్విట్ ఇండియా' ఉద్యమం కూడా జరగడం గమనార్హం.

అన్ని వర్గాలకు ఆసక్తికరంగా

"ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం. అదే రోజున 'ఫిట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభిస్తాం. ఆ రోజునే ఈ పథకం పూర్తి వివరాలను వెల్లడిస్తా. మహిళలు, పిల్లలు, యువకులు, వృద్ధులు అందరి కోసం ఆసక్తికరంగా ఉండే కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. ... మిగతా 2లో

మట్టి కప్పుల్లో గరం ఛాయ్

రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మాల్స్, విమానాశ్రయాల్లోనూ వాడకం

దిల్లీ: ప్రయాణ సమయంలో చూడచక్కని మట్టి కప్పుల్లో వేడివేడి తేనీరు సేవించగలిగే అవకాశం త్వరలో కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్‌ల్లోని స్టాళ్లు, విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్‌లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. వంద రైల్వేస్టేషన్లలో తేనీటి కోసం మట్టి కప్పులను తప్పనిసరి చేయాల్సిందిగా కోరినట్లు చెప్పారు. ... మిగతా 2లో

పౌర సేవలకు జనతా జనార్దన్!

- మొబైల్ యాప్‌ను రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం కేసీఆర్ పరిశీలన అనంతరం విడుదల

ఈనాడు, హైదరాబాద్: అరచేతిలో ప్రభుత్వ సేవలు, సమాచారం అందుబాటులోకి వస్తే ఎలా ఉంటుంది.. ఎంతో సౌకర్యంగా ఉంటుంది కదా.. సరిగ్గా అలాంటి ప్రయోగమే చేయబోతోంది తెలంగాణ ప్రభుత్వం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి.. ఓ మొబైల్ యాప్‌ను రూపొందించింది. దీనిద్వారా సమస్త ప్రభుత్వ సేవలు, అందుబాటులోకి తెచ్చేందుకు, వారి అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తోంది.. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పంథాలో తయారుచేసి.. ప్రజలకు అందుబాటులోకి తేబోతున్న ఈ మొబైల్ యాప్ పేరు ఏమిటో తెలుసా.. జనతా జనార్దన్.. ప్రజలే ప్రభువులుగా భావించి, వారికి సేవలందించేందుకు ఉద్దేశించిన యాప్ కాబట్టి.. ఈ పేరు ఖరారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన యంత్రాంగంతో పాటు సమస్త తెలంగాణ ప్రజలకు జనతా జనార్దన్ ఉపయుక్తం కానుంది. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించనుంది. ప్రస్తుతమున్న వివిధ వెబ్‌సైట్లు, పోర్టళ్లతో అనుసంధానం కానుంది. కేంద్రం ఆమోదిస్తే కేంద్ర వెబ్‌సైట్లకు సైతం అనుసంధానం చేయాలని భావిస్తోంది. ... మిగతా 2లో

9వ తరగతి నుంచి కృత్రిమ మేధ

- ఈ ఏడాది నుంచే సీబీఎస్ఈ ఐచ్ఛిక సబ్జెక్టుగా అమలు
- పదో తరగతి గణితంలోనూ 2 రకాల ప్రశ్నపత్రాలు

ఈనాడు, హైదరాబాద్: మారుతున్న సాంకేతిక పరిస్థితులపై అవగాహన పెంచుకునేందుకు వీలుగా ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి నుంచి కేంద్ర మాధ్యమిక విద్యామండలి (సీబీఎస్ఈ) 'కృత్రిమ మేధను' ఐచ్ఛిక సబ్జెక్టుగా అమలు చేస్తోంది. యోగా, శిశు విద్య అనే వాటిని కూడా ఐచ్ఛికాలుగా ప్రవేశపెట్టాలని గత మార్చిలో బోర్డు నిర్ణయించింది. తొమ్మిదో తరగతిలో 'కృత్రిమ మేధ'ను తీసుకుంటే పదో తరగతిలో కూడా దాన్నే ఎంచుకోవాలి. తప్పనిసరి సబ్జెక్టులు అయిదు ఉంటాయి. ఆరో సబ్జెక్టుగా ఒక ఐచ్ఛిక సబ్జెక్టును తీసుకుంటారు. ... మిగతా 2లో



ప్లాస్టిక్‌పై పోరాటం

– 11లో

- కేంద్రం కసరత్తు
- ప్రత్యేక బృందం ఏర్పాటు

కష్టాల కస్తూరిబా

– 2లో

- ఫ్యాన్లపై పక్షిగూళ్లు
- పడక గదిలోనే తరగతులు

సౌదీలో చిక్కుకున్న 11 మంది తెలంగాణ కార్మికులు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చొరవతో స్వదేశానికి తిరిగొచ్చారు. వారంతా ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

– 6లో

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నూతన విధానాలు, పద్ధతులను ప్రవేశపెట్టే వినూత్న ఆలోచన మీ దగ్గర ఉందా... అయితే మీకొక మంచి ఛాన్స్..

– 5లో

కష్టాల 'కస్తూరిబా'

- ఫ్యాన్లపై పక్షి గూళ్లు
- పడక గదిలోనే తరగతులు
- మురికి కూపాలుగా ప్రాంగణాలు
- కేజీబీవీల్లో విద్యార్థుల గోస

ఈనాడు - హైదరాబాద్

రెండు వందల మంది విద్యార్థినులు ఉండేందుకు నిర్మించిన భవనంలో రెట్టింపు సంఖ్యలో ఉంటే.. పాఠశాల స్థాయి బాలికలకే సరిపోని వసతులు ఉన్న చోట విద్యార్థినులకు ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభిస్తే.. చదువు బుర్రకెక్కేది ఎట్లా? వాస్తవానికి పలు కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో(కేజీబీవీల్లో) ఇదే పరిస్థితి. డార్మిటరీ గదులనే తరగతి గదులుగా మార్చారు. ఒక తరగతి గదిలో రెండు తరగతులు నడుపుతున్నారు. బెంచీలు లేక విద్యార్థినులు కింద కూర్చుంటున్నారు. మిగిలిన అన్నం, చెత్తాచెదారం, పనికిరాని దుస్తులు, పిచ్చి మొక్కలతో ప్రాంగణ పరిసరాలు నిండిపోయి కనిపించాయి. రాష్ట్రంలోని వనపర్తి, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లోని కొన్ని కేజీబీవీలను 'ఈనాడు' పరిశీలించినప్పుడు ఈ దుస్థితులు కళ్ల ముందు సాక్షాత్కరించాయి. విద్యుత్తు, డ్రెయినేజీ, నీటి కుళాయిలకు సంబంధించి చిన్న మరమ్మతులు వచ్చినా సరి చేసే యంత్రాంగం లేదు. అవి క్రమేపీ పెద్దవై కొత్త సమస్యలకు మూలంగా మారుతున్నాయి.

గణాంక సహితంగా...

- మొత్తం కేజీబీవీలు 475
- 6-10 తరగతులున్నవి 303
- 172 6 నుంచి ఇంటర్ వరకు
- 1.12 లక్షలు మొత్తం విద్యార్థుల సంఖ్య

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో 200 మంది కోసం 18 మరుగుదొడ్లు, 18 స్నానగదులు నిర్మించగా ఇప్పుడు బాలికల సంఖ్య 342కు పెరిగినా వాటితోనే సర్దుకోవాల్సి వస్తోంది. కొన్నిటికి తలుపులు లేవు.

కల్వకుర్తి కేజీబీవీకి రెండు వైపుల ప్రహరీ లేదు. ప్రాంగణం మీదుగా నిత్యం గేదెలు తిరుగుతున్నాయి. ఫ్యాన్లు కొన్ని పనిచేయడం లేదు. వాటిల్లో పక్షులు గూళ్లు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

సచిత్ర సాక్ష్యంగా...

- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 200 మంది ఉండాల్సిన భవనంలో 330 మంది ఉన్నారు. రాత్రిళ్లు నిద్రించే డార్మిటరీ గదులన్నింటిని తరగతి గదులుగా ఉపయోగిస్తున్నారు. చుట్టూ ట్రంకు పెట్టెలు, ఆరేసిన దుస్తులు, మధ్యలో బాలికలతో గదులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రాంగణం పరిసరాలు అపారిశుద్ధ్యానికి పరాకాష్ఠగా దర్శనమిచ్చాయి. ఇక్కడ ఆహారం విషపూరితం కావడంతో నెల రోజుల క్రితం 14 మంది బాలికలు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రులు పాలయ్యారు. ప్రత్యేకాధికారి సస్పెండ్ అయ్యారు. పరిస్థితిలో మార్పేమీ లేదు.

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండకు 2017-18లో కేజీబీవీ మంజూరైంది. దాన్ని కల్వకుర్తిలో ఓ ఇరుకైన అద్దె భవనంలో నడుపుతున్నారు. తరగతి గదులు ఎంత ఇరుకుగా ఉన్నాయంటే ఒక గదిలో ఒక వరుసే ఉంటుంది. ఆ వరుసలో నలుగురు మాత్రమే కూర్చోగలరు.

వనపర్తి కేజీబీవీలో 200 మందికి బదులు 377 మంది ఉంటున్నారు. ఇక్కడా కొల్లాపూర్‌లో మాదిరి పడక గదుల్లో ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని తరగతులకు బెంచీలు లేవు.

- సంగారెడ్డి జిల్లా అందోల్ కేజీబీవీలో 200 మంది ఉండాల్సిన చోట 350 మంది ఉంటున్నారు. గదుల కొరత వల్ల రెండు తరగతుల వారిని ఒక గదిలో సర్దుతున్నారు.
- రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల విద్యాలయంలో 351 మంది ఉన్నారు. ఆంగ్లం, తెలుగు, వృక్షశాస్త్రం, గణితం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు విద్యార్థినులు నివేదించుకున్నా పరిష్కారం కాలేదు.

- 2018-19లో 88 చోట్ల, ఈ ఏడాది మరో 84 చోట్ల ఇంటర్ తరగతులను మొదలుపెట్టారు. గత ఏడాది ఇంటర్ ప్రారంభించిన చోట ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కారణంగా వసతులు సరిపోక బాలికలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.
- ఈ విషయాలను దృష్టికి తీసుకెళ్లగా.. వసతులు పెంచుతున్నామని పాఠశాల విద్య కమిషనర్ విజయకుమార్ తెలిపారు. ఇంటర్ తరగతుల కోసం ఇప్పటికే పలు చోట్ల నిర్మాణాలు ప్రారంభయ్యాయని, త్వరలోనే అన్ని సౌకర్యాలు సమకూరుతాయని అన్నారు.

కంట్రీక్లబ్‌కు రూ.50 వేల జరిమానా

- వినియోగదారుకు సభ్యత్వ రుసుముతో పాటు చెల్లించాలని ఫోరం ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తప్పుడు హామీలతో మోసపూరితంగా డబ్బు వసూలు చేయడంతోపాటు.. వినియోగదారు మానసిక వేదనకు కారణమయ్యారంటూ 'కంట్రీక్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ లిమిటెడ్'కు హైదరాబాద్ వినియోగదారుల ఫోరం-1 రూ.50,000 జరిమానా విధించింది.

సభ్యత్వం పేరుతో వసూలుచేసిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కంట్రీక్లబ్ నుంచి పరిహారం ఇప్పించాలంటూ పుట్టం స్వాతి.. ఫోరాన్ని ఆశ్రయించారు. హాలిడే ప్యాకేజీలు, ఆకర్షణీయ బహుమతులు లభిస్తాయని చెప్పడంతో స్వాతి రూ.1,70,000తో కంట్రీక్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నారు. నగరానికి కొద్ది దూరంలో భూమిని కూడా బహుమతిగా ఇస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు ఆమెకు తెలిపారు. అయితే, ఎప్పుడు భూమి ప్రస్తావన తీసుకొచ్చినా మోసపూరిత హామీలు ఇస్తున్నారని గ్రహించిన ఫిర్యాదుదారు సభ్యత్వం కోసం ఇచ్చిన డబ్బును తిరిగి ఇచ్చేయాలని కంట్రీక్లబ్‌ను కోరారు. సంస్థ ప్రతినిధులు పెద్దగా స్పందించకపోవడంతో ఫిర్యాదుదారు ఫోరాన్ని ఆశ్రయించారు. స్వాతి వాదనను ఖండిస్తూ కంట్రీక్లబ్ రాతపూర్వక వివరణ అందించింది. ఇద్దరి వాదనలు విన్న ఫోరం అధ్యక్షుడు పి.విజేందర్, సభ్యులు డి.నిర్మలతో కూడిన బెంచ్ ఫిర్యాదుదారుకి అనుకూలంగా తీర్పును వెలువరించింది. వసూలుచేసిన సభ్యత్వ రుసుము రూ.1,70,000తోపాటు మానసిక వేదనకు గురిచేసినందుకు పరిహారంగా రూ.50,000, ఖర్చుల కింద రూ.5,000 వినియోగదారుకి చెల్లించాలని ఫోరం.. కంట్రీక్లబ్‌ను ఆదేశించింది.

9వ తరగతి నుంచి 'కృత్రిమ మేధ'

(మొదటి పేజీ తరువాయి)

- గణితం అంటే భయపడేవారికి ఊరటనిస్తూ ఈ విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల్లో రెండు రకాల గణితం ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు. గణితం అంటే ఆసక్తి లేనివారు, పదో తరగతి తర్వాత గణితం సబ్జెక్టు లేని విద్యను చదువుకోవాలనుకున్న వారు సులభంగా ఉండే (బేసిక్ లెవెల్) ప్రశ్నపత్రాన్ని ఎంచుకోవచ్చు. మిగిలిన వారు ప్రామాణిక ప్రశ్నపత్రాన్ని ఎంచుకోవచ్చు.
- వార్షిక పరీక్షలో బేసిక్ స్థాయి పరీక్ష రాసి.. మళ్లీ ప్రామాణిక స్థాయి రాయాలనుకుంటే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకావొచ్చు. ఒకవేళ ప్రామాణిక స్థాయి పరీక్షలో తప్పిన వారు.. మళ్లీ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రాథమిక స్థాయి పరీక్ష రాసి ఇంటర్ విద్యలోకి ప్రవేశించవచ్చు. అయితే వారు గణితం సబ్జెక్టు ఉన్న గ్రూపులో చేరటం కుదరదు.
- పదో తరగతి గణితం సిలబస్ అందరికీ ఒకటే.. తరగతి గదిలో ఒకేలా బోధిస్తారు. విద్యార్థులు ఎంచుకున్న దాన్ని బట్టి ప్రశ్నపత్రాన్ని ఇస్తారు.

28న అల్పపీడనం

ఈనాడు, హైదరాబాద్ : బంగాళాఖాతం ఉత్తర ప్రాంతంలో ఈ నెల 28న అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. మరోవైపు మధ్యప్రదేశ్ తూర్పు ప్రాంతంలో మరో అల్పపీడనం ఉంది. దీనికి అనుబంధంగా 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఉంది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఆదివారం పగలు రాష్ట్రంలోని 182 ప్రాంతాల్లో వానలు కురిశాయి. అత్యధికంగా గాంధారిలో 53, కొల్లూరు, పర్పల్లిలో 39.5, దేవులవాడలో 36.5, లింగాపూర్‌లో 36, బీర్కూర్‌లో 33.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

ప్రభుత్వ దోపిడీని ప్రజలకు వివరిస్తాం

- రీడిజైనింగ్ పేరుతో రూ.లక్షల కోట్ల భారం
- సీబీఐ విచారణ జరిపించాలని అమిత్ షాను కోరతాం
- నేడు 'ప్రాణహిత-చేవెళ్ల' పర్యటన: భట్టి విక్రమార్క

మధిర, న్యూస్‌టుడే: ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేస్తోందని.. దీన్ని ఆపకపోతే రాష్ట్రం అంధకారంలోకి పోతుందని సీఎల్పీ నేత, ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. ఖమ్మం జిల్లా మధిరలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర నిధులు ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో ఎలా దోపిడీకి గురవుతున్నాయో వివరించేందుకు సోమవారం 'ప్రాణహిత - చేవెళ్ల' పర్యటన చేపట్టినట్లు చెప్పారు. వాస్తవ విషయాలను లెక్కలతో సహా ప్రజలకు వివరిస్తామన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల కోట్ల మేర పనులు చేసిన ప్రాణహిత-చేవెళ్లపై తెలంగాణ సర్కారు రూ.28 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని తెలిపారు. కానీ, కమీషన్ల కోసం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్ల అంచనాలతో ప్రాజెక్టుకు రీడిజైన్ చేశారని ఆరోపించారు. మిషన్ భగీరథ పేరుతో రూ.50 వేల కోట్లతో మరో ప్రాజెక్టు చేపట్టారని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే సాగు, తాగునీరు అవసరాలు తీరటమే కాక రాష్ట్రానికి 1.5 లక్షల కోట్లు మిగిలేవన్నారు. తెలంగాణలో ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో జరిగిన దోపిడీపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరనున్నట్లు భట్టి చెప్పారు.

మట్టి కప్పుల్లో గరం ఛాయ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం వారణాశి, రాయ్‌బరేలీ రైల్వేస్టేషన్లలో మట్టి కప్పులు, మట్టి ప్లేట్లనూ వాడుతున్నారు. మెల్లగా అన్నిరకాల ప్రయాణప్రాంగణాల వద్ద మట్టి గ్లాసులు, మట్టి కప్పుల వాడకాన్ని పెంచడం వల్ల స్థానిక మట్టిపాత్రల తయారీదారులకు ఎంతో ప్రయోజనకరమవుతుందన్నారు. 'కుమార్ సశక్తీకరణ్ యోజన' కింద మృణ్మయ పాత్రల తయారీదారులకు గతేడాది విద్యుత్‌తో పనిచేసే పదివేల 'సార'లను పంపిణీ చేసినట్లు 'ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్' ఛైర్మన్ వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు.

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

కష్టం చూస్తేనే..!

ప్రతి ఆలోచనలో హేతుబద్ధత ముఖ్యమేగానీ ఆ హేతువనేది కష్టాల కొలిమిలోనే బలోపేతమవుతుంది. ఎందుకంటే కష్టాలు మన కళ్లు తెరిపించి, అవగాహనా ప్రపంచాన్ని విస్తరింపజేస్తాయి!

– మహాత్మా గాంధీ

క్యాబ్ డ్రైవరే హంతకుడు

- మాజీ మోడల్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో జులై 30 రాత్రి హత్యకు గురైన పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన మాజీ మోడల్ పూజాసింగ్ కేసులో నిందితుడు ఓలా క్యాబ్ డ్రైవరుగా తేలింది. హెచ్.ఎం.నాగేశ్ అనే నిందితుడిని ఈ నెల 21న పోలీసులు అరెస్టు చేశారు. పూజా సింగ్ విమానంలో నగరానికి వచ్చి క్యాబ్ బుక్ చేసుకుంది. తన కారులోకి ఎక్కిన బాధితురాలి వద్ద నగదు దోచుకునేందుకు డ్రైవరు ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. తర్వాత తనకు రూ.5 లక్షల నగదు ఇవ్వాలంటూ నిందితుడు ఆమె భర్తకు సంక్షిప్త సందేశం పంపాడు. దీనిపై ఆమె భర్త బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు ఆగస్టు 2న మరోసారి ఫోన్ స్విచాన్ చేసి హైదరాబాద్‌లో ఉన్నానని, తనకు నగదు ఇస్తే ఆమెను విడిచిపెడతానని పూజాసింగ్ భర్తకు మరో సందేశం పంపించి స్విచ్‌ఆఫ్ చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశారు.

పౌర సేవలకు జనతా జనార్దన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రభుత్వ సేవలకు ఏకీకృత వ్యవస్థ లేదు. వివిధ మార్గాల ద్వారా వీటిని అందిస్తున్నారు. సమాచార వ్యవస్థకు వేర్వేరు పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం మొబైల్ యాప్‌లు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. దీని ద్వారా పాలనను సులభతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఏడాదిన్నరగా కసరత్తు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి దీన్ని రూపకల్పన చేశారు.

ఉపయోగం

- అన్ని రకాల సమాచారాన్ని(డేటా బేస్) ఇందులో పొందుపరుస్తారు. ఒక వ్యక్తి, అతని కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలను అందులో పొందుపరిచే వెసులుబాటు కల్పిస్తుంది.
- ఇందులో ప్రతి వ్యక్తికీ ఒక యునిక్ ఐడెంటిటీ కోడ్‌ను ఇచ్చి యాప్‌లోకి ప్రవేశించే అవకాశం కల్పిస్తారు. తన వివరాలను తానే అందులో పొందుపరచవచ్చు. ఒకరి వివరాలు మరొకరు చూడకుండా రక్షణ కల్పించనున్నారు.
- ప్రభుత్వ శాఖలకు, ఉద్యోగులకు, అధికారులు ఈ యాప్‌లో భాగస్వాములుగా ఉంటారు.
- దీన్ని పూర్తిగా తెలంగాణ పౌరులే పొందేలా ప్రోగ్రామింగ్ చేయనున్నారు.
- భూ రికార్డులు, జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇలా ప్రభుత్వం నుంచి పౌరులు ఈ యాప్ ద్వారా పొందవచ్చు.
- దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వ సమాచారం, జీవోలు పొందవచ్చు.

వివిధ పోర్టళ్లకు అనుసంధానం

జనతా జనార్దన్ యాప్ రూపకల్పనపై కార్యదర్శులకు సీఎస్ జోషి ప్రాథమిక సమాచారమిచ్చారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. తుది ప్రతిపాదనలను త్వరలోనే ఖరారు చేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమర్పిస్తారు. ఆయన అనుమతి తర్వాత దీనిని విడుదల చేయనున్నారు. తర్వాత వివిధ పోర్టళ్లకు దీనిని అనుసంధానం చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ యాప్ వివరాలను వెల్లడించి, భారత ప్రభుత్వ వెబ్‌సైట్లకు కూడా అనుసంధానం చేయడానికి అనుమతి కోరతారు. కేంద్రం అనుమతి లభిస్తే వారి సమాచారం కూడా పొందవచ్చు. తద్వారా రాష్ట్రానికి సంబంధించిన సమాచారం కేంద్రానికి అందుబాటులో ఉండటమే కాకుండా వివిధ కేంద్ర ప్రభుత్వ సేవలు తెలంగాణ పౌరులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయనున్నారు.

ఇదో వినూత్న విధానం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి

జనతా జనార్దన్ మొబైల్ యాప్ విప్లవాత్మకమైనది. వినూత్న విధానంతో, సరళమైన పద్ధతిలో, పారదర్శకంగా, అవినీతిరహితంగా, జవాబుదారీతనంతో కూడుకున్న పరిపాలనను ప్రజలకు అందించడానికి ఉపయోగపడుతుంది. ఇది ఉపయోగంలోకి వచ్చాక పౌరుల నుంచి విశేషాదరణ లభిస్తుంది.

'సాధికార మహిళ'లకు పురస్కారాల ప్రదానం

ఈనాడు, దిల్లీ: తాము ఎంచుకున్న రంగాల్లో అంకితభావంతో పనిచేయడంతో పాటు ఆయా రంగాలపై తమదైన ముద్ర వేస్తున్న మహిళలకు మెరిట్ అవార్డ్స్ మార్కెట్ రీసెర్చ్ లిమిటెడ్ సంస్థ 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డ్సు-2019' ప్రదానం చేసింది. దిల్లీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి గీతా పొగట్, సినీనటి సుధాచంద్రన్ విజేతలకు పురస్కారాలను అందజేశారు. డాక్టర్ సుష్మిత (ఉత్తమ దంతవైద్యురాలు, హైదరాబాద్), అనిత ఈతముక్కల (బెస్ట్ ఫ్యామిలీ డెంటిస్ట్, హైదరాబాద్), నేహా (వసుంధర డైమండ్ రూఫ్ ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్, విజయవాడ), డాక్టర్ డి.ఎన్.వి.అన్నపూర్ణ (ప్లాస్టిక్ సర్జన్-విశాఖపట్నం), డాక్టర్ అపూర్వ పల్లంరెడ్డి (ఎమర్జింగ్ ఫెర్టిలిటీ, ల్యాప్రోస్కోపిక్ కన్సల్టెంట్-బెంగళూరు) అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

గ్రహం అనుగ్రహం

26-8-2019 సోమవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: రా. 12-45 తదుపరి ద్వాదశి
ఆర్ద్ర నక్షత్రం: రా. 11-49 తదుపరి పునర్వసు
అమృత ఘడియలు: మ. 2-01 నుంచి 3-35 వరకు
వర్జ్యం: ఉ. 8-33 నుంచి 10-07 వరకు
దుర్ముహూర్తం: మ. 12-27 నుంచి 1-07 వరకు
తిరిగి 2-57 నుంచి 3-47 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-48; సూర్యాస్తమయం: సా.6.17
సర్వ ఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
హన్మకొండ	35.0	27.5
ఖమ్మం	35.0	26.0
నిజామాబాద్	32.4	24.9
నల్గొండ	32.4	24.4
రామగుండం	31.0	26.0
హైదరాబాద్	31.0	22.6
మెదక్	30.8	21.0
మహబూబ్‌నగర్	30.4	24.1
సూర్యాపేట	30.0	27.5
కరీంనగర్	30.0	22.0

పీహెచ్‌సీల్లో పాముకాటు విరుగుడు మందులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) మొదలుకొని బోధనాసుపత్రుల దాకా అన్ని స్థాయుల ఆసుపత్రుల్లోనూ పాముకాటు విరుగుడు మందు 'యాంటీ స్నేక్ వీనమ్' ఇంజక్షన్లు సమృద్ధిగా ఉన్నాయని ప్రజారోగ్య సంచాలకులు జి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని స్థాయుల ఆసుపత్రుల్లోనూ అతి శీతలీకరణ పరికరాలు(డీప్ ఫ్రీజర్లు) అందుబాటులో ఉన్నాయని, ఒకవేళ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా ఇబ్బంది లేదన్నారు. 24 గంటలూ అవి పనిచేసేలా 'ప్రత్యేక బ్యాటరీలు' సేవలు అందిస్తున్నాయని చెప్పారు. 24గంటల పీహెచ్‌సీల్లో రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉంటారని, ఇతర పీహెచ్‌సీల్లో వైద్యసేవలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే లభిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పాముకాటుకు విరుగుడు ఔషధ ఇంజక్షన్లు ప్రస్తుతం జిల్లా గోదాముల్లో 18,050 అందుబాటులో ఉన్నాయని, వీటి గురించి ఆందోళన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ) ఎండీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

నిండుతున్న జలం.. పండనున్న పొలం

జలాలు నిండుతున్నాయి..ఇక తమ కలలు పండుతాయని జనాలు ఆశపడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం ఇల్లంతకుంట పరిధిలోని రాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు) కాళేశ్వర జలాలతో నిండుతోంది. త్వరలో గేట్లు ఎత్తి దిగువ మానేరుకు నీటిని వదలనున్నారు. భవిష్యత్తుపై ఆశతో ప్రాజెక్టు సమీపంలోని రైతులు పొలం పనులు చేసుకుంటున్న దృశ్యమిది. –ఈనాడు, కరీంనగర్

పౌష్టిక సుదృఢ భారత్

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు, నవజాత శిశువులే భావి తరాలకు పునాదులు. వీరికి ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పౌష్టికాహారం అందించాల్సి ఉంది. ఇందుకోసం పోషణ్ అభియాన్ పేరుతో ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తాం. ఈ విషయమై ఇప్పటికే కొన్ని చోట్ల వినూత్న కార్యక్రమాలు సాగుతున్నాయి. మహారాష్ట్రలోని నాసిక్‌లో 'ముట్టీ భర్ ధాన్య' పేరుతో అంగన్వాడీ కార్యకర్తలే ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పంటలు చేతికందే సమయంలో అందరి ఇళ్లకీ వెళ్లి పిడికెడు ధాన్యాన్ని సేకరిస్తున్నారు. దాన్ని ఆహారంగా మార్చి పిల్లలకు పెడుతున్నారు. ఈ 'అన్నప్రాసన సంస్కార్'లో అందరూ భాగస్వాములవుతున్నారు. పలువురు వ్యక్తులు తమకు ఇష్టమైన తేదీల్లో పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం చాలా ప్రాంతాల్లో అమలవుతోంది. సెప్టెంబరు నెలను దేశమంతటా 'పోషణ్ అభియాన్' మాసంగా జరుపుకొని అలాంటి విధానాలు అమలు చేద్దాం.

ప్రకృతిని ఆస్వాదించండి

దేశంలో పులుల సంఖ్య పెరగడం సంతోషకరం. పర్యావరణ పరిరక్షణ అంటే వన్య ప్రాణుల సంతతి పెరిగేలా చూడడం కూడా. అడవుల వల్ల పులులకు, పులుల వల్ల అడవులకు రక్షణ ఉంటుందని మన పురాణాలు ఎప్పుడో చెప్పాయి. వన్యప్రాణులు ఉన్న ప్రదేశాలు పర్యాటక ప్రాంతాలుగానూ అభివృద్ధి చెందుతున్నాయి. దేశంలో పలుచోట్ల, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లండి. కుటుంబాలతో వెళ్లి ప్రకృతిని ఆస్వాదించండి. అక్కడికి వెళ్తే మీరు నూతన ఉత్సాహంతో తిరిగి వస్తారు. నన్ను నమ్మండి."

ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెద్దాం

సెప్టెంబరు 11వ తేదీన 'స్వచ్ఛతా హీ సేవ' (స్వచ్ఛతే సేవ) అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. అనంతరం అక్టోబరు 2న మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ప్లాస్టిక్‌పై పోరాటానికి శ్రీకారం చుడదాం. ఆ రోజును 'ప్లాస్టిక్ రహిత భారత మాత' కార్యక్రమంగా పాటించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని ఏ విధంగా పునర్వినియోగంలోకి తీసుకురావాలి అన్న విషయమై కార్పొరేట్ సంస్థలు జరిగే దీపావళి (అక్టోబరు 27)లోగా నిర్ణయం తీసుకోవాలి. సామాజిక సేవ చేయడం ద్వారా మహాత్మునికి కార్యాంజలి ఘటించాలి. ఆ రోజును శ్రమదాన ఉత్సవంగా జరుపుకోవాలి.

నేను హిందీలో మాట్లాడితే ఆయనకు ఆంగ్లంలో వినపడింది

దిల్లీ: హిందీలో అనర్గళంగా మాట్లాడే ప్రధాని..అసలు హిందీభాషే తెలియని సాహసికుడు బేర్‌గ్రిల్స్ మధ్య 'జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్'లో నిరంతరాయంగా సంభాషణ ఎలా కొనసాగింది? అందరికీ వచ్చిన సందేహం ఇది. తమ మధ్య సమాచార అంతరం లేకుండా సంభాషణ కొనసాగడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమే కారణమని మోదీ ఆదివారం చెప్పారు. 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రత్యేక ఎపిసోడ్ మొత్తం ఈ పార్క్‌లోనే సాగిన నేపథ్యంలో బేర్‌గ్రిల్స్‌కు హిందీ ఎలా అర్థమయిందని తనను కొందరు ప్రశ్నించినట్లు మోదీ తెలిపారు.

"బేర్‌గ్రిల్స్ చెవిలో కార్డ్‌లెస్ పరికరాన్ని అమర్చుకున్నారు. నేను హిందీలో ఓ మాట మాట్లాడగానే ఆయన(బేర్‌గ్రిల్స్)కు ఆంగ్లంలో అనువాదమై వినపడేది. వెంటనే ఆయన స్పందించేవారు. మా ఇద్దరి మధ్య సంభాషణ అలా సులువుగా సాగిపోయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తాలూకు అద్భుత కోణం ఇది' అని మోదీ ఆదివారం 'మన్ కీ బాత్'లో చెప్పారు.

ఇదీ సంగతి!



యడియూరప్ప సారు మీకోసం దీన్ని బహుమతిగా పంపించారు సార్!

భాజపాలో చేరనున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు భాజపా గూటికి చేరనున్నారు. తెరాసలో చేరాలని అనుకున్నా ఆ పార్టీ నుంచి 'స్పష్టమైన హామీ' రాకపోవడంతో మనసు మార్చుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఆయన సతీమణి సురేఖ మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. పార్టీ మార్పు అంశంపై ప్రేమ్‌సాగర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆయన ధ్రువీకరించారు. రెండు, మూడు రోజుల్లో చేరిక తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

లక్ష్మీ బ్యారేజీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

మహదేవ్‌పూర్, కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ(మేడిగడ్డ) బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం 25 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతం నుంచి 1.95 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా అంతే స్థాయిలో కిందకు వదులుతున్నారు. సరస్వతి(అన్నారం) బ్యారేజీకి ఇన్‌ఫ్లో 4100 క్యూసెక్కులు ఉండగా రెండు గేట్లను ఎత్తి 9,002 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు.

Admission Guidance
MBBS-BDS
BAMS-BHMS
Very Low Packages - Last 3 days only
GURU MITHRA, DSNR, HYD
9553170170, 8790511616

గుజరాత్ ఆవుకు ఒంగోలు దూడ

- తొలి ప్రయోగం విజయవంతం

కొండాపురం, న్యూస్‌టుడే: రైతులకు ఎంతో ప్రయోజనం కలిగించే ఓ ప్రయోగం విజయవంతమైంది. మేలు జాతి పశువుల ఉత్పత్తే లక్ష్యంగా నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం చేపట్టిన తొలి ప్రయోగం ఫలించింది. గుజరాత్ జాతి ఆవుకు ఒంగోలు జాతి దూడ పుట్టింది. ఐవీఎఫ్ టెక్నాలజీతో గత సంవత్సరం నవంబరులో థార్‌పార్కర్ (గుజరాత్) జాతికి చెందిన ఆవులో ఒంగోలు జాతి పిండాన్ని ప్రవేశపెట్టారు. ఫలితంగా ఆదివారం కోడె దూడ పుట్టిందని ఇన్‌ఛార్జి జేడీ రామన్ తెలిపారు. సాధారణంగా దూడ 23 కిలోల బరువుతో పుడుతుందని, ఈ ఒంగోలు జాతి కుర్ర దూడ 29.5 కిలోల బరువుతో ఆరోగ్యవంతంగా జన్మించిందని చెప్పారు.

థార్‌పార్కర్ ఆవుకు పుట్టిన ఒంగోలుజాతి దూడ

మద్దతు ధర కోసం మలిదశ ఉద్యమం

నిజామాబాద్, జగిత్యాల జిల్లా రైతులతో అడ్‌హక్ కమిటీల ఏర్పాటు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: పసుపు, ఎర్రజొన్న పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మలిదశ ఉద్యమం చేపట్టాలని రైతులు నిర్ణయించారు. ఆదివారం ఆర్మూర్‌లో సమావేశమైన నిజామాబాద్, జగిత్యాల జిల్లాల రైతులు భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించారు. రెండు జిల్లాల రైతులతో అడ్‌హక్ కమిటీలను ప్రకటించారు. ఈ నెల 29న మరో మారు సమావేశమై కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలను ఏర్పాటుచేసి రైతులను జాగృతం చేస్తామన్నారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో బస్సుయాత్ర చేపట్టి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యతను గుర్తుచేస్తామన్నారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించేందుకు, అన్ని పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా రైతులను ఒక్కతాటిపైకి తేవాలని ఈఉద్యమం చేపడుతున్నట్లు రైతునాయకులు తెలిపారు.

కాఫీ డే సిద్ధార్థ తండ్రి గంగయ్య కన్నుమూత

చిక్కమగళూరు(కర్ణాటక), న్యూస్‌టుడే: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కాఫీ డే వ్యవస్థాపకుడు సిద్ధార్థ తండ్రి గంగయ్య హెగ్డే (96) ఆదివారం మధ్యాహ్నం మైసూరు ఆసుపత్రిలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ కారణంగా సిద్ధార్థ ఆత్మహత్య విషయాన్ని గంగయ్యకు కుటుంబసభ్యులు తెలియనీయలేదు. చికిత్సలు చేసినా ఎంతకీ ఆరోగ్యం మెరుగుపడక గంగయ్య కన్నుమూశారు.



ఈనాడు
తెలుగు తేజాలు

పీవీ సింధు చిరకాల స్వప్నం, అశేష క్రీడాభిమానుల ఉత్కంఠ భరిత నిరీక్షణ- రెండూ నిన్న స్విట్జర్లాండ్‌లో ఫలించాయి. వరసగా మూడోసారి ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ తుది అంకానికి అర్హత సాధించిన తెలుగు తేజం, ఈసారి గురి తప్పకుండా లక్ష్యం ఛేదించి స్వర్ణం చేజిక్కించుకుంది. రెండేళ్లక్రితం ఇదే వేదికపై తనను ఓడించిన ప్రత్యర్థి నొజోమీ ఒకుహారాను తిరుగులేని ఆటతో ఉక్కిరిబిక్కిరి చేసిన సింధు ధాటిని 21-7, 21-7 తేడాతో ఒడిసిపట్టిన అద్భుత విజయం కళ్లకు కడుతుంది! ఈ పోటీల్లో అయిదో సీడ్‌గా బరిలోకి దిగిన సింధుకు క్వార్టర్ ఫైనల్ దశలో రెండో సీడ్ తైజు యింగ్ (చైనీస్ తైపీ) రూపేణా గట్టిపోటీ ఎదురైంది. ఆ హోరాహోరీ పోరులో తొలుత వెనకబడినా పుంజుకొని కడకు జయభేరి మోగించిన భారత మేటి షట్లర్, సెమీస్‌లో మరింత నిలదొక్కుకుంది. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్, ప్రపంచ మూడో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా)ను మట్టి కరిపించి ఫైనల్లోకి దూసుకెళ్లిన సింధుకు నిన్న పట్టిందల్లా బంగారమై కొట్టిన షాట్లెన్నో పాయింట్లు తెచ్చిపెట్టాయి. సిసలైన విజేత తాలూకు ఆత్మవిశ్వాసం ప్రత్యర్థిని ఎలా కకావికలం చేయగలదో నిన్నటి ఏకపక్ష పోటీ సోదాహరణంగా తెలియజెప్పింది! ఆరు సంవత్సరాల క్రితం పద్దెనిమిదేళ్ల వయసులో తొలిసారి ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడి కాంస్యం గెలిచిన సింధు, మరుసటి ఏడాదీ దాన్ని పునరావృతం చేసింది. గత రెండేళ్లుగా చివరి మెట్టుపై తడబడి రజతంతో సరిపుచ్చుకొన్నా, ఈసారి సర్వశక్తులూ కేంద్రీకరించి విశ్వవిజేత హోదాలో స్వదేశానికి తిరిగి వెళ్లాలన్న పట్టుదల ఆమె ఆటలో ఉట్టిపడింది. ప్రధాని మోదీ చెప్పినట్లు- ఇటువంటి గెలుపు కొన్ని తరాల్ని ఉత్తేజితం చేస్తుంది. 1983లో ప్రకాశ్ పదుకొణె కాంస్యం నెగ్గిన దరిమిలా ఇన్నేళ్లకు మళ్లీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో పతకం సాధించినవాడిగా సాయి ప్రణీత్ ఒకవంక, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులెవరికీ ఇప్పటిదాకా సాధ్యం కాని పసిడిని కొల్లగొట్టిన సింధు మరోపక్క- తెలుగు తల్లి ముద్దుబిడ్డలుగా యావత్ భారతావని జేజేలందుకుంటున్నారు!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అయిదు పతకాలు అందుకున్న ఘనత ఇప్పటివరకూ చైనా దిగ్గజం జాంగ్ నింగ్‌కే పరిమితమైంది. ఆ రికార్డును సమం చేసిన ఖ్యాతి నేడు సింధు ఖాతాలో జమపడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, మేటి గురువు గోపీచంద్ శిష్యరికంతో రాటుతేలిన సింధు సహజసిద్ధ ప్రతిభాపాటవాలను ఆసియా క్రీడలు, కామన్వెల్త్ వేదికలపై రజతాల తోపాటు రియో ఒలింపిక్స్‌లో వెండి ప్రదర్శన ఎలుగెత్తి చాటినా- కీలక స్పర్ధల్లో ఆఖరి దశలో విఫలమవుతుందన్న విమర్శలు ఇన్నాళ్లూ వెన్నాడాయి. వాటన్నింటికీ ఒకుహారాపై సింధు నిన్న జరిపిన పదునైన దాడే సరైన సమాధానం. 2013లోనే అత్యంత పిన్న వయస్కురాలైన ఛాంపియన్‌గా నిలిచిన రచనోక్ ఇంతనాన్ (థాయ్‌లాండ్)ని ఈసారి సెమీస్‌లో పరాజయం పాల్జేసిన ఒకుహారా నిర్ణయాత్మక ఫైనల్‌లో ఓ పట్టాన కొరుకుడు పడదన్న అంచనాలు ఒక దశలో భయపెట్టాయి. గత నెలలో ఇండొనేసియా ఓపెన్ పోటీల్లో ఒకుహారాను కంగుతినిపించిన సింధు నిన్నా అదే ఒరవడి కొనసాగించి భారతీయ క్రీడాప్రతిభ వేరెవరికీ తీసిపోదని సగర్వంగా నిరూపించింది! కొన్నేళ్లుగా చైనా, జపాన్, థాయ్‌లాండ్, స్పెయిన్ ప్రభృత దేశాలనుంచి బ్యాడ్మింటన్ క్రీడాకారులు విరివిగా పుట్టుకొస్తున్నారు. భారత్‌కు సంబంధించి ప్రకాశ్ పదుకొణె, సయ్యద్ మోడీ, ఆపై గోపీచంద్‌ల తరవాత సైనా, సింధు, శ్రీకాంత్, ప్రణీత్ వంటి ఏ కొన్ని పేర్లో మాత్రమే వినిపిస్తుండటానికి కారణమేమిటి? ప్రజ్ఞాపాటవాలు దండిగా ఉన్నప్పటికీ ముడివజ్రాల్ని గుర్తించి సానపట్టే ప్రణాళికాబద్ధ కృషి దేశంలో కొరవడుతోంది. కుటుంబ నేపథ్యం, రాజకీయ పరిచయాలు, ఆర్థికంగా దన్ను... ఇవేమీ లేని అభాగ్యుల్నీ సమాదరించే వ్యవస్థాగత ఏర్పాట్లు చురుకందుకోవాలేగాని- బ్యాడ్మింటన్ రంగాన మరెన్నో ఆణిముత్యాలు వెలికివస్తాయి.

ఒక్క బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసమే 15వందలకుపైగా ప్రత్యేక శిక్షణాలయాలు అవతరింపజేసిన చైనా- ఆటగాళ్లను శిక్షకులను ఎంపిక చేసేందుకు ఆరంచెల కమిటీని కొలువుతీర్చింది. బ్యాడ్మింటన్ ప్రపంచ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగుల జాబితాల్లో బలమైన ఉనికి చాటుకుంటున్న ఇండొనేసియా, డెన్మార్క్, తైపీ, హాంకాంగ్, థాయ్‌లాండ్ తదితర దేశాలూ ఎంపిక, శిక్షణలకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. సంపన్న రాజ్యాల్లో క్రీడను పరిశ్రమగా గుర్తిస్తున్నారు. మనకన్నా భౌగోళికంగా, వనరులపరంగా చిన్నవైన ఎన్నో దేశాలూ ఆటలకు ప్రోత్సాహమివ్వడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తున్నాయి. ముఖ్యంగా బ్యాడ్మింటన్‌కి సంబంధించి అత్యధునాతన వసతులతో కూడిన భారీ శిక్షణాలయాలు, విస్తృత ప్రాతిపదికన సకల సదుపాయాల పరికల్పనకు పకడ్బందీ ఏర్పాట్లు ఆయా దేశాల్లో పెద్దయెత్తున మెరికల్ని తీర్చిదిద్దుతున్నాయని గతంలో సైనా నెహ్వాల్ చేసిన విశ్లేషణ అక్షర సత్యం. బ్యాడ్మింటన్ క్రీడకు భారత దేశమే పుట్టినిల్లు. అటువంటి చోట వివిధ దశల్లో అన్నీ కలిసొచ్చిన ఏ కొందరో పతకవీరులుగా మిగిలినన్నాళ్లు- ప్రతిష్ఠాత్మక వేదికలపై ఇండియా ప్రాతినిధ్యం ఇతోధికమయ్యే అవకాశం ఏర్పడదు. ఒక్క సింధు, సైనాలనేముంది- సానియా, ఆనంద్, ఉష వంటివారూ కుటుంబ ప్రోత్సాహం, స్వీయ క్రమశిక్షణలతోనే భిన్న క్రీడాంశాల్లో తమదైన ముద్ర వేయగలుగుతున్నారు. భారత్ తరపున ఏ కొంత మంది వ్యక్తులో తప్ప వ్యవస్థ బలిమి చాటే పరిస్థితి ఇప్పటికీ లేకుండాపోవడం జాతికి శోభస్కరం కాదు. పాఠ్యపుస్తకాల్లో క్రీడా సంస్కృతిని అంతర్భాగం చేసి- అథ్లెటిక్స్, ఈత వంటి ఇతర క్రీడాంశాల్లోనూ ప్రణాళికాబద్ధంగా శిక్షణ కార్యక్రమం పట్టాలకు ఎక్కడమన్నది, జాతీయ అజెండాగా చురుగ్గా అమలు కావాలి. అటువంటి చొరవే విరివిగా విశ్వవిజేతలు, ఒలింపియన్ల ఆవిర్భావానికి దోహదపడుతుంది!

పోలవరానికి ని'బంధనాలు'

చెరుకూరి వీరయ్య



సవ్యాంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వం కుదుర్చుకున్న కొన్ని ఒప్పందాలను రద్దు చేసింది. నవయుగ, బెకం వంటి నిర్మాణ సంస్థలను పనుల నుంచి తప్పిస్తూ ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ నోటీసులు జారీచేసింది. పరస్పర అంగీకారంతో ఈ ఒప్పందాలను రద్దు చేసుకునేందుకు జలవనరుల శాఖ నిర్ణయించింది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నవయుగ సంస్థ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. ఆ సంస్థ వాదనతో హైకోర్టు ఏకీభవిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది.

రద్దుకు కారణాలివీ...

ప్రభుత్వ వాదన ప్రకారం- పనులన్నీ నామ నిర్దేశ (నామినేషన్) పద్ధతిలో అప్పగించారు. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఇ.పి.సి) పనులను ఏకమొత్తం పద్ధతిలో ఇవ్వడం సరికాదు. ఒప్పంద నిబంధనలను మినహాయిస్తూ డీజిల్, స్టీల్, సిమెంట్‌లకు పనులతో కలిపి కాకుండా, ప్రత్యేకనిధి ద్వారా చెల్లింపులు జరపడం నిబంధనలకు విరుద్ధం- ఈ కారణాలను ఏకరవు పెడుతూ ఒప్పందాన్ని ముందస్తుగా ముగించుకునేందుకు నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుత ఒప్పందాన్ని రద్దుచేసుకొని, కొత్త టెండర్లను పిలవనున్నట్లు ప్రభుత్వం నోటీసుల్లో పేర్కొంది. అధిక విలువైన పనులకు టెండర్లు పిలవకుండా నామనిర్దేశ (నామినేషన్) పద్ధతిలో గుత్తేదారు సంస్థలకు అప్పగించడం సరైనది కాదని రాష్ట్రప్రభుత్వం చూపిన కారణాలు సబబైనవే. పనులను వేగంగా పూర్తి చేయకపోవడం వల్ల ఈ సంస్థలతో ఒప్పందాలను రద్దుచేయడం లేదని, మళ్లీ నవయుగ సంస్థ కొత్తగా టెండర్లలో పాల్గొనవచ్చునని వెసులుబాటు కల్పించింది. ఒప్పందాల రద్దు వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఏటా నిర్మాణ సామగ్రి, శ్రామికుల కూలీ ధరలు పెరగడం తెలిసిందే. ఫలితంగా కొత్త టెండర్లలో గుత్తేదారులు ఊటంకించే పనుల విలువలు, ప్రస్తుతం రద్దుచేసే ఒప్పంద విలువల కంటే ఎంతోకొంత ఎక్కువగా ఉంటాయేగానీ, తక్కువగా ఉండటానికి ఆస్కారం లేదు. గతంలో ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ నుంచి 60సి నిబంధన కింద కొత్త పనిని తప్పించి, అంచనాలపై 14 శాతం తక్కువ ధరలకే ప్రభుత్వం నవయుగ సంస్థకు అప్పగించింది. ఇప్పుడు టెండర్లలో పాల్గొనే కొత్త గుత్తేదార్లుగానీ, చివరకు గతంలో పనిచేసిన నవయుగ సంస్థగానీ, పాత ధరలకు పనిచేయడానికి ముందుకు రాకపోవచ్చు. వారు కొత్త టెండర్లలో ఉటంకించే పనుల ధరలు ఇప్పుడు రద్దుచేసిన ఒప్పందాలలోని ధరల కంటే ఎక్కువగా ఉంటాయి. కొత్తగా పనులను దక్కించుకొనే గుత్తేదార్ల సంస్థలు పనులను ప్రారంభించి చురుకుగా సాగించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విధంగా ప్రస్తుత గుత్తేదార్ల ఒప్పందాలను రద్దుచేయడం వల్ల, పనులను పూర్తిచేయడంలో విపరీతమైన జాప్యంతోపాటు, నిర్మాణ విలువలు కూడా పెరిగిపోతాయి. దీనివల్ల అధికవ్యయంతోపాటు, ప్రాజెక్టు వల్ల కలిగే ఫలితాలు లబ్ధిదారులకు అందజేయడంలో ఆలస్యం జరుగుతుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు ప్రస్తుత ఒప్పందాలను రద్దుచేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి.

2014 ఏప్రిల్ ఒకటి నుంచి ప్రాజెక్టు సాగునీటి విభాగానికయ్యే ఖర్చును వంద శాతం భరించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ, ప్రాజెక్టు అనుమతులు, బాధ్యతలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి అప్పగించారు. ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంవల్ల, పనులు వేగంగా పూర్తయి, సాగునీటి సౌకర్యం కలుగుతుందని, దానివల్ల రాష్ట్రానికి పెద్దయెత్తున లబ్ధి చేకూరుతుందని కేంద్రం పేర్కొంది.

ప్రాజెక్టు విశిష్టత

ప్రాజెక్టు వల్ల దాని పరివాహక ప్రాంతంతో సంబంధం లేకుండా, ఉత్తరాంధ్ర నుంచి దిగువన అనంతపురం వరకు మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం కలుగుతుంది. దీనివల్ల కృష్ణా డెల్టాకు సకాలంలో నీరందుతుంది. ఆ మేరకు నీటిని శ్రీశైలం జలాశయంలో ఉంచుకొని, రాయలసీమకు కృష్ణా జలాలు అందించవచ్చు. స్పిల్‌వే, రాతి-మట్టి డ్యాములను (ఎర్త్‌కమ్ రాక్ అండ్ లోడ్యామ్స్) ఒకే వరుసలో నిర్మిస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్టు దేశంలో మరొకటి లేదు. రాతి-మట్టి డ్యామ్ కింద నదీగర్భంలో 150 అడుగుల లోతు నుంచి డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మిస్తున్నారు. ఈ రాతి-మట్టి కట్ట పొడవు 175 మీటర్లు. కింది భాగంలో కట్టవెడల్పు 300 మీటర్లు. ఈ కట్ట గరిష్ఠంగా 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకోగలదు. ప్రధానమైన స్పిల్‌వేకి 48 గేట్లుంటాయి. ఒక్కొక్క గేటు సైజు 16 మీటర్లు × 20 మీటర్లు. ఈ గేట్లను ప్రాజెక్టు సమీపంలోనే తయారు చేస్తున్నారు. ప్రాజెక్టు పనులలో గతంలో రోజుకు సుమారు నాలుగు వేల మంది కార్మికులు శ్రమించారు. పనుల్లోని సాంకేతిక సంక్లిష్టతల దృష్ట్యా కొన్ని విదేశీ సంస్థలను ఇందులో భాగస్వాములుగా చేర్చుకున్నారు. ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న భారీక్రేన్లు, టిప్పర్లు, టెలీబెల్ట్ యంత్రాలను విదేశాల నుంచి తెప్పించారు. గట్టు మీద నుంచే 250 మీటర్ల పరిధిలో కాంక్రీటు వేయగల టెలీబెల్ట్‌లను వినియోగిస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, దీనికయ్యే మొత్తం వ్యయాన్ని తామే భరిస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆ వ్యయాన్ని జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ద్వారా ఇప్పిస్తామని భరోసా ఇచ్చింది. పోలవరానికి ప్రాధాన్యం ఇస్తూ, 2018 నాటికే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని నాటి కేంద్రమంత్రి ఉమాభారతి పేర్కొనడం గమనార్హం!

ప్రాజెక్టుకు 1981లో శంకుస్థాపన చేశారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన తరవాత తొలి క్యాబినెట్ సమావేశంలోనే ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న తెలంగాణలోని ఏడుమండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడంతో ఒక సమస్య పరిష్కారమైంది. మొత్తం 30 లక్షల ఘన మీటర్ల కాంక్రీటు పనుల్లో 2018 జనవరి ఒకటి వరకు అయిదు లక్షల ఘన మీటర్ల పని మాత్రమే చేసిన ట్రాన్స్‌ట్రాయ్‌ను తప్పించి, మిగిలిన 25 లక్షల ఘన మీటర్ల కాంక్రీటు పనిని 2019 మార్చి నాటికి పూర్తిచేయాలన్న షరతుతో రాష్ట్రప్రభుత్వం నవయుగ నిర్మాణ సంస్థకు అప్పగించింది. అనంతరం కాంక్రీటు పనులు వేగం పుంజుకున్నాయి. 2018 నవంబరు 25న ఒక్కరోజులో 11,248 ఘన మీటర్ల కాంక్రీటు వేశారు. చైనాలోని త్రీగార్జెస్ డ్యాములో గతంలో ఒక్క రోజులో వేసిన 13,000 ఘన మీటర్ల కాంక్రీటు ఇప్పటివరకు ప్రపంచరికార్డుగా ఉంది. దీనిని అధిగమించడానికి పోలవరంలో ఏర్పాట్లు జరుగుతూ వచ్చాయి. ఇంతలో పనులు ఆపివేశారు. మళ్లీ ఎప్పుడు కొత్త టెండర్లను పిలుస్తారో, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో, వేగం పుంజుకొని అవి ఎప్పటికి పూర్తవుతాయో వేచి చూడాల్సిందే. నిబంధనలు ప్రాజెక్టుల పురోగతికి దోహదపడాలి తప్ప, వాటిని అడ్డుకోవడానికి కాదన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలి!

(రచయిత- సాగునీటి రంగ నిపుణులు)

పనుల పురోగతిలో అడ్డంకులు

నిర్మాణ పనులను కేంద్రం తరపున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టడానికి పచ్చజెండా ఊపింది. పనుల సమన్వయం, నాణ్యత నియంత్రణ, ఆకృతి,

వ్యయానికి రెక్కలు

ప్రస్తుత ధరలను పరిగణనలోకి తీసుకుంటే ప్రాజెక్టు అంచనా వ్యయం గణనీయంగా పెరిగే అవకాశముంది. నవయుగ సంస్థ పనితీరు బాగుందని, ఒప్పందాల రద్దుతో జాప్యం తప్పదని, వ్యయం పెరిగితే కేంద్రం భరించబోదని, నైపుణ్యం, ఆకృతుల పరంగా సమన్వయానికి పూచీ ఎవరని, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఛైర్మన్ ఆర్. కె.జైన్ ఇటీవల ప్రశ్నించారు. ట్రాన్స్‌ట్రాయ్ నుంచి నవయుగ సంస్థకు పనులను అప్పగించినప్పుడు మూడు నెలల సమయం వృథా అయిందని, ఇప్పుడు మరో మూడు నెలలు వృథా అయితే ఒక సీజను పోతుందని పీపీఏ పేర్కొంది. మొదట్లో మధుకాన్ కంపెనీ పనులు చేస్తున్నప్పుడు వాటిని రద్దు చేసి, ట్రాన్స్‌ట్రాయ్ సంస్థకు ఇవ్వడానికి నాలుగేళ్ళు పట్టిన విషయాన్ని పీపీఏ అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా జాప్యం జరగదన్న పూచీ ఏమిటని పీపీఏ ప్రశ్నించింది. నవంబరు ఒకటో తేదీ కల్లా పనులు ప్రారంభిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వాధికారుల వాదనతో పీపీఏ అధికారులు ఏకీభవించడం లేదని తెలుస్తోంది.

ప్రాజెక్టు అంచనాలు క్రమానుగతంగా పెరుగుదల

2010-11 ఆర్థిక సంవత్సరంలో సవరించిన ప్రాజెక్టు అంచనా వ్యయం	కోట్ల రూపాయల్లో రూ.16,010.45
2013-14 నాటి లెక్కల ప్రకారం	రూ.58,319
ప్రధాన డ్యామ్ పనులకు	రూ.42,905.78
ఎడమ కాలువ పనులకు	రూ.6,362.29
కుడి కాలువ పనులకు	రూ.4,845.33
విద్యుత్కేంద్రం నిర్మాణానికి	రూ.4,205.66

భూసేకరణ, పునరావాసం నిమిత్తం రూ.33,858.40 కోట్లు కేటాయించారు

కాంగ్రెస్‌లో భిన్నగళాలు

అధికార పక్షంతో ఎలా వ్యవహరించాలన్న విషయంలో కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు కేంద్ర ప్రభుత్వం ఏం చేసినా విమర్శిస్తున్నారు. మోదీ సర్కారు పాలన తీరుతెన్నులపై సందు దొరికితే చాలు విరుచుకుపడుతున్నారు. గడచిన అయిదేళ్లుగా వారు ఇదే పంథా అనుసరించారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తరవాతా వారి వైఖరిలో మార్పు రాలేదు. కేంద్ర ప్రభుత్వంపై తాము ఎక్కుపెడుతున్న విమర్శలకు ప్రజలనుంచి తగిన స్పందన వస్తుందా అన్న విషయంలో ఇప్పుడిప్పుడే ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా పార్టీ తన తీరు మార్చుకోవాల్సిన అవసరాన్ని కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు ఉద్బోధిస్తుండటం విశేషం.

కాంగ్రెస్ పార్టీలో హేతుబద్ధంగా మాట్లాడే నాయకుడిగా పేరున్న జైరామ్ రమేశ్ ఇటీవల వెలువరించిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. 'నరేంద్ర మోదీ పరిపాలన తీరును ప్రతిసారీ రాక్షసంగా చిత్రీకరించడం బెడిసికొడుతోంది. అయిదేళ్ల పరిపాలన పూర్తిగా ప్రతికూలతల మయం కాదు' జైరామ్ రమేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఆలోచనాత్మకమైనవి. ముఖ్యంగా మోదీ ప్రభుత్వం పాలన క్రమంలో ఆర్థికాంశాలను ఒడుపుగా అంతర్భాగం చేసిన తీరు ఆకర్షణీయంగా ఉంది. దేశవ్యాప్తంగా పేద కుటుంబాల్లోని మహిళలకు 'ఉజ్వల' పథకం కింద వంట గ్యాసు కనెక్షన్లు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా ఎంతగానో కలసివచ్చిన అంశం. కాంగ్రెస్‌కు చెందిన మరో సీనియర్ నాయకుడు అభిషేక్ సింఘ్వి సైతం 'మోదీ ఏలుబడిపై రాక్షస ముద్ర వేయడం తప్పు' అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. మోదీ ప్రభుత్వ పనితీరును అది తీసుకున్న నిర్ణయాల ప్రాతిపదికన విశ్లేషించాలేగానీ- వ్యక్తులను బట్టి కాదు' అంటూ ఆయన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు దిశానిర్దేశం చేసే ప్రయత్నం చేశారు. ప్రజోపయోగకరమైన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకున్నప్పుడు ఏనాడూ వాటి గురించి ప్రశంసాపూర్వకంగా కాంగ్రెస్ అధినాయకత్వం ఒక్క మాటా చెప్పిన దాఖలాలు లేవు.

'జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370 అధికరణ రద్దు నిర్ణయం దేశమంతటా చర్చనీయాంశమైంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వివిధ వర్గాలు ప్రశంసించాయి. ఉభయసభల్లో ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టడం, ఆ వెన్వెంటనే దానికి ఆమోదం లభించడం ఒకరకంగా కాంగ్రెస్ పార్టీని గందరగోళంలోకి నెట్టింది. ఆ అంశంపై కాంగ్రెస్ నాయకులు ఎలా స్పందించాలో తెలియని పరిస్థితిలో కూరుకుపోయారు. ఎందుకంటే '370 అధికరణ'ను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకొని తీరాలంటూ వివిధ సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి సంకల్పాలు చెప్పుకొంది. 'జమ్ము కశ్మీర్‌కు సంబంధించి ప్రస్తుతం ఉన్న రాజ్యాంగబద్ధ పరిస్థితిని మార్చడంగానీ, అలాంటి ప్రయత్నాలను అనుమతించడంగానీ జరగబోదు' అని గడచిన ఏప్రిల్‌లో పార్టీ ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ స్పష్టంగా పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలోనూ కాంగ్రెస్ పార్టీ తన అధికారిక విధానానికి కట్టుబడక తప్పలేదు. ఒకరకంగా ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు ఒకే వాదన వినిపించారు. పుల్వామా దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బాలాకోట్‌పై మెరుపుదాడులు చేయడం సంచలనం సృష్టించింది. బాలాకోట్ ప్రాంతంలో పాక్ ప్రాయోజిత ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేస్తూ అత్యంత ధైర్య సాహసాలతో, నిబద్ధతతో భారతీయ సైన్యం నిర్వహించిన మెరుపుదాడులను దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ప్రశంసించారు. ఆ తరహా మెరుపుదాడులు తమ జమానాలో అనేకసార్లు నిర్వహించామని పేర్కొంటూ కాంగ్రెస్ పెద్దలు వెలువరించిన వ్యాఖ్యలు విస్తుగొలిపాయి. మరోవంక ఆ పార్టీకి చెందిన మహారాష్ట్ర నాయకుడొకరు 'మెరుపుదాడుల'ను అబద్ధంగా తీర్మానించేశారు. దాడులకు రుజువులు చూపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం డిమాండ్ చేయడం జాతి జనులను నిర్ఘాంతపరచింది. మెరుపుదాడుల పేరిట ప్రధాని మోదీ రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ శిబిరాలపై మెరుపులా విరుచుకుపడి వాటిని ధ్వంసం చేసిన భారతీయ వైమానిక దళం ధైర్యసాహసాలను శ్లాఘించకపోగా- ఆ దాడులే జరగలేదన్నట్లుగా కొందరు కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం నిర్ఘాంతపరచింది. భారతీయ వైమానిక దళాన్ని అగౌరవపరుస్తూ కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రకటనలను జనం స్వాగతించలేదు. 'మీరు చెట్లను కూల్చడానికి వెళ్ళారా లేక ఉగ్రవాదులనా?' అంటూ మరో కాంగ్రెస్ నాయకుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ హేళనపూర్వకంగా మాట్లాడారు.



జైరామ్ రమేశ్ అభిషేక్ సింఘ్వి

విధాన రాహిత్యంతో చిక్కులు

దేశంలో ఆరుకోట్ల కుటుంబాలకు వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజికంగా సానుకూల మార్పునకు కారణమైంది. మరో రెండు కోట్లమందికి ఇంకో ఏడాదిన్నరలోగా 'ఉజ్వల పథకం' కింద వంట గ్యాస్ కనెక్షన్లు లభించబోతున్నాయి. పేద కుటుంబాలకు ఏడాదికి అయిదు లక్షల మేర వైద్య బీమా కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా చెప్పుకోదగిన మార్పునకు కారణమైంది. దేశవ్యాప్తంగా 'జన్‌ధన్' యోజన కింద దారిద్ర్య రేఖ దిగువన ఉన్న 36కోట్ల మందికి కొత్తగా బ్యాంక్ ఖాతాలు తెరవడం గణనీయమైన చర్యే. దేశ ప్రజల జీవన విధానంలో సానుకూల మార్పునకు కారణమైన పథకాలను ప్రశంసించకపోయినా ఫరవాలేదు- కాంగ్రెస్ పెద్దలు కనీసం వాటిని చీల్చి చెండాడకుండా అయినా ఉండాల్సింది. ప్రజల్లో విశ్వాస పునరుద్ధరణకు రొడ్డకొట్టుడు విమర్శలు పక్కనపెట్టి- కాంగ్రెస్ పార్టీ మరింత నిర్మాణాత్మక మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది. ఆ క్రమంలో జైరాం రమేశ్ వంటివారి వ్యాఖ్యలను సహేతుకంగా అర్థం చేసుకోవాల్సి ఉంది!

– వీరేంద్రకపూర్

ఈనాడు లేఖలు

అవయవ దానంపై చైతన్యం

తీవ్రమైన వ్యాధులు, ప్రమాదాల కారణంగా కొంత మందికి అవయవాల మార్పిడి అవసరమవుతుంది. అలాంటి వారికి అవయవాలను దానం చేసే సంస్కృతి సమాజంలో పెరగాల్సిన అవసరం ఉంది. ఎంత డబ్బున్నా, దాతలు లేకపోతే ప్రయోజనం లేదు. మరణానంతరం అవయవాలను దానం చేయడం ద్వారా మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఏ కొందరో ఈ సత్కార్యానికి మొగ్గు చూపుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో మరణించే వారి అవయవాలను వారి కుటుంబసభ్యులు దానం చేస్తే మరికొందరికి జీవితం ఇచ్చినట్లవుతుంది. ఈ అంశంపై స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలి. అవయవ దానం దిశగా వారిలో చైతన్యం కలిగించాలి.

- ఎం. కృష్ణమనాయుడు, కూకట్‌పల్లి, హైదరాబాద్

మట్టి గణపతి మేలు

జలవనరులను సంరక్షించు కోవలసిన సమయమిది. వినాయక చవితి సందర్భంగా రంగుల విగ్రహాలను కాకుండా, మట్టి గణపతిని పూజించడానికి ప్రజలు సిద్ధం కావాలి. దీనివల్ల నిమజ్జనం పేరుతో చెరువులు, నదులు కలుషితమయ్యే ప్రమాదం చాలా వరకూ తగ్గుతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయ్యారయ్యే విగ్రహాలను నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తే వాటిల్లోని జలచరాలకు హాని కలుగుతుంది. ఆ నీటిని వాడే పంటపొలాలకు నష్టం వాటిల్లుతుంది. మంచినీటిని చేజేతులా కలుషితం చేసినట్లవుతుంది. ఇప్పటికే పర్యావరణ సమతుల్యత లోపించడంతో అతివృష్టి, అనావృష్టి రూపంలో ప్రకృతి ప్రకోపాన్ని చూస్తున్నాం. ఇప్పటికైనా పర్యావరణాన్ని రక్షించుకోవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాల్సిన అవశ్యకత ఉంది.

- రామస్వామి కుమారస్వామి, నయీంనగర్, వరంగల్

విరాట పర్వం

అంతర్యామి

మహాభారతంలోని అష్టాదశ పర్వా

ఆయుష్మాన్ ఆస్ట్రేలియా!

పురుషుల జీవితకాలం ఆ దేశంలో ఎక్కువ

కాలం మారుతోంది.. ఆరోగ్యం కాపాడుకోవడంపై శ్రద్ధ ఎక్కువైంది.. మనిషి సగటు ఆయుర్దాయమూ పెరుగుతోంది. ప్రత్యేకించి మగవాళ్ల విషయానికొస్తే.. ప్రపంచంలోనే ఆస్ట్రేలియాలో వారి సగటు జీవితకాలం ఎక్కువని తేలింది. ఇక్కడ వారి ఆయుర్దాయం 74.1 సంవత్సరాలుగా అంచనా. డాక్టర్ కోలిన్ పెయిన్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ జాతీయ విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. మహిళలకూ ఈ అధ్యయనం శుభవార్తనే అందించింది. స్విట్జర్లాండ్ తర్వాత ఆస్ట్రేలియన్ మహిళలే ఎక్కువ కాలం జీవిస్తున్నట్లు తేలింది.

అధ్యయనం సాగిందిలా..

- నేటి వయోధికుల తరం జీవించిన విధానాన్ని పరిగణలోకి ఆయుప్రమాణాలను నిర్దేశించారు.
- ఐరోపా, ఉత్తర అమెరికా, ఆసియాల్లోని 15 దేశాల నుంచి సమాచారం సేకరించారు.
- నిర్దిష్ట కాలంలో, వివిధ వయోవర్గాల్లో మరణాల రేటును ఓ ప్రాతిపదికగా తీసుకున్నారు. 50, 60, 70 ఏళ్ల క్రితం నాటి మరణాల రేటును కూడా కొలమానంగా చేసుకున్నారు.
- త్వరగా చనిపోయిన వారు, ఎక్కువ కాలం జీవించిన వారి వివరాలను అధ్యయనం చేసి ఆ ప్రాతిపదికన సగటు ఆయుర్దాయ గణాంకాలను నిర్ధారించారు.
- ఒకే సంవత్సరంలో జన్మించిన వారి వివరాలను ఆయుఃప్రమాణ నిర్ధారణకు ఒక అంశంగా పరిగణించారు.

ప్రథమ స్థానానికి సోపానాలు

- ఆస్ట్రేలియాలో సుస్థిర జీవనానికి ఉన్న అవకాశాలు.. అత్యున్నత జీవన ప్రమాణాలు ఈ పరిస్థితికి కారణం.
- ప్రజలకు తినడానికి తగినంత ఉండటం.. జీవితంలో పెద్ద ఒడుదుడుకులు, సంఘర్షణలు లేకపోవడం.

చారిత్రక నేపథ్యం కీలకం..

సాధారణంగా ఆరోగ్యం, ఆయుర్దాయాల్లో జపాన్, ఉత్తర ఐరోపా దేశాల ప్రజలు మెరుగ్గా ఉంటారని ఎక్కువమంది భావన. ఇప్పుడు ఆస్ట్రేలియా ముందంజలో ఉంది. దీని వెనుక దశాబ్దాల చరిత్ర ఉంది. 30, 40, 50 దశకాల్లో జపాన్‌లో మరణాల రేటు అధికంగా ఉంది. అదే కాలంలో ఆస్ట్రేలియా మరణాల రేటు తక్కువగా ఉంది. ఈ కాలంలో ఫ్రెంచి జాతికి చెందిన పురుషుల ఆయుర్దాయమూ తక్కువగానే ఉంది. రెండో ప్రపంచ యుద్ధంలో అధికసంఖ్యలో ఫ్రెంచి దేశీయులు చనిపోవడం, ఇతర కారణాల రీత్యా అధికంగా ఫ్రెంచి పురుషుల మరణాలు సంభవించాయి.

– డాక్టర్ కోలిన్ పెయిన్

సగటు ఆయుర్దాయంలో తొలి ఐదు దేశాలు





భారత్‌లోనూ సగటు ఆయుర్దాయం పెరుగుతోంది. ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (యూఎన్‌పీఎఫ్), తదితర నివేదికల లెక్కల ప్రకారం ఇది 69.5 సంవత్సరాలు. ఆరోగ్య పరిరక్షణ విధానం మెరుగవుతున్నట్లు యూఎన్‌పీఎఫ్ వెల్లడించింది. ప్రసవాలు. . శిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గింది. 1994లో ప్రతి లక్ష జననాలకు 488 శిశు మరణాలు నమోదు కాగా ఆ సంఖ్య 2015 నాటికి 174కు తగ్గింది.

సగటు జీవితకాలం (సం.లు)
పురుషుల్లో 68.32 మహిళల్లో 70.78

- ఈనాడు ప్రత్యేక విభాగం

పువ్వెందుకే చిలకా.. ప్రియురాలికిచ్చేందుకా!

పువ్వును ముక్కున కరచుకుని విహరిస్తున్న ఈ రామచిలుకను చూడండి ఎంతముచ్చటగా ఉందో. .ఎవరికి ఇచ్చేందుకో ఏమో.. ఏకంగా పుష్పాన్నే ఒడుపుగా తుంచుకుని తుర్రుమంటోంది రామచిలుక. హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ఆదివారం 'ఈనాడు' కెమెరాకు చిక్కిందీ దృశ్యం.

-ఈనాడు, హైదరాబాద్

15 బ్లాకుల్లో సున్నపురాయి నిక్షేపాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా మూడు జిల్లాల్లోని 15 బ్లాకుల్లో సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి నిక్షేపాలను గుర్తించారు. సూర్యాపేట, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లో 6 క్లస్టర్లలోని 15 బ్లాకుల్లో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎండీసీ) నిర్వహించిన సర్వేలో ఈ నిక్షేపాలు వెలుగులోకి వచ్చాయి. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇప్పటికే పలుసున్నపురాయి గనులను సిమెంట్ కంపెనీలకు లీజుపద్ధతిలో కేటాయించారు. మరిన్ని నిక్షేపాలను అన్వేషించేందుకు 6 క్లస్టర్ల పరిధిలో 300 చ.కి.మీ.ప్రాంతాన్ని టీఎస్‌ఎండీసీకి అప్పగించారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ (ఎన్‌ఎంఈటీ) నిధులతో ఖనిజాభివృద్ధి సంస్థ ఈ క్లస్టర్లలో జీ-4 సర్వే నిర్వహించింది. 30 చోట్ల 50 మీటర్ల లోతు వరకు బోర్లు తవ్వి నమూనాలు సేకరించింది. వీటి రసాయన విశ్లేషణ ద్వారా అక్కడ సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కేంద్రానికి నివేదిక పంపనున్నారు. జీ-4 ఫలితాలను ఎన్‌ఎంఈటీకి పంపిన టీఎస్‌ఎండీసీ త్వరలో జీ-2 సర్వే చేయాలని నిర్ణయించింది. ఈ సర్వేలో సున్నపురాయి పరిమాణం, నాణ్యతపై స్పష్టత రానుంది.

సర్వే చేసిన బ్లాకులు

సూర్యాపేట జిల్లా: మేళ్లచెరువు, మల్లారెడ్డిగూడెం, యేపల మాధవరం, మరంపల్లి 1,2 బ్లాకులు, రఘునాథపాలెం 1,2బ్లాకులు, రామాపురం, దొండపాడు, కొత్తగూడెం

నల్గొండ జిల్లా: వాజిగూడెం, వీరప్పగూడెం

వికారాబాద్ జిల్లా: జివాంగి 1,2 బ్లాకులు, మల్కాపూర్

శౌచాలయంలో 3 కిలోల బంగారం

- శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుకున్న అధికారులు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: మరోసారి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా అక్రమ బంగారం పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ సాజీద్ సుమారు 3కిలోల బంగారంతో షార్జా నుంచి విమానంలో భారత్‌కు బయలుదేరాడు. సమాచారం అందుకున్న శంషాబాద్ కస్టమ్స్ అధికారులు విమానాశ్రయంలో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. సాజీద్ అధికారుల నుంచి తప్పించుకునే క్రమంలో తన వద్ద ఉన్న 26 బంగారు బిస్కెట్లను విమానాశ్రయంలోని శౌచాలయంలో వదిలి పారిపోయే ప్రయత్నం చేశాడు. అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బటయపడింది. 2,992 గ్రాముల ఈ బంగారం విలువ దాదాపు రూ.1.12 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

భారతీయ నర్సింగ్ మండలిలో కాళోజీ ఆరోగ్య వర్సిటీకి దక్కని చోటు

ఈనాడు, హైదరాబాద్: భారతీయ నర్సింగ్ మండలి(ఐఎన్‌సీ) గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల జాబితాలో తెలంగాణలోని కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి చోటు దక్కలేదు. దీనికి సంబంధించిన రాజపత్రాన్ని తాజాగా ఐఎన్‌సీ విడుదల చేయగా ఇందులో కాళోజీ వర్సిటీ పేరు లేదు. తమ విశ్వవిద్యాలయం ద్వారా నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొంటూ వాటికి గుర్తింపునివ్వాల్సిందిగా ఆరోగ్య విశ్వవిద్యాలయం గత నాలుగేళ్లుగా దరఖాస్తు చేస్తూనే ఉంది. అయితే ఏటా వేర్వేరు కారణాలతో ఐఎన్‌సీ తిరస్కరిస్తోంది. గుర్తింపు కోసం కాళోజీ విశ్వవిద్యాలయం రూ.5 లక్షలు చెల్లించాలని ఐఎన్‌సీ నిబంధనల్లో పేర్కొనగా, అందుకు కాళోజీ వర్సిటీ అధికారులు అంగీకరించలేదని సమాచారం. ప్రభుత్వ వర్సిటీ కావడం వల్ల తాము చెల్లించాల్సిన అవసరం లేదని సమాధానమిచ్చినట్లుగా తెలుస్తోంది. ఐఎన్‌సీ నిర్దేశించిన సమాచార పత్రం ప్రకారంగా అవసరమైన పత్రాలు సమర్పించకపోవడం వల్ల కూడా తిరస్కరణకు గురై ఉంటుందని కాళోజీ వర్సిటీ అధికారులు భావిస్తున్నారు. అవసరమైన పత్రాలను తిరిగి సమర్పిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆయుష్, ఎంసీఐ నుంచి కాళోజీ వర్సిటీకి గుర్తింపు లభించగా.. ఇంకా నర్సింగ్ మండలి, దంత వైద్య మండలి నుంచి గుర్తింపు పొందాల్సి ఉంది.

నేడు గుత్తా ప్రమాణ స్వీకారం

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు శాసనమండలిలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసనమండలి ఉపఛైర్మన్ నేతి విద్యాసాగర్ తమ కార్యాలయంలో ఆయనతో ప్రమాణం చేయిస్తారు.

హైదరాబాద్‌లో వన్‌ప్లస్ పరిశోధన, అభివృద్ధి కేంద్రం

కేటీఆర్ చేతుల మీదుగా నేడు ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ప్రసిద్ధ మొబైల్ సంస్థ వన్‌ప్లస్ దేశంలో ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి పరిశోధన కేంద్రాన్ని సోమవారం తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. నానక్‌రామ్‌గూడ ఆర్థికజిల్లాలోని వంశీరాం సోహ్మా టెక్‌పార్కులో ఈ కార్యక్రమం జరగనుంది. వన్‌ప్లస్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో పీట్‌లూ పాల్గొననున్నారు. దీని ద్వారా 500 మంది నిపుణులకు ఉపాధి కలగనుంది.

వినోద్‌కుమార్‌కు ట్రస్మా అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) ప్రతినిధులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, వివిధ జిల్లాల నేతలు తమ సమస్యలపై వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్లను కేటాయించాలని తెలంగాణ సినీ సంగీత దర్శకులు, గాయకులు వినోద్‌కుమార్‌ను కోరారు. వారు వినోద్‌ను ఆయన నివాసంలో కలిసి కొత్త పదవి చేపడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. వారి వినతులను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా వారికి వినోద్ హామీ ఇచ్చారు. భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, భిక్షపతి, టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావులు ఆదివారం వినోద్‌కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయానికో ఆలోచన

- సాగులో వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం
- 'అగ్రి ఉడాన్' కార్యక్రమానికి శ్రీకారం
- ఈ నెలాఖరున హైదరాబాద్‌లో ప్రారంభం
- నార్మ్ 'ఎ-ఐడియా' అంకురాలకు దేశవ్యాప్త గుర్తింపు

ఈనాడు – హైదరాబాద్

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నూతన విధానాలు, పద్ధతులను ప్రవేశపెట్టే వినూత్న ఆలోచన మీ దగ్గర ఉందా...అయితే దానికి రెక్కలు తొడిగి దేశమంతా ఎగిరేలా చేసేందుకు 'జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ'(నార్మ్) ప్రోత్సహిస్తుంది. ఇందుకోసం 'అగ్రి ఉడాన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని జాతీయస్థాయిలో నిర్వహించనుంది. దీనిని ఈ నెలాఖరున ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో భాగంగా 'అసోసియేషన్ ఫర్ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్ అగ్రికల్చర్'('ఎ-ఐడియా') అనే సొసైటీ ఉంది. దీనిద్వారా 'అగ్రి ఉడాన్' కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. 'ఎ-ఐడియా'ను కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ సహకారంతో సొసైటీగా గతంలో నమోదు చేశారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు సంబంధించిన 13 ఉప విభాగాల్లో నూతన ఆవిష్కరణలకు కార్యరూపం కల్పించేందుకు ఇది కృషి చేస్తోంది. ఈ విభాగాల్లో దేనిలోనైనా వినూత్న పద్ధతుల ద్వారా రైతులకు లేదంటే ప్రజలకు మరింత సులువుగా సేవలు అందించవచ్చనే ఆలోచన ఎవరి దగ్గర ఉన్నా దానికి ఒక రూపం ఇచ్చి క్షేత్రస్థాయిలో అమలుచేయడానికి ఎ-ఐడియా ప్రోత్సహిస్తుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఇలాంటి వినూత్న ఆలోచనలతో 771 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 60 అంకురాలను ఎంపిక చేయగా దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఈ 60లో 18 అంకురాలను క్షేత్రస్థాయిలోకి తెచ్చారు. వీటిని మార్కెటింగ్ చేయడానికి 105 మంది ముందుకొచ్చి రూ.9.35 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. నాబార్డు, పిక్కీ, యస్ బ్యాంక్ వంటివి ఎ-ఐడియాకు భాగస్వాములుగా పనిచేస్తున్నాయి. ఎ-ఐడియాను దేశప్రజలందరికీ మరింత చేరువ చేసేందుకు 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి'(ఐసీఏఆర్), నార్మ్‌లు సంయుక్తంగా అగ్రి-ఉడాన్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి. దీనిపై వచ్చే నెలలో 7 నగరాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ ప్రదర్శనల్లో వినూత్న ఆలోచనలతో వచ్చే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో ఎ-ఐడియాకు దరఖాస్తు చేయవచ్చు. వచ్చే అక్టోబరులో ఈ దరఖాస్తులను వడపోసి ఆసక్తి గల వాటిని ఎంపిక చేస్తారు. నవంబరులో తుది ఎంపిక చేసి కార్యరూపంలోకి తెచ్చేందుకు లక్ష్యాలను నిర్దేశిస్తారు. వచ్చే డిసెంబరు, జనవరిలో వాటిపై ప్రయోగాలు చేస్తారు. వచ్చే ఫిబ్రవరిలో వాటిని మార్కెట్‌లోకి, రైతుల పొలాల్లోకి ఎలా తీసుకెళతారో వివరించే ప్రదర్శనలను బెంగళూరు, ముంబయిలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ

- కార్యక్రమం పేరు– అగ్రి ఉడాన్
- ప్రారంభం – ఈ నెలాఖరులో
- ఏం చేస్తారు – వ్యవసాయానికి సంబంధించి 13 ఉప విభాగాల్లో వినూత్న ఆలోచనలను స్వీకరిస్తారు
- ఉప విభాగాలు– వ్యవసాయంలో సుస్థిర పెట్టుబడులు, స్మార్ట్ వ్యవసాయం, వినూత్న ఆహార సాంకేతికత, మార్కెట్‌కు సరఫరా సాంకేతికత, మత్స్యరంగం, భూసార, నీటి పరీక్షల సాంకేతికత, వ్యవసాయంలో ఐటీ, పాడి పరిశ్రమ, పట్టణ, నిలువు సేద్యం, అగ్రి బయోటెక్, పంటకోతల అనంతర సాంకేతికత, వ్యవసాయోత్పత్తుల చిల్లర మార్కెట్లు, వ్యవసాయ యంత్రాలు.
- వచ్చే నెలలో ప్రదర్శనలు ఏర్పాటు చేసే నగరాలు– బెంగళూరు, పుణె, పట్నా, లఖ్‌నవూ, గుడ్‌గావ్, భోపాల్, గువాహటి
- ఉద్దేశం – వినూత్న ఆలోచనలను ఎంపిక చేసి దేశవ్యాప్తంగా అమలయ్యేలా చూడటం

రైతుల ఆదాయాన్ని పెంచేలా ఉండాలి

మన రైతులు టమాటాలు పండిస్తారు. ఎక్కువగా పండినప్పుడు వాటికి ధర లేక నష్టపోతున్నారు. అలాంటి సమయంలో వాటి ఉత్పత్తులను సులభంగా తయారు చేసి ప్రజలకు అమ్మి రైతులకు ఆదాయం పెంచడానికి ఇప్పుడున్న విధానాలు కాకుండా ఇంకా సులభంగా ఎలా చేయవచ్చనే వినూత్న ఆలోచన ఎవరికైనా ఉంటే దానిని ఎ-ఐడియాకు చెప్పవచ్చు. ఇలా అన్నదాతల ఆదాయాన్ని పెంచే ఏ ఆలోచనకైనా ప్రోత్సాహమిస్తాం. దేశంలో ఏ ప్రాంతంవారికైనా ఎ-ఐడియాలో అవకాశం కల్పిస్తాం.

–సీహెచ్. శ్రీనివాసరావు, సంచాలకుడు, నార్మ్

సందేశమే బీమా పత్రం

- రైతు బీమా పథకంలో మార్పులు
- పంచాయతీ కార్యాలయంలో అర్హుల జాబితా
- నగదు చెల్లింపులకే ప్రభుత్వ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: రైతు బీమా పథకం అర్హులకు ఈఏడాది బీమా పత్రం (బాండ్) రాదు. దాని స్థానంలో రైతు సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సందేశం పంపేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి గ్రామంలో అర్హులైన రైతుల పేర్ల జాబితాను పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డుపై అతికించేలా చూడాలని యోచిస్తోంది. గతేడాది ఆగస్టు 14న ఈ పథకం ప్రారంభించాక రైతులందరికీ పత్రాలను అందజేశారు. ప్రతి రైతుకు రూ.5 లక్షల జీవిత బీమా ఉన్నట్లు అందులో ఉంది. ఈ పథకాన్ని ఈ ఏడాది ఈనెల 14 నుంచి ప్రభుత్వం తిరిగి కొనసాగిస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చింది. 18 నుంచి 59 ఏళ్లలోపు వయసు గల రైతులందరి తరపున రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఐసీకి ప్రీమియం కింద జీవితబీమా సంస్థ(ఎల్‌ఐసీ)కి రూ.908.30 కోట్లు చెల్లించింది. మొత్తం 31.10 లక్షల మంది రైతులకు బీమా కల్పించింది. మళ్లీ ప్రతీ రైతుకు బీమా పత్రం అందజేయడం వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారమని, ఆన్‌లైన్‌లో సమాచారం పంపితే సులభంగా ఉంటుందని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ పథకం కింద రైతు ఏదైనా కారణంతో కన్నుమూస్తే 10 రోజుల్లోగా అతని నామినీకి రూ.5 లక్షలను బీమా పరిహారంగా ఎల్‌ఐసీ అందజేస్తుంది.

నగదుకే నిర్ణయం

రైతు బీమా పథకం కింద రైతు మరణించినప్పుడు అతని నామినీకి ఒకేసారి రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కన్నా ప్రత్యామ్నాయ చెల్లింపులను పరిశీలించాలని ఎల్‌ఐసీ ప్రభుత్వానికి ఇటీవల సూచించింది. మరణించిన రైతు కుటుంబానికి ప్రతినెలా పింఛన్ చెల్లించడం లేదా రూ.లక్ష నగదు ఇచ్చి మిగతా సొమ్మును నెలకు కొంత చొప్పున ఇవ్వడం వంటి ప్రతిపాదనలను సూచించింది. వీటిని సీఎం కేసీఆర్ తిరస్కరించారు. మార్పులు లేకుండా రూ.5 లక్షల పరిహారాన్ని రైతు కన్నుమూసిన వెంటనే అందించాలని ఆదేశించారు. ఈనెల 14 నుంచి వచ్చే ఏడాది(2020) ఆగస్టు 13 వరకూ రైతులకు జీవిత బీమా వర్తిస్తుంది.

తిరుమల ప్రత్యేకాధికారి ధర్మారెడ్డికి డీడీలు అందజేస్తున్న రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్

శ్రీవారికి రిలయన్స్ రూ.1.11 కోట్ల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి రిలయన్స్ తరపున ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పీఎంఎస్ ప్రసాద్ రూ.1.11 కోట్ల విరాళాన్ని ఆదివారం సమర్పించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపానికి చేరుకుని తిరుమల ప్రత్యేకాధికారి ఏవీ ధర్మారెడ్డిని కలిసి విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. ఈ మొత్తాన్ని శ్రీవేంకటేశ్వర నిత్య అన్నప్రసాదం ట్రస్టు కింద డిపాజిట్ చేయాలని సూచించారు.

లక్కీడ్రాలో కారు గెలిచారంటూ బురిడీ

- రూ.16.33 లక్షలు దండుకున్న సైబర్ నేరస్థుడు
- బాధితుడు ఖమ్మం జిల్లా వాసి

కూసుమంచి, న్యూస్‌టుడే: లక్కీడ్రాలో కారు గెలిచారంటూ ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.16.33 లక్షలు కాజేశాడు సైబర్ నేరస్థుడు. ఖమ్మం జిల్లా ఈశ్వరమాదారం గ్రామానికి చెందిన చందా అంజయ్య ఓ ఆన్‌లైన్ సంస్థలో తరచూ వస్తువులను కొనేవారు. ఆ సంస్థ పేరిట ఆయనకు ఓ పార్శిల్ వచ్చింది. దాన్ని విప్పిచూడగా అందులో ఒక ఉత్తరం, స్క్రాచ్‌కార్డు కనిపించాయి. ఉత్తరంలో పవన్‌కుమార్ పేరిట ఉన్న ఓ ఫోన్ నంబరుకు కాల్ చేయగా, స్క్రాచ్ కార్డు చూడాలని ఆయన చెప్పారు. అంజయ్య స్క్రాచ్ కార్డు చూడగా అందులో మహీంద్రా ఎక్స్‌యూవీ 500 కారు లక్కీడ్రాలో గెలుపొందారంటూ సందేశం ఉంది. టోఆర్ నంబర్ కోసం రూ.25,600 చెల్లిస్తే కారు ఇంటికి పంపిస్తామనడంతో తన భార్య బ్యాంకు ఖాతా నుంచి అంజయ్య నగదును పంపారు. అదే రోజు రవాణా ఖర్చులకు రూ.64,500 ఇవ్వాలని కోరడంతో మళ్లీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. జీఎస్టీ కింద రూ.51,200 చెల్లించాలనడంతో సదరు మొత్తాన్నీ పంపారు. సైబర్ నేరస్థుడు ఇలా ఈ ఏడాది మే 10 నుంచి జులై 17 వరకు అంజయ్య నుంచి రూ.16.33 లక్షలు లాగేసుకున్నాడు. అయినా కారు పంపకుండా ఇంకా డబ్బు కావాలని అడుగుతుండటంతో మోసపోతున్న విషయాన్ని గుర్తించిన ఆయన కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది.

వేతన బకాయిలు ఇప్పించండి: ఏఐసీటీఈ ఛైర్మన్‌కు టీపీఈసీ ఎన్‌టీఏ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ : రాష్ట్రంలో పలు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదని ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్‌కు తెలంగాణ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల బోధనేతర సిబ్బంది సంఘం (టీపీఈసీఎన్‌టీఏ) ప్రధాన కార్యదర్శి భగత్ సింహ ఫిర్యాదు చేశారు. దిల్లీలో ఏఐసీటీఈ ఛైర్మన్‌ను కలిసిన ఆయన. . వేతన బకాయిలు పెరిగిపోవడంతో కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని తెలిపారు. వెంటనే జోక్యం చేసుకొని బకాయిలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్‌స్టేషన్‌పై రాళ్ల దాడి

- తమిళనాడు నాగపట్నం జిల్లాలో ఘటన
- ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్తత

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. నాగపట్నం జిల్లా వేదారణ్యంకు చెందిన పాండి అలియాస్ పాండియన్‌కు రామకృష్ణపురానికి చెందిన రామచంద్రన్‌కు మధ్య పాతకక్షలున్నాయి. కొద్దిరోజుల కిందట రామచంద్రన్ కాలును పాండియన్ వర్గానికి చెందిన వ్యక్తులు నరికారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు వేదారణ్యం పోలీస్‌స్టేషన్‌కు పాండియన్ రాగా బయట నిలిపిన ఆయన బొలెరో కారుకు రామచంద్రన్ వర్గీయులు నిప్పుపెట్టారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీస్‌స్టేషన్‌పై రాళ్లు రువ్వారు. అలాగే దుడ్డుకర్రలతో పాండియన్ వర్గంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. మంటలు ఆర్పడానికి వచ్చిన అగ్నిమాపక వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ పరిణామాలతో ఆగ్రహించిన పాండియన్ వర్గం స్థానిక బస్టాండులోని అంబేద్కర్ విగ్రహాన్ని, వేదారణ్యంలోని కొన్ని దుకాణాలను ధ్వంసం చేసింది.

దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర

పలు సంఘాల ఆరోపణ

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: జాతీయవాదం ముసుగులో దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు భాజపా, ఆర్ఎస్ఎస్ కుట్ర పన్నుతున్నాయని పలు సంఘాలు ఆరోపించాయి. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనం చేసే కుట్రలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చాయి. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని బీసీ, మాదిగ, మైనార్టీ ఐకాసలు, బీసీ జనసభ, గిరిజన శక్తి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'మతోన్మాద వ్యతిరేక ప్రజాస్వామిక ఐక్యత శక్తుల దినోత్సవం' పేరిట కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ..ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా కబంధ హస్తాల్లో దేశం బందీ అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, తెలంగాణ మాదిగ ఐకాస ఛైర్మన్ పిడమర్తి రవి, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారామ్‌యాదవ్, సీఎం పీఆర్‌ఓ రమేశ్‌హజారీ, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.బాబురావుయాదవ్, సీపీఐ నేత పి.గెల్వయ్య పాల్గొన్నారు.

EDUCATION
★Admission Guidance BVSc- Veterinary Seats in Philippines Call. 8754423689.
★Siddhartha B.P.Ed Suryapet Seats Available ✆ 79898 48738, 98662 41522/11

భారతీయ ఖాద్య నిగమ FOOD CORPORATION OF INDIA
ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, హజ్ హౌస్, పక్కన గార్డెన్ టేబిల్, హైదరాబాద్– 500004. ఫోన్: 040-23423330, ఫ్యాక్స్: 040-23230571
నెం.S&C 13(60)/PW/S-KOUKUNTLA/CONTS, తేదీ: 26-8-2019
ఇ-టెండర్లకు ఆహ్వానము

క్షయకూ రాజధానే

- హైదరాబాద్‌లో అత్యధికంగా బాధితులు
- రాష్ట్రంలో గత ఏడాది 52 వేల కేసుల నమోదు
- నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల్లో ప్రబలుతున్న కుష్ఠు
- ఏటా 3 వేల కేసుల గుర్తింపు
- నేటి నుంచి వచ్చే నెల 12 వరకూ ప్రత్యేక కార్యక్రమం
- ఈ రెండు వ్యాధులపై ఇంటింటా తనిఖీ

రాష్ట్రంలో క్షయ, కుష్ఠు వ్యాధులు చాపకింద నీరులా ప్రబలుతున్నాయి. గత ఏడాది కొత్తగా 52 వేల మంది క్షయ బాధితులు, 3 వేల మంది కుష్ఠు బాధితులు నమోదయ్యారు. అంటువ్యాధుల గుర్తింపు లక్ష్యంలో.. ఏటా 60-70 శాతాన్ని మించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ రెండు వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా. . బాధితులను వంద శాతం గుర్తించేందుకు నేటి నుంచి వచ్చే నెల 12 వరకూ ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షించే విధానం అమలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఏటా 2,500-3,000 వరకూ కుష్ఠు కేసులు వెలుగులోకి వస్తున్నాయి. వీరిలో 15 ఏళ్లలోపు పిల్లలు 6.33 శాతం మంది వరకూ ఉన్నారు. వ్యాధి లక్షణాలతో ఉంటూ గుర్తింపునకు నోచుకోకుండా ఉన్నవారు ఏటేటా పెరుగుతున్నారని వైద్యశాఖ గుర్తించింది.

● 2018లో 77,352 కొత్త క్షయ కేసులను గుర్తించడం లక్ష్యం కాగా.. 52,191 (67 శాతం) కేసులను ఆరోగ్యశాఖ గుర్తించింది. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకూ నిర్దేశించిన లక్ష్యంలో 28,154 (97 శాతం) కొత్త క్షయ కేసులను నిర్ధారించింది. గతేడాది మే నెలతో పోలిస్తే.. ఈ ఏడాది మే చివరి నాటికి రాష్ట్రం మొత్తమ్మీద 25 శాతం అదనంగా కొత్త కేసులను గుర్తించగలిగారు.

రెండు వారాల ప్రణాళిక ఇదీ

ఓ మహిళా ఆరోగ్య కార్యకర్త (ఆశా), ఓ స్వచ్ఛంద సేవకుడు (పురుషుడు)తో కూడిన ఇద్దరు సభ్యుల బృందం రోజూ 20 ఇళ్లకు వెళ్లి నిర్దేశించిన ప్రశ్నలు అడుగుతారు. వారి సమాచారాన్ని ఏఎన్‌ఎంలకు అందజేస్తారు. ఎవరిలోనైనా వ్యాధి లక్షణాలు గుర్తిస్తే.. ఏఎన్‌ఎం మరోసారి పరీక్షించి అనుమానితులను సమీపంలోని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్తారు. పరీక్షల అనంతరం వ్యాధి నిర్ధరణ అయితే.. చికిత్స ప్రారంభిస్తారు.

క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు ప్రశ్నలు

- 4 వారాలకు పైగా దగ్గు ఉంటుందా?
- బరువు తగ్గారా?
- తరచూ జ్వరం వస్తుందా?

కుష్ఠు వ్యాధి లక్షణాలు..

- ఒంటిపై స్పర్శ లేని తెలుపు, గోధుమ, రాగి రంగు మచ్చలున్నాయా?
- మొహం నూనె పూసినట్లుగా ఉంటోందా?
- ముఖంపై గడ్డల్లాగా (మొటిమలు కావు) ఉన్నాయా?
- కాళ్లు చేతుల్లో వాపు, అరికాళ్లు, అరచేతుల్లో తిమ్మిర్లున్నాయా?
- కళ్లు మూసుకుంటే కనురెప్పలు పూర్తిగా మూతపడడం లేదా?

క్షయ, కుష్ఠు బాధితులు అత్యధికంగా ఉన్న జిల్లాలు



(జనవరి నుంచి జులై వరకు గుర్తించిన కేసులు)

- ఈనాడు, హైదరాబాద్

'సూటు'పోటి మాటలు

వేధిస్తున్న వారిలో ఉద్యోగులు, వైద్యులు

షీ బృందాల అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వెకిలి చేష్టలూ... వెర్రివేషాలు. అతివ కనిపిస్తే చాలు అదుపు తప్పిపోతారు. సూటిపోటి మాటలతో చెలరేగిపోతారు. ఇప్పటివరకూ ఇలాంటి పనులు చేసేది ఆవారాగా తిరిగే పోకిరీరాయుళ్లే అని భావించేవారు. కానీ అమ్మాయిలను వేధిస్తూ 'షి' బృందాలకు పట్టుబడుతున్న వారిలో ప్రయివేటు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులూ ఉన్నారని తేలడంతో అధికారులూ అవాక్కవుతున్నారు. అతివలపై వేధింపులను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన 'షి' బృందాలకు పట్టుబడ్డ వారిలో ఎవరెవరు ఉంటున్నారన్న విషయాన్ని అధ్యయనం చేసేందుకు ఇటీవల అధికారులు వృత్తుల వారీగా విశ్లేషించారు. విద్యార్థులను పక్కనబెట్టి కేవలం ఉద్యోగాలు చేస్తున్న వారి వివరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో ఆసక్తికరమైన అంశాలు ఎన్నో వెల్లడయ్యాయి. ఇప్పటివరకు పట్టుబడ్డ వారిలో దాదాపు మూడింట రెండొంతులమంది... అంటే 67 శాతం మంది ప్రైవేటు ఉద్యోగులే ఉంటున్నారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మొదలుకొని ఇతరత్రా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారూ ఉండటం గమనార్హం.

మూలంలోనే చికిత్స మేలు

వృత్తుల వారీగా వేధింపులకు పాల్పడుతున్న వారి వివరాలు తెలియడంతో భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోబోతున్నారు. వారు పనిచేస్తున్న చోటే అవగాహనా కార్యక్రమాలు చేపట్టే ఆలోచనతో ఉన్నారు. ప్రైవేటు కార్యాలయాలలోనూ సదస్సులు నిర్వహించాలని, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

'షి' బృందాలకు పట్టుబడ్డ వారిలో వృత్తుల వారీ శాతం

- 67% ప్రైవేటు ఉద్యోగులు
- 5% కూలీలు
- 3% ప్రభుత్వ ఉద్యోగులు
- 6% డ్రైవర్లు
- 2% వైద్యులు
- 14% వ్యాపారులు
- 3% ఇతరులు

105 ఎంబీబీఎస్ సీట్లకు తుది విడత కౌన్సెలింగ్

నేటితో దరఖాస్తుకు ఆఖరి గడువు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన 105 ఎంబీబీఎస్ సీట్లకు ఆఖరి విడత (మాప్‌అప్ రౌండ్) కౌన్సెలింగ్‌కు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మూడు విడతల ప్రవేశ ప్రక్రియ పూర్తవగా.. ఇంకా మిగిలిన సీట్లకు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచే వెబ్‌ఆప్షన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు సంబంధించిన సంక్షిప్త సందేశాలను అర్హులైన విద్యార్థులందరి మొబైల్ ఫోన్లకు పంపించింది. కళాశాలల వారీగా ఖాళీలను వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపర్చారు. మొదటి ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు అర్హులైన అభ్యర్థులందరూ ఈ నెల 26న (సోమవారం) సాయంత్రం 5 గంటల్లోపు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాలని కాళోజీ ఆరోగ్య వర్సిటీ ఉపకులపతి కరుణాకరరెడ్డి తెలిపారు. తర్వాత రాత్రికి ఆఖరి విడత ప్రవేశ ఫలితాలను వెల్లడిస్తారు. కేటాయించిన కళాశాలల్లో చేరడానికి అభ్యర్థులకు ఈ నెల 29 వరకు గడువు ఇవ్వనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో ప్రవేశాలకూ ఈ నెల 27తో గడువు ముగియనుంది. ఆయా కోటాల్లో మాప్‌అప్ రౌండ్‌ను 28న నిర్వహించాలని వర్సిటీ యోచిస్తోంది. అప్పటికే యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో సీట్లు మిగిలితే.. వాటిని ఆయా కళాశాలలకే భర్తీ చేసుకోవడానికి అవకాశమిస్తారు. అన్ని కోటాల్లోనూ ఎంబీబీఎస్ సీట్ల ప్రవేశాలను ఈ నెల 31వ తేదీతో పూర్తి చేయాలనే ఎంసీఐ నిబంధన ఉండడంతో ఆ మేరకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తోంది.

నేటి నుంచి టీఎస్‌పీఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పీఈసెట్ 2019-20 ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్ల(ఐచ్ఛికాలు) ఎంపిక సోమవారం నుంచి ఉంటుందని ఉన్నత విద్యా మండలి తెలిపింది. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు హైదరాబాద్‌లోని నిజాం కళాశాల, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

పాతవి వద్దు.. కొత్తవి కావాలి

- నూతన కంప్యూటర్లు, ఏసీలు, సామగ్రి అడుగుతున్న సచివాలయ ఉద్యోగులు
- ఉన్నవాటినే వినియోగించుకోవాలని స్పష్టం చేసిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: తాత్కాలిక సచివాలయమైన బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో పనిచేసేందుకు కంప్యూటర్లు, ఫర్నీచర్, బీరువాలు, ఏసీలు కొత్తవి కావాలని పలు శాఖలు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాయి. ఇందుకోసం ఒక్కో శాఖ రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల మేర నిధులు ఇవ్వాలని కోరాయి. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించింది. కొత్తగా ఎలాంటి కొనుగోళ్లు చేపట్టవద్దని, ఉన్న సామగ్రినే వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. సచివాలయం నుంచి తాత్కాలిక సచివాలయానికి సామగ్రి తరలింపు ప్రక్రియ ఈ నెల మొదటివారం నుంచి మొదలైంది. దస్త్రాలు మినహా.. ఇతర సామగ్రిని తీసుకెళ్లేందుకు పలు శాఖల అధికారులు ఆసక్తి చూపడం లేదు. పేరొందిన కంపెనీల కొత్త కంప్యూటర్లు, అధునాతన ఫర్నీచర్, ఏసీలు కావాలని కోరుతున్నారు. 6 శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో కొత్త టీవీలు కావాలని కోరినట్లు తెలిసింది. ప్రభుత్వం నిధులు ఇస్తుందనే ఆశతో కొన్ని శాఖలు ఉద్దేశపూర్వకంగా తరలింపును జాప్యం చేస్తున్నాయి. కొన్ని శాఖలు తమ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థల నుంచి నిధులు తెచ్చుకొని కొనుగోలు చేసే యత్నాల్లో ఉన్నాయి.

కొత్త సచివాలయానికే కొత్త సామగ్రి

శాఖల నుంచి వచ్చిన ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించింది. కొత్త సచివాలయానికి మాత్రమే కొత్త సామగ్రి అవసరమని పేర్కొంది. ప్రస్తుత సచివాలయంలోని పూర్తి సామగ్రిని తరలించాలని స్పష్టం చేసింది. తాత్కాలిక సచివాలయంలో మరమ్మతులకు శాఖల అంతర్గత నిధులు వినియోగించాలని పేర్కొంది. ఎవరైనా కొత్త సామగ్రిని వాడుతుంటే గుర్తించి నివేదించాలని సాధారణ పరిపాలన, రోడ్లు భవనాల శాఖలను ఆదేశించింది. శాఖల తరలింపులో జాప్యంపైనా ప్రభుత్వం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో ఉన్న తన్నాయి సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.

మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలి

తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కేకే

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని వెనకబడిన వర్గాలకు సంపూర్ణ న్యాయం జరగాలంటే మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయాలని తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు డిమాండ్ చేశారు. మొత్తం 40 సిఫార్సులను మండల్ చేయగా కేంద్రం కేవలం రెండింటినే అమలు చేసిందన్నారు. కమిషన్ సిఫార్సుల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. ఆదివారం కేశవరావు నివాసంలో బీపీ మండల్ 101 జయంతి వేడుకలు జరిగాయి. కేశవరావుతోపాటు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, ఎంబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు సంగెం సూర్యారావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ రాములు రచించిన 'బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్' పుస్తకాన్ని కేశవరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు.

వేధింపుల ఫిర్యాదులపై విచారణకు అంతర్గత కమిటీలు

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొనే లైంగిక వేధింపుల ఫిర్యాదులపై విచారణ చేయడానికి అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీలు, డీఈవోలకు కమిషనర్ విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనీసం 10 మందికి తగ్గకుండా అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

పీవీ సింధుకు అభినందనల వెల్లువ

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా ఆవిర్భవించిన పీవీ సింధుకు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినందనలు తెలిపారు. అద్వితీయ విజయంతో దేశంలోని క్రీడాకారులకు ఆమె స్ఫూర్తినిచ్చారన్నారు. క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి హరీశ్‌రావు, క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ గెలవడం ద్వారా పీవీ సింధు తెలుగు కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. భారత్ తరపున సింధు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లాల్లో గంట అదనంగా పనిచేస్తాం

- సీపీఎస్ సమస్య పరిష్కారానికి వినూత్న నిరసన
- సంఘం అధ్యక్షుడు దాముక కమలాకర్ వెల్లడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భాగస్వామ్య పింఛను పథకం (సీపీఎస్) రద్దు చేసేవరకూ పోరాటం ఆపబోమని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా జిల్లాల్లో గంట సమయం అదనంగా పనిచేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత పాల్గొని మాట్లాడారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతానన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రతిపాదనకు వ్యతిరేకంగా 29న సభ

భవిష్యత్తు కార్యాచరణకు వీఆర్‌ఓ, వీఆర్‌ఏ సంఘాల నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్‌ఓ), గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) వ్యవస్థల రద్దుకు ప్రభుత్వం మొగ్గుచూపుతుందన్న వార్తల నేపథ్యంలో వ్యవస్థలను కాపాడుకోవాలని వీఆర్‌ఓ, వీఆర్‌ఏ సంఘాలు తీర్మానించాయి. ఆదివారం హైదరాబాద్‌లో సంఘాల నాయకులంతా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుని ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూశాఖను కాపాడుకునేందుకు సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 29న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రెవెన్యూ శాఖను కాపాడండి- ఇతర శాఖల్లో విలీనాన్ని ఆపండి' అనే నినాదంతో ఉద్యోగుల సభ నిర్వహించనున్నామని, ఆ రోజు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సభకు తెలంగాణ రెవెన్యూ సంక్షేమ సంఘం, తహసీల్దార్ల సంఘం, భూమి కొలతలు-భూ దస్త్రాల నిర్వహణ ఉద్యోగుల సంఘం, ఉద్యోగ సంఘాల ఐకాస నాయకులతోపాటు ప్రతిపక్ష, విపక్షాల ప్రజా ప్రతినిధులు, మేధావులను ఆహ్వానించాలని నిర్ణయించామన్నారు. తొలుత సోమవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను కలిసి సమస్యలను తెలియజేయాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘాల నాయకులు గరిక ఉపేంద్రరావు, విజయరామారావు, లక్ష్మీనారాయణ, సుదర్శన్, వంగూరి రాములు, ఇంజమూరి ఈశ్వర్, గోవర్ధనాచారి, నాగేశ్వర్, కృష్ణ, లక్ష్మీనర్సింహ, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో బోనాలతో పాల్గొన్న గంగపుత్రులు. అంతర్‌చిత్రంలో హుస్సేన్‌సాగర్‌లోకి వదులుతున్న తెప్ప

గంగరంగ వైభవం

ఘనంగా గంగ తెప్పోత్సవం

తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గంగ తెప్పోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులు తరలివచ్చారు. ఖైరతాబాద్ ప్రధాన రహదారిలోని ఏడుగుళ్ల ఆలయం వద్ద పూజల అనంతరం నెక్లెస్ రోడ్డులోని గంగమ్మ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. హుస్సేన్‌సాగర్ వద్ద తెప్పకు గంగపుత్రులు పూజలు చేసి నీటిలో వదిలారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఉప శాసనసభాపతి పద్మారావు, ఏపీ మంత్రి మోపిదేవి వెంకటరమణ ఎంపీ రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, ఖైరతాబాద్

కశ్మీర్‌పై మోదీ, షా కొత్తగా చేసిందేం లేదు

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే జమ్మూ-కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమైందని, భాజపా నాయకులు మాత్రం ప్రధాని మోదీ, అమిత్‌షాలు ఇప్పుడే కశ్మీర్‌ను దేశంలో కలిపేసినట్లుగా ప్రచారం చేస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. కశ్మీర్ విషయంలో మోదీ, షా కొత్తగా చేసిందేమీ లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ఆదివారం ఆయన తెలంగాణకు వచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఇంద్రజిత్‌గుప్తా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 'ఆర్టికల్ 370 రద్దు- కశ్మీర్ పరిణామాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాజా మాట్లాడారు. ఆర్టికల్ 370ని అనుసరించి కశ్మీర్‌కు ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడేందుకు మోదీ సిద్ధంగా లేరన్నారు. జమ్మూ-కశ్మీర్‌లో కర్ఫ్యూతో నేటికీ అక్కడి ప్రజలు పాఠశాలలకు, ఆసుపత్రులకు వెళ్లలేని దుస్థితి కొనసాగుతోందన్నారు. ఆర్టికల్ 370కి వల్లభ్‌భాయ్‌పటేల్ ఒప్పుకోలేదని చెప్పడంలో వాస్తవం లేదని, నెహ్రూ, పటేల్ తదితర నాయకులంతా కలిసే కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. అఖండ భారత్, దేశమంతా ఒక్కటే పేరుతో భారత్‌ను హిందూ రాజ్యంగా మార్చేందుకు భాజపా కుట్రలు చేస్తోందని రాజా ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాడిన స్ఫూర్తితో భాజపా, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా, పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం.. అనారోగ్యంతో బాధపడుతోన్న సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో రాజా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సురవరం సుధాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

తెరాస మూడున్నర కోట్ల సభ్యత్వం చేసి చూపాలి : భాజపా

ఈనాడు, హైదరాబాద్ : తెరాస మాదిరి ఓటర్ల జాబితాను ముందు పెట్టుకుని పార్టీ సభ్యత్వాలు చేయట్లేదని. దేశాభివృద్ధి మోదీ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని భావించేవారు స్వచ్ఛందంగా తమ పార్టీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని రాష్ట్ర భాజపా పేర్కొంది. "భాజపా ఆన్‌లైన్ సభ్యత్వంపై తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. మిస్డ్ కాల్స్ పంథాలో వెళితే తెరాస మూడున్నర కోట్ల సభ్యత్వాలు చేస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఒకటి కాదు..పదిరోజుల సమయమిస్తాం..అంత సభ్యత్వం చేసి చూపాలి" అని భాజపా తెలంగాణ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి ధర్మారావు ఆదివారం ఓ ప్రకటనలో సవాలు విసిరారు. రానున్న పురపాలక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను భాజపా గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో పెద్దపులి మృతి

మహారాష్ట్రలోని పోడిషం గ్రామ శివారులో మృతి చెందిన పెద్దపులి

సిర్పూర్(టి), బల్లార్ష, న్యూస్‌టుడే: తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు చంద్రపూర్ జిల్లా గోండ్‌పిప్రి తాలూకా దాబా అటవీ పోడిషం బీట్ పరిధిలో శనివారం అనుమానాస్పద స్థితిలో ఓ పెద్దపులి మృతి చెందింది. సంతోష్ అనకాపురే అనే రైతు వ్యవసాయ పనుల కోసం తన పొలానికి వెళ్లగా అక్కడ పులి ఉండటాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం చేరవేశారు. కదలికలు లేకపోవడాన్ని గమనించిన గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మహారాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు వినోద్ మోర్లె, రామారావు, దాబా రేంజ్ అధికారి రౌత్‌కర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పులి మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న సిర్పూర్(టి) సెక్షన్ అధికారి ప్రకాష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందినది ఆడ పులి అని, వయసు 3 సంవత్సరాలు ఉంటుందని నిర్ధరించారు. పులి మృతి చెందిన స్థలానికి కూత వేటు దూరంలో అడవి పంది కళేబరం ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో పులిపై విషప్రయోగం జరిగిందా?, సహజ మరణమా? అనే కోణంలో మహారాష్ట్ర అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

వలస కార్మికులకు విముక్తి

- కేటీఆర్ చొరవతో సౌదీ నుంచి స్వదేశానికి..

ఈనాడు, హైదరాబాద్: సౌదీ అరేబియాలోని అల్‌అవామియా నగరంలో చిక్కుకున్న 11 మంది తెలంగాణ ప్రవాస కార్మికులు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చొరవతో స్వదేశానికి తిరిగొచ్చారు. కరీంనగర్ జిల్లా మల్లాపూర్‌కు చెందిన డ్రైవర్ నర్సయ్యతోపాటు ఈర్నాల మల్లయ్య, సుధాకర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన నర్సింగరావు, పొట్టెర్ల గంగయ్య, లింగంగౌడ్ సుదర్శన్, సాయన్న, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గంగన్న, జగిత్యాల జిల్లావాసి రాచమల్ల బలరాం, హైదరాబాద్‌కు చెందిన తిప్పన సత్యనారాయణలు రెండేళ్ల క్రితం సౌదీకి వెళ్లారు. వీరు అక్కడ ఒక నిర్మాణ కంపెనీలో పనిచేశారు. ఏడాదిన్నర క్రితం ఈ సంస్థ మూతపడగా.. తర్వాత వారు పనుల కోసం తిరిగి ఇబ్బందులుపడ్డారు. వారి కుటుంబీకులు ఈ విషయాన్ని కేటీఆర్‌కు తెలిపారు. ఆయన సౌదీలోని రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి.. వారికి సాయం చేయాలని కోరారు. కేటీఆర్ వినతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, సాధారణ పరిపాలన శాఖ అధికారులు సౌదీలోని రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున వారికి టికెట్లను సమకూర్చడంతో సౌదీలోని భారత రాయబార కార్యాలయ అధికారులు ఎగ్జిట్ వీసాలను ఇచ్చారు. వారంతా ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. జీఏడీ అధికారులు వారికి రవాణా సౌకర్యం, రూ.వేయి చొప్పున సాయమందించి, ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా కార్మికులు తమను ఆదుకున్న కేటీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పదేళ్ల క్రితం..

విశాఖ నగరం బీచ్ రోడ్డులో నలుగురు..
జగదాంబ సెంటర్‌లో ముగ్గురు..
కైలాసగిరి దగ్గర ఇద్దరు..
అందరూ బిచ్చగాళ్లే! బాల యాచకులే.
పలక పట్టాల్సిన చేతుల్లో సత్తు గిన్నెలు..
ఇలాంటి వాళ్లు నగరం మొత్తంలో వందల మంది...

ప్రస్తుతం

విశాఖ వీధుల్లో చేతులు చాచి యాచిస్తున్న చిన్నారులు కనిపించడం లేదు.
వాళ్లంతా ఏమైపోయారు?
ఆరా తీస్తే.. ఆ పిల్లలు బడికి వెళ్తున్నారు.
బుద్ధిగా చదువుకుంటున్నారు.
కొందరైతే ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.
ఈ మార్పు 'జనరేషన్ యువ'తో సాధ్యమైంది. ఆ ప్రస్థానమేంటో చదివేయండి..

బడికి వెళుతున్న చిన్నారులతో రాకేష్, నరేష్

యాచకథ కంచికి... ఆ పిల్లలు బడికి!

విశాఖ సముద్ర తీరం.. కడలి కెరటాలను చూస్తూ ఎవరి ఆనందంలో వాళ్లున్నారు. ఓ ఏడేళ్ల పిల్లాడు.. ఒళ్లంతా రంగు పూసుకొని.. అక్కడికొచ్చాడు. కళ్లజోడు, చేతిలో కర్ర ధరించి.. మహాత్మా గాంధీలా నిల్చున్నాడు. కన్నార్పడు. కాలు కదపడు. కొందరికి ముచ్చటేసింది. ఇంకొందరికి పొట్ట కూటి కోసం ఆ బాలుడి తిప్పలు చూసి జాలేసింది. ఏదైనా సాయం చేద్దామనుకున్నారు. ఇంతలో ఓ నలుగురు యువకులు అక్కడికి వచ్చారు. 'దానం చేసి బాల యాచకులను ప్రోత్సహించకండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎవరైనా దానమివ్వడానికి ముందుకొస్తే.. వద్దని వారించారు. 'ఏం మనుషులో.. సాయం చేసినా వద్దంటున్నారు..' అనుకున్నారు కొందరు. ఆ బాలగాంధీ చేసేది లేక చతికిలపడ్డాడు.

కట్ చేస్తే..

ఆ బాల గాంధీ అడుక్కోవడం మానేశాడు. పొద్దంతా అలా విగ్రహంలా నిల్చోవడం మానేశాడు.
సాయంత్రమయ్యాక చిప్పలో పడ్డ చిల్లరను లెక్కించడం మర్చిపోయాడు. ఎందుకంటే.. ఆ యువకులు అతడిని చేరదీశారు. నిలువ నీడనిచ్చారు. చదువుకోవడానికి బడికి పంపుతున్నారు. 'జనరేషన్ యువ' ప్రస్థానంలో చిన్న కథ ఇది. ఇలాంటివి 204 గాథలున్నాయి.

తాతలు యాచకులు. తండ్రులదీ అదే బాట. పిల్లలనూ ఆ దోవలోకే నెట్టారు. వచ్చిపోయేవారిని అడుక్కోవడం ఒకటే తెలుసు వారికి. చెరిగిన జుట్టు, చిరిగిన దుస్తులు.. దీనంగా చేయి చాపుతారు. జాలి కలిగిన వారు ఒకట్రెండు రూపాయలిచ్చి బోలెడంత పుణ్యం వచ్చేసిందని తృప్తి పడతారు. విశాఖవాసి నరేష్ మాత్రం ఈ పిల్లల దీనావస్థను సరిగ్గా అర్థం చేసుకున్నాడు. యాచక బాలలను అక్కున చేర్చుకుని అక్షర దానం చేస్తున్నాడు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాడు.

నాన్నిచ్చిన రూ.40 వేలతో..

నరేష్ ఇంజినీరింగ్ బయోటెక్నాలజీ చదివాడు. ఉన్నత కుటుంబం కావడంతో పెద్ద చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నాడు. ఆఖరి క్షణంలో.. ఏదో తెలియని అసంతృప్తి. నలుగురికీ ఏదో చేయాలనే ఆలోచన మనసును తొలిచింది. విదేశాలకు వెళ్లననీ, ఇక్కడే నలుగురికీ సేవ చేస్తానని ఇంట్లో చెప్పాడు. మొదట పెద్దలు వద్దన్నారు. కానీ, తమ బిడ్డ మంచి మనసును అర్థం చేసుకొని పచ్చజెండా ఊపారు. నరేష్ తండ్రి అచ్యుతరావుకు వ్యాపారాలుండేవి. రూ.40వేలు ఇచ్చి మరీ కొడుకును ప్రోత్సహించారు. అలా 2007లో 'జనరేషన్ యువ' స్వచ్ఛంద సంస్థ పురుడు పోసుకుంది. సంస్థ తరపున మొదట్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పోటీ పరీక్షలు, క్రీడలు నిర్వహిస్తూ పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేవాడు. ఇలా ఉండగానే 2008లో అనారోగ్యంతో తండ్రి కన్నుమూశాడు. ఇంత సంపద ఉండి తండ్రిని కాపాడుకోలేకపోవడంతో.. డబ్బుపై విరక్తి భావన కలిగింది. ఆనాటి నుంచి సమాజ సేవే పరమావధిగా నిర్ణయించుకున్నాడు.

ఇద్దరితో మొదలు..

ఈ సమయంలోనే నరేష్ దృష్టి బడి మానేస్తున్న పిల్లలపై పడింది. బడికి వెళ్లకుండా వీరేం చేస్తున్నారని గమనించడం మొదలుపెట్టాడు. వీరిలో చాలామంది భిక్షాటన చేస్తూ కనిపించారు. వీరిలో కొందరు అనాథలైతే, ఇంకొందరిని తల్లిదండ్రులే అడుక్కోవడానికి పంపుతున్నారని తెలుసుకున్నాడు. చిల్లర కోసం పిల్లల భవిష్యత్తును వీధి పాలు చేస్తున్నారని గ్రహించాడు. యాచకవృత్తిలో ఉన్న పెద్దలను మార్చలేకపోయినా.. పిల్లలనైనా ఈ కూపం నుంచి బయటపడేయాలని నిర్ణయించుకున్నాడు నరేష్. తొలి ప్రయత్నంలో భాగంగా సాయి, నూకరాజు అనే ఇద్దరు అనాథ పిల్లలను చేరదీశాడు. అప్పటికి వీరిద్దరి వయసు పదేళ్లు. పరిచయం పెంచుకోవడం కోసం.. రోజంతా వారితోనే కాలక్షేపం చేసేవాడు. ఓ ఏడాది పాటు వీరి ప్రయాణం సాగింది. నరేష్ పరిచయమయ్యాక ఆ పిల్లలు బడికైతే వెళ్లలేదు కానీ, భిక్షాటన మానేశారు. తర్వాత ఓ హోమ్ ప్రారంభించి.. అందులో వారికి ఆశ్రయం కల్పించాడు. బడికి పంపించాడు. ఇప్పుడు వారి చదువు పూర్తయింది. పనుల్లో కుదురుకున్నారు. పెళ్లిళ్లు చేసుకున్నారు. హాయిగా జీవిస్తున్నారు.

అందరికీ కార్పొరేట్ విద్య..

క్రమశిక్షణ లేకుండా పెరిగిన చిన్నారులు అరగంటైనా ఒక దగ్గర కూర్చోలేరు. వారిని వెంటనే బడికి పంపినా.. అక్కడ ఉండలేకపోయేవారు. అందుకే వారిలో మార్పు కోసం.. హోమ్‌లోనే ఎనిమిది నెలల పాటు ప్రాథమిక అంశాలను నేర్పించేవాళ్లం. ఎలా మాట్లాడాలి, ఎలా కూర్చోవాలి, ఎలా వినాలి.. వంటివి చెప్పేవాళ్లం. ఆ తర్వాత బడికి పంపించేవాళ్లం. మొదట్లో ప్రభుత్వ పాఠశాలకు పంపితే.. మేం ఆశించిన ఫలితం కనిపించలేదు. మరింత అల్లరిగా తయారవ్వడంతో.. కార్పొరేట్ బడికి పంపారు. అనుకున్నట్టుగానే పిల్లల్లో మంచి మార్పు వచ్చింది. ఒక్కో విద్యార్థికి ఒక్కో దాత అండగా ఉండి ఖర్చును భరిస్తున్నారు. ఈ పిల్లలను బడిలో చేర్పిస్తామన్నప్పుడు మొదట్లో పాఠశాల యాజమాన్యాలు వ్యతిరేకించినా.. తర్వాత ప్రవేశాలు కల్పించారు.

– నరేష్

తల్లిదండ్రులు వినేవారు కాదు. వారిని నచ్చజెప్పడంతో పాటు... నగరంలోని కూడళ్ల దగ్గర 'బాల యాచకులకు దానం చేసి ప్రోత్సహించకండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించేవాడు. నగరంలో 15 లక్షల కరపత్రాలు పంపిణీ చేశాడు. యాచకుల నుంచి నిరసన వ్యక్తమైనా.. వెనక్కి తగ్గలేదు. భిక్షాటన చేస్తూ చిన్నారులు కనిపిస్తే చాలు.. నరేష్ బృందం వారిని హోమ్‌కు తరలించడం మొదలుపెట్టింది. ఫలానా చోట పిల్లలు అడుక్కుంటున్నారని సమాచారం అందినా.. వెంటనే వెళ్లి వారినీ హోమ్‌కు తీసుకొచ్చేవారు. పిల్లల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చేవారు. ఏదైనా అవసరానికి అడుక్కుంటున్నారని తెలిస్తే.. తగిన సాయం చేసేవారు. పోలీసులు, బాలల సంక్షేమ కమిటీ సభ్యుల సహకారం లభించడంతో ఆయన పని సులువైంది. ఇలా తీసుకొచ్చిన పిల్లలను బడిలో చేర్పించేవారు. ఈ పదేళ్లలో ఏకంగా 204 మంది బాల యాచకులను చేరదీసి.. వారి దశను, దిశను సమూలంగా మార్చేసింది 'జనరేషన్ యువ'.

జనరేషన్ యువ ఆధ్వర్యంలో మొత్తం 204 మంది పిల్లలు వివిధ స్థాయిల్లో చదువుకుంటున్నారు. 170 మంది విద్యార్థులు విశాఖలోని కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. కొందరు ప్రైవేట్ కళాశాల్లో ఇంటర్ చేస్తున్నారు. పిల్లలందరికీ మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పాఠశాలలకే పంపించే ఏర్పాటు చేశారు.

నరేష్ సంకల్పానికి ఆకర్షితులై 'జనరేషన్ యువ' సంస్థలో సేవలందించడానికి ఎందరో యువకులు ముందుకొచ్చారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉండగా రాకేష్ ఇందులో చేరాడు. ఉద్యోగం కాదనుకొని.. సంస్థతో జతకలిశాడు. మరో యువకుడు రాజశేఖర్ ఉద్యోగం చేస్తూనే.. సంస్థకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వీరిద్దరూ సహ వ్యవస్థాపకులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం హోమ్ కోసం 55 మంది పని చేస్తున్నారు. వీరికి వేతనాలు కూడా ఇస్తున్నారు. విశాఖలో నాలుగు ప్రాంతాల్లో హోమ్ ఏర్పాటు చేసి.. బాల యాచకుల బాగోగులు చూస్తున్నారు. సొంతంగా ఓ భవనాన్నీ నిర్మించుకున్నారు. విశాఖలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇతర జిల్లాల్లోనూ విస్తరిస్తామని చెబుతున్నాడు నరేష్. త్వరలో శ్రీకాకుళంలో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ బాల యాచకులు లేకుండా చేస్తామంటున్నాడు. బాల యాచకుల ఎక్కడ కనిపించినా.. సమాచారం ఇవ్వడానికి డయల్ 100 వంటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్నాడు.

-సురేశ్ రావివలస, విశాఖపట్నం

'మీ పెంపుడు జంతువు రక్తం దానం చేయండి... మరికొన్నిటికి ప్రాణదానం చేయండి' ...ఏంటిది?... అని మళ్లీ చదివారా?
మీరేం పొరపాటు చదవలేదు.
రక్తం లేక మనుషులే కాదు... ఎన్నో జంతువులూ ప్రాణాలొదిలేస్తున్నాయి.
ఈ పరిస్థితిని మార్చాలని తలచింది హైదరాబాద్‌కు చెందిన 'యానిమల్ బ్లడ్‌లైన్' సంస్థ. ఇందుకు ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. జంతువులను పెంచుకుంటున్న వారు... వాటి వివరాలను ఇందులో పొందుపరిస్తే... అవసరమైనప్పుడు వాటి రక్తంతో ఇంకో జంతువుకు ప్రాణం పోసే బృహత్తర క్రతువుకు శ్రీకారం చుట్టింది.

రక్తదానం మూగ జీవులకు

మనుషులకు అవసరమైనప్పుడు రక్తం ఇవ్వడానికి ఎన్నో రక్తనిధి కేంద్రాలున్నాయి. అయితే ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటున్న శునకం, పిల్లి, కుందేలు... ఇలా జంతువులేవైనా విపత్కర పరిస్థితిలో ఉంటే రక్తం అందించే ఏర్పాట్లు లేవు. దీన్ని చూసి చలించిన శివకుమార్ ఓ వెబ్‌సైట్ ప్రారంభించారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా జంతువుల కోసం ఒకే ఒక్క రక్తనిధి కేంద్రం తమిళనాడు రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. మరెక్కడా ఈ తరహా కేంద్రాలు లేవు. ఇక్కడ ఏర్పాటు చేయాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అందుకే www.animalblood-line.org వెబ్‌సైట్ ఆలోచన చేశారు. జంతువుల రక్తాన్ని దానం చేసేందుకు ఒప్పుకొనే యజమానుల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఆ జంతువుల నుంచి రక్తాన్ని తీసుకొని మరికొన్ని ప్రాణులను రక్షిస్తారు.

యానిమల్ బ్లడ్ లైన్ సంస్థ రూపకల్పన వెనుక ఎన్నో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజికవేత్తలు, జంతు ప్రేమికులు ఉన్నారు. శివకుమార్‌తో పాటు మరికొందరు జంతువులకు ప్రాణం పోయడానికి నడుం బిగించి పనిచేస్తున్నారు.

-కాసాల ప్రశాంత్‌గౌడ్, హైదరాబాద్

విదేశాల్లో జంతువులకు అనేక బ్లడ్ బ్యాంకులున్నాయి. మన దేశంలో ఆ పరిస్థితి లేదు. మనుషులకు ఉన్నట్టే జంతువులకు రక్తవర్గాల్లో తేడాలుంటాయి. ఆరోగ్యంగా ఉన్న ఒకటి నుంచి 8 సంవత్సరాల వయస్సు ఉన్న జంతువులే రక్తదానం చేయాలి. జంతువులకు రక్త పరీక్షలు నిర్వహించడం, గ్రూపులను గుర్తించడం, వాటికి రక్తం ఎక్కించే అన్ని ప్రక్రియలు రిజిస్టర్ అయిన పశు వైద్యుడి పర్యవేక్షణలోనే జరుగుతాయి

- శివకుమార్
యానిమల్ బ్లడ్‌లైన్ వ్యవస్థాకులు

పిల్లలు పెంచిన అడవి!

పచ్చదనం... నినాదం కాదు, అదో బాధ్యత.
మొక్కలు నాటగానే సరిపోదు. వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటేనే
అవి ఫలిస్తాయి... మంచి ఫలితాలనిస్తాయి.
పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. ఓ అడవినే సృష్టించొచ్చు. ఆ పనే చేసి చూపారా విద్యార్థులు.

జనగాం జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల జిల్లాపరిషత్ హైస్కూల్ ఈ స్ఫూర్తిదాయకమైన పనికి వేదికైంది. ఇక్కడ 125 మంది పిల్లలు చదువుతున్నారు. పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. వాటిని అందరూ కలిసి దత్తత తీసుకున్నారు. కాళ్లు, చేతులు కడుక్కున్న నీళ్ల నుంచి వంట పాత్రలు కడిగిన నీళ్ల వరకు ఆ మొక్కలకు ఉపయోగపడేలా చేశారు. సెలవుల్లోనూ వాటిని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వాడిపారేసిన రెండులీటర్ల సామర్థ్యమున్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి వాటిలో నీరు నింపి మూతకో చిన్న రంధ్రం చేసి మొక్కల మొదళ్లలో బొట్టుబొట్టుగా పడేలా చేశారు. నాటిన ప్రతి మొక్క బతికేలా జాగ్రత్త పడ్డారు. కలుపు మొక్కలు తొలగించి అంతర కృషి చేశారు. విద్యార్థులు తమ పుట్టిన రోజు వేడుకలను మొక్కలకు రాఖీ కట్టి వాటిపై తమ బాధ్యతను ప్రకటించారు. ప్రభుత్వం నియమించిన కంటింజెంట్ ఉద్యోగి చంద్రయ్య కృషి విద్యార్థులకు జత కలిసింది. మూడేళ్ల తర్వాత వారి కృషి ఫలించింది. ఆ మొక్కలన్నీ విస్తరించి దట్టమైన అడవిగా మారింది. పాఠశాలకు హరితశోభనిచ్చిన నీర్మాల పాఠశాల విద్యార్థులు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

-ఉప్పల రమేశ్ శర్మ, దేవరుప్పల

బతుకునిచ్చాయని... మరచిపోరాదని!



పాత ట్రాక్టర్లు ఆయనకు దైవంతో సమానం. వాటిని కొని అమ్మడం ద్వారా ఆర్థికంగా స్థిరపడ్డ పాటిబండ్ల శ్రీరామ్మూర్తికి అవంటే ఎంతో భక్తి. దానికి గుర్తుగా తన మూడు అంతస్తుల భవనంపై ఓ ట్రాక్టర్‌నే పెట్టేశారాయన. అంతెత్తుకు ట్రాక్టరు ఎలా ఎక్కించారా అని ఆశ్చర్యపోకండి. నమూనాను సిమెంటుతో చేయించి దానికి పాత ట్రాక్టరు సామగ్రి తెచ్చి పెట్టి అచ్చుగుద్దినట్లు నిజమైన దానిలా తయారుచేశారు. ఖర్చుకు వెనకాడకుండా 12సంవత్సరాల క్రితమే ఇలా ఏర్పాటు చేశారాయన. ఇంతకీ ఈయనది కృష్ణాజిల్లా యనమలకుదురు.

మూలాలను మర్చిపోకపోవడం అంటే ఇదే... మనం ఎంచుకున్న వృత్తి మనకు ఆర్థికంగా, వ్యక్తిగతంగా సమాజంలో గుర్తింపు తీసుకువస్తే దానికి కృతజ్ఞత చూపే వాళ్లెంతమంది? తమకు గుర్తింపునిచ్చిన వృత్తికి కృతజ్ఞతగా వీరు ఏంచేశారో చూడండి.

1972లో తన తండ్రి స్థాపించిన అరుణ ఫొటోస్టుడియో మీదే ఆధారపడి ఉన్నతస్థితికి చేరామని దానికి గుర్తుగా ఆ కెమెరాను జీవితాంతం గుర్తుండేలా భవనంపై పెట్టాలి అనుకున్నారు కృష్ణాజిల్లా పెడనకు చెందిన నాదెళ్ల కోటేశ్వర్రావు. దీని ఆకృతిని, పరిమాణాన్ని తానే తాపీమేస్త్రికి అందజేసి, నాలుగు నెలలు శ్రమపడి ఇలా 16 అడుగుల భారీ కెమెరా రూపాన్ని ఇంటిపై ప్రతిష్ఠించారు. దీని నిర్మాణం కోసం ఇంటి గృహప్రవేశ తేదీని సైతం వాయిదా వేశారంటే ఆయన సంకల్పం ఎంత గట్టిదో అర్థమవుతుంది. నికాన్ కంపెనీ భారతదేశం సిఇఓ ఫోన్ చేసి దానిని ఎలా రూపొందించారని అడిగి తెలుసుకుని అభినందించారట.

చిత్రం కథనం: **ఎం.పి.ఎస్.కె. దుర్గాప్రసాద్,** ఈనాడు, అమరావతి

ఈనాడు సినిమా

సాహో రే సైరా!

రెండు సినిమాలు.. 30 రోజులు... రూ. 600 కోట్లు

'సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి

'సాహో'లో ప్రభాస్, జాక్వెలైన్ ఫెర్నాండెజ్

'బాహుబలి' తరవాత ప్రభాస్ నుంచి వస్తున్న సినిమా 'సాహో'. 'బాహుబలి' రెండు భాగాలూ కలిపి దాదాపుగా రూ.2500 కోట్లు వసూలు చేశాయి. ఈ సినిమాతో ప్రభాస్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించాడు. దాంతో తదుపరి సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అందుకే ప్రభాస్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సివచ్చింది. 'సాహో' బడ్జెట్ రూ. 300 నుంచి రూ.350 కోట్ల వరకూ ఉంటుందని తెలుస్తోంది. బడ్జెట్ ఇంత అని చిత్రబృందం చెప్పడం లేదు గానీ, ఈ అంకెలకు దగ్గరగానే ఖర్చు చేశారు. బాలీవుడ్‌లో ప్రభాస్‌కి పెరిగిన క్రేజ్ కారణంగా అక్కడి హక్కుల రూపేణా మంచి ధరే పలికింది. చాలా ప్రాంతాల్లో సొంతంగా విడుదల చేసుకుంటోంది చిత్రబృందం. లేదంటే ఈ సినిమా వ్యాపారానికి సంబంధించిన లెక్కలన్నీ ఇప్పటికే బయటకు వచ్చేసేవి. నాలుగు భాషల్లో ఒకేసారి విడుదల చేయడం 'సాహో'కి కలిసొచ్చే అంశం.

తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథని సినిమాగా తీయాలన్నది చిరంజీవి ఆశ.. ఆలోచన. దాదాపుగా పదేళ్ల నుంచీ ఈ కల కంటున్నారాయన. అది ఇప్పటికి సాధ్యమైంది. "ఈ కథని సినిమాగా తెరకెక్కించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని తెలుసు. నా మార్కెట్ కూడా ఆలోచించుకోవాలి. అందుకే ఎప్పటికప్పుడు ఆ ఆలోచన పక్కన పెడుతూనే ఉన్నాను. 'బాహుబలి' వచ్చాక, ఆ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించిన తీరు చూశాక నమ్మకం పెరిగింది. అందుకే 'ఖర్చు ఎంతైనా ఫర్వాలేదు. అనుకున్న కథని అనుకున్నట్టు తీద్దాం' అనే నిర్ణయానికొచ్చాం" అని 'ఈనాడు సినిమా'తో చెప్పుకొచ్చారు చిరంజీవి. 'సైరా నరసింహారెడ్డి'ని పాన్ ఇండియా సినిమాగా తీర్చిదిద్ది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. 'సైరా' కోసం దాదాపు రూ.250 నుంచి రూ.300 కోట్ల వరకూ ఖర్చు పెట్టారు. చిరంజీవి కెరీర్‌లో ఇదే అత్యంత ఖరీదైన చిత్రం.

'బాహుబలి' పుణ్యం... తెలుగు సినిమా స్థాయి పెరిగింది. ఇది వరకు దక్షిణాది సినిమా అంటే చిన్న చూపు చూసినవాళ్లు సైతం మన దూకుడు చూసి ఆశ్చర్య పోతున్నారు. 'బాహుబలి' అనే కాదు.. 'కేజీఎఫ్' కూడా బాలీవుడ్‌లో దుమ్ము దులిపింది. సౌత్ సినిమా సత్తాని దేశ వ్యాప్తంగా చాటింది. తెలుగులో సినిమా అంటే బడ్జెట్ లెక్కలకు ఓ పరిమితి ఉండేది. 'ఇంతలోనే సినిమా తీయాలి' అంటూ గిరి గీసుకునేవారు. ఇప్పుడు ఆ గీతలు చెరిగిపోయాయి. 'ఖర్చు ఎంతైనా పెట్టండి.. తిరిగి రాబట్టగల సత్తా సినిమాకి ఉంద'ని నమ్ముతున్నారు. అందుకే రూ.వందల కోట్ల చిత్రాలు తెలుగు నుంచి తయారవుతున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో టాలీవుడ్ నుంచి రెండు భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకటి 'సాహో' అయితే రెండోది 'సైరా'. ఈ రెండు చిత్రాల మొత్తం బడ్జెట్ ఇంచుమించుగా రూ.600 కోట్లు.

	సాహో	సైరా నరసింహారెడ్డి
దర్శకుడు:	సుజిత్	సురేందర్‌రెడ్డి
నిర్మాణ సంస్థ:	యూవీ క్రియేషన్స్	కొణిదెల ప్రొడక్షన్స్
కథా విభాగం:	యాక్షన్ థ్రిల్లర్	చారిత్రక నేపథ్యం
విడుదల తేదీ:	ఆగస్టు 30	అక్టోబరు 2
బడ్జెట్ :	రూ.300కోట్లు - 350కోట్లు	రూ.250కోట్లు - రూ.300కోట్లు
భాషలు:	తెలుగు, తమిళం, మలయాళం, హిందీ	తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ
స్టార్ బలం:	ప్రభాస్, శ్రద్ధా కపూర్, జాకీష్రాఫ్, నీల్ నితిన్ ముఖేష్	చిరంజీవి, నయనతార, అమితాబ్‌బచ్చన్, తమన్నా, అనుష్క, సుదీప్, జగపతిబాబు, విజయ్‌సేతుపతి
చిత్రీకరణ కాలం:	దాదాపు రెండేళ్లు	దాదాపు రెండేళ్లు
తెరకెక్కించిన దేశాలు:	భారత్, అబుదాబి, ఆస్ట్రియా, ఇటలీ	భారత్, జార్జియా
ఇవి చూడాల్సిందే:	యాక్షన్ సన్నివేశాల కోసం భారీ ఎత్తున బడ్జెట్ కేటాయించారు. అబుదాబీలో తెరకెక్కించిన ఓ చేజ్ కోసం దాదాపు రూ.90 కోట్లు ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. ఎడారి నేపథ్యంలో మరో పోరాట ఘట్టం కోసం రూ.75 కోట్లు ఖర్చు చేశారట.	ఈ సినిమా కోసం తీర్చిదిద్దిన సెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం చెబుతోంది. యుద్ధ నేపథ్యంలోని సన్నివేశాలన్నీ భారీ ఎత్తున తీశారని తెలుస్తోంది. ఆ సన్నివేశాలన్నీ హాలీవుడ్ నిపుణుల ఆధ్వర్యంలో తెరకెక్కాయి.
ప్రధాన ఆకర్షణలు:	యాక్షన్ సన్నివేశాల కోసం మిషన్ గన్లు, ట్యాంకర్లు, ఆయుధాలు ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. చిత్రంలో ప్రభాస్ వాడే కారు, స్పోర్ట్స్ బైక్ ఇటలీలో ప్రత్యేకంగా తయారు చేయించారు. కారు కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశారట.	యుద్ధ సన్నివేశాల కోసం చిత్ర బృందం ప్రత్యేక కసరత్తు చేసింది. యుద్ధంలో గుర్రాలు, ఆయుధాలు ప్రత్యేకంగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. విశ్రాంతి సన్నివేశాలు, పతాక సన్నివేశాలు 'సైరా' స్థాయిని పెంచే విధంగా ఉంటాయట.

పూజా హెగ్డే

అఖిల్

అఖిల్‌తో పూజా

'మిస్టర్ మజ్ను' తరవాత అఖిల్ కాస్త విరామం తీసుకున్నారు. ప్రస్తుతం 'బొమ్మరిలు' భాస్కర్‌తో ఓ సినిమా చేస్తున్నారాయన. గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ కూడా ప్రారంభమైంది. గత కొంతకాలంగా కథానాయిక కోసం అన్వేషణ సాగిస్తున్నారు. అఖిల్ పక్కన కొత్త మ్యాయిని తీసుకోవాలనుకున్నారు. కొంతమందికి ఆడిషన్స్ కూడా నిర్వహించారు. అయితే ఏమైందో, ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఇప్పుడు కథానాయికగా పూజా హెగ్డేని ఎంచుకున్నారని సమాచారం. ఇదో కుటుంబ కథా చిత్రమని, భాస్కర్ శైలిలోనే సున్నితమైన అంశాలతో తెరకెక్కబోతోందని తెలుస్తోంది. కుటుంబ నేపథ్యాన్ని, అనుబంధాల్నీ గుర్తు చేసేలా టైటిల్ కూడా ఎంచుకున్నారట. టైటిల్‌ను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది.

నాని, ప్రియాంక, కార్తికేయ

అది 'గ్యాంగ్‌లీడర్' అభిమానులకు నచ్చుతుంది

- నాని

"నేను ఇప్పటివరకు చేసిన సినిమాల్లో ఏమాత్రం కష్టపడకుండా చేసిన చిత్రమిదే' ' అన్నారు నాని. ఆయన హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్‌లీడర్'. ప్రియాంక మోహన్ కథానాయిక. విక్రమ్ కె.కుమార్ దర్శకుడు. కార్తికేయ ప్రతినాయకుడిగా నటించారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సీవీఎమ్) నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 13న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 28న ట్రైలర్‌ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. నాని మాట్లాడుతూ "చిరంజీవి 'గ్యాంగ్‌లీడర్'కీ, ఈ సినిమాకీ సంబంధం లేదు. మాది నవ్విస్తూ ఆహ్లాదంగా సాగే సినిమా. 'గ్యాంగ్‌లీడర్'లోని ఒక షాట్‌ని మాత్రం ఈ సినిమాలో నేను చేశా. అది చిరంజీవిగారి 'గ్యాంగ్‌లీడర్' అభిమానులందరికీ నచ్చుతుంది. సెప్టెంబరు తొలి వారంలో ప్రమోషనల్ గీతాన్ని విడుదల చేస్తున్నాం. నేను, అనిరుధ్ కలిసి ఆ గీతం చేశాం. నాకు ఈ సినిమా ప్రయాణం ఒక పెయిడ్ హాలిడేలాగా అనిపించింది. నేను, దర్శకుడు విక్రమ్ ఇందులో ప్రతినాయకుడి గురించి మాట్లాడుకొన్నప్పుడు ముగ్గురి పేర్లు తెరపై కొచ్చాయి. అందులో మా ఇద్దరి ఎంపిక కార్తికేయనే. తను ఆ పాత్రని చాలా బాగా చేశాడు. విక్రమ్ కె.కుమార్ చాలా వేగంగా చేసిన సినిమా ఇది. లక్ష్మి, శరణ్యగారంటే నాకు చాలా ఇష్టం. అలాంటి అనుభవజ్ఞులైన నటీనటులతో కలిసి నటించడం చాలా ఆనందంగా అనిపించింది" అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ "చాలా తక్కువ సినిమాలు చేశాను. ఇంత త్వరగా ఇంత మంచి అవకాశం వస్తుందనుకోలేదు. 'గుణ 369' చేస్తున్న సమయంలో ఈ కథ విన్నా. రెండు నిమిషాల్లోనే ఈ సినిమా చేస్తానని ఒప్పుకొన్నా. ఈ సినిమా ఒప్పుకోకపోతే నేనొక మూర్ఖుడికింద లెక్క. నాని మాలాంటి కథానాయకులకి స్ఫూర్తి. నాని, విక్రమ్‌కె.కుమార్ సినిమా మొదలవుతుందనగానే ఎగ్జైట్ అయ్యా. అలాంటి సినిమాలో నాకు అవకాశం రావడం ఆశ్చర్యం కలిగించింది. హీరోగా చేస్తూ, విలన్‌గా చేయడం రిస్క్ అనిపించలేదు. నాని లాంటి కథానాయకుడే విలన్‌గా చేస్తున్నార"న్నారు. ప్రియాంక మోహన్ మాట్లాడుతూ "నాకు తొలి తెలుగు సినిమా. విక్రమ్, నానితో నటించడం సంతోషంగా ఉంది" అన్నారు.

గన్ను పెద్దదైనా ప్రాణం తీసే బుల్లెట్ చిన్నదే

ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు షారుఖ్ ఖాన్ 'జీరో'లో మరుగుజ్జు పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో బాలీవుడ్ నటుడు మరుగుజ్జుగా మారిపోయారు. ఆయనే రితేష్ దేశ్‌ముఖ్. 'మర్‌జావాన్' చిత్రంలో మరుగుజ్జుగా నటిస్తున్నారు రితేష్. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్నారు. ప్రత్యర్థులైన వారిద్దరి మధ్య జరిగే పోరాటంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో సిద్ధార్థ్, గుబురు గడ్డంతో ఉన్న రితేష్ తీక్షణంగా చూసుకుంటున్న దృశ్యంతో పాటు మరుగుజ్జు అవతారంలో ఉన్న రితేష్ గన్నుపట్టుకుని వస్తున్న చిత్రం ఆకట్టుకుంటోంది. "నువ్వు హీరో నేను జీరో.. కానీ తుపాకీ ఎంత పెద్దదైనా ప్రాణాలు తీసే బుల్లెట్ చిన్నగానే ఉంటుంద"ని ట్వీట్ చేశారు రితేష్. మిలప్ జవేరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నవంబరు 22న విడుదలవుతోంది. గతంలో 'ఏక్ విలన్'లోనూ ప్రత్యర్థులుగా తలపడ్డారు సిద్ధార్థ్, రితేష్.

సిద్ధార్థ్ మల్హోత్రా, రితేష్ దేశ్‌ముఖ్

తెలుగు భాష గొప్పతనం

మన మాతృభాషని మనమే కాపాడుకోవాలని తపించే ఒక ప్రేమ జంట కథే మా చిత్రం అన్నారు బి.సంతోష్ కృష్ణ. ఆయన తెరకెక్కిస్తున్న చిత్రం 'ఒక తెలుగు ప్రేమకథ' . మహేంద్ర, లావణ్య జంటగా నటించారు. కె.బసిరెడ్డి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. కె.ఎస్.రవికుమార్, ఆచార్య చక్రవర్తి సమేత గాంధీ అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "ఆంగ్లంపై మోజుతో తల్లిలాంటి తెలుగు భాషని మరిచిపోతున్నాం. ఇలాగే కొనసాగితే భాష అంతరించిపోతుంది. అలా జరగకూడదని ఒక ప్రేమ జంట ఏం చేసిందన్నది తెరపైనే చూడాలి. తెలుగు భాష గొప్పతనం గురించి చెప్పే ప్రయత్నమే ఈ చిత్రం" అన్నారు. "తెలుగువారు ఆంగ్లంలో మాట్లాడటానికే మక్కువ చూపుతున్నారు. ఆ సంస్కృతి మారాలనే విషయాన్ని ప్రేమకథతో చెప్పిన విధానం ఆకట్టుకుంటుంది" అన్నారు నిర్మాత. పీఎల్‌కే రెడ్డి, మహిత్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

లావణ్య, మహేంద్ర

ప్రేమతో... మీ శ్రీమతి

కృష్ణ చంద్ర, కారుణ్య, కట్రీన్, డీఎస్ రావు ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఇట్లు మీ శ్రీమతి'. మురళి బోడపాటి దర్శకుడు. ఎం.ఎస్.రెడ్డి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి టి.ప్రసన్నకుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దామోదర్ ప్రసాద్ క్లాప్‌నిచ్చారు. సాగర్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత మాట్లాడుతూ "ఇదో కుటుంబ కథా చిత్రం. వినోదాత్మకంగా సాగుతుంది. నిర్మాత డి.ఎస్.రావు పోలీస్ అధికారిగా కనిపిస్తారు. ఆయన పాత్ర ఆకట్టుకుంటుంద"న్నారు. "అక్టోబరులో చిత్రీకరణ ప్రారంభిస్తాం. విజయవాడలో 35 రోజుల పాటు షూటింగ్ జరుపుతాం. దాంతో సినిమా పూర్తవుతుంద"న్నారు దర్శకుడు.

దామోదర్ ప్రసాద్, కృష్ణ చంద్ర, డీఎస్ రావు, కారుణ్య

రాశి

నచ్చింది చేసే అమ్మాయి కథ

నందిత శ్వేత, రాశి, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సంజీవ్ మెగోటి దర్శకుడు. శివ కంఠమనేని నిర్మాత. హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కె.అశోక్ కుమార్ క్లాప్ కొట్టారు. విజయ్‌కుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. చంద్ర సిద్ధార్థ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "క్రైం థ్రిల్లర్ చిత్రమిది. తెలంగాణలో పుట్టి పెరిగిన లక్కీ అనే యువతి కథ. ఆమె స్వేచ్ఛగా, మనసుకు నచ్చింది చేసే తెగువ ఉన్న అమ్మాయి. ఆమెకు ఓ సమస్య ఎదురవుతుంది. దాన్ని అధిగమించడానికి ఏం చేసిందనేది తెరపైనే చూడాలి. దేవకి అనే మహిళ పాత్రలో రాశి కనిపిస్తార"న్నారు. "నేను ఎక్కువగా నాయికా ప్రాధాన్య చిత్రాల్లోనే నటించా. తొలిసారి ఈ సినిమాలో ఓ గ్లామర్ పాత్రను చేస్తున్నా" అన్నారు నందితా శ్వేత. రాశీ మాట్లాడుతూ "చాలా విరామం తర్వాత ఓ మంచి పాత్రతో రాబోతున్నా. నందితకి తల్లిగా కనిపిస్తా" అన్నారు. "రెండు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం. సినిమాలో ఐదు పాటలున్నాయి" అన్నారు శివ కంఠమనేని. అన్నపూర్ణ, రాంబాబు, అంజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృతి గార్గ్

భయం తెచ్చిన చిక్కులు

అభిరామ్ వర్మ, కృతి గార్గ్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'రాహు'. సుబ్బు దర్శకుడు. ఏవీఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జీ, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "ఒక యువతి తనలోని భయాలు, ఒత్తిళ్ల కారణంగా కొన్ని ప్రమాదకరమైన సమస్యల్లో చిక్కుకుంటుంది. ఆ చిక్కుల నుంచి ఆ యువతి ఎలా తప్పించుకోగలిగిందన్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. సస్పెన్స్ క్రైం థ్రిల్లర్ నేపథ్యంతో తెరకెక్కిన చిత్రమిది. అభి, కృతికా కొత్త వారైనా చాలా బాగా నటించారు. అమర్ ఎడిటింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద"న్నారు. "సుబ్బు చెప్పిన కథ నచ్చి నిర్మించడానికి ముందుకొచ్చాం" అన్నారు నిర్మాత స్వామి.

సింధు విజయం

వసుంధర

మూడేళ్లక్రితం రియో ఒలింపిక్ క్రీడా వేదికపై వెండి వెలుగులు విరబూయించిన సింధు... తాజాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్(సింగిల్స్)లో స్వర్ణకాంతులు వెదజల్లింది. ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా తన విజయాన్ని అమ్మ విజయకి అంకితం చేసింది. కూతురి గెలుపుకోసం ఉద్యోగాన్ని సైతం వదులుకున్న ఆ తల్లి...ప్రోత్సహిస్తే ప్రతి ఆడపిల్లా తన కూతురిలా శక్తికి ప్రతిరూపమని చెబుతున్నారు. వసుంధరతో ముచ్చటించిన ఆ వివరాలే ఇవి...

ఈ రోజుకోసమే మేమంతా ఎదురు చూశాం. సింగిల్స్‌లో ఛాంపియన్‌షిప్ సాధించిన మొదటి మహిళగా సింధు విజయం...ప్రతి ఆడపిల్లకీ స్ఫూర్తి కావాలి. మేం మా అమ్మానాన్నలకు ముగ్గురం అమ్మాయిలమే. ఇప్పుడు మాకూ ఇద్దరూ ఆడపిల్లలే. అయితేనేం! మా పేరే కాదు...దేశ కీర్తిని ఇనుమడింప చేసింది మా సింధు. మా పెద్దమ్మాయి దివ్య డాక్టర్. ఒకప్పటితో పోల్చుకుంటే... ఇప్పుడు ప్రతి రంగంలోనూ ఆడపిల్లలు తమ సత్తా చాటుతున్నారు. ప్రోత్సహిస్తే...ఎంతటి విజయాల్నైనా అందుకోగలరు. నా పుట్టిన రోజున సింగిల్స్‌లో మహిళల ఛాంపియన్‌షిప్‌ని గెలిచి నాకో అరుదైన కానుకని ఇచ్చింది సింధు. ఓ తల్లిగా, మహిళగా ఆమెను చూసి గర్వపడుతున్నా.

పన్నెండేళ్ల శ్రమ...

సింధు విజయం ఒక్కరోజులో వచ్చింది కాదు...ఆమె పన్నెండేళ్ల కష్టం. గెలుపు కోసం ఎంతో కఠోరశ్రమ చేసింది. ఆటలో గెలుపోటములే కాదు...ఎన్నో గాయాల తాలూకు బాధని అనుభవించేది. ఒక్కోసారి తగిలినవి చిన్న చిన్న దెబ్బలే అనుకున్నా... కనీసం ఏడాది పాటు విరామం తీసుకోవలసి వచ్చేది. ఒలింపిక్స్‌కి కొన్నాళ్లముందు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. సుమారు ఎనిమిది నెలలపాటు చక్రాల కుర్చీకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. అయినప్పటికీ చేతులతోనే సాధన చేస్తోంటే...తల్లిగా నా మనసు విలవిల్లాడిపోయేది. కష్టాల్ని ఎంతగా ఓర్చుకుంటే... దాని ఫలితం అంత తీయగా ఉంటుందనడానికి ఆ తరువాత రియోలో ఆమె గెలుచుకున్న రజత పతకమే ఉదాహరణ.

ఉద్యోగం వదులుకున్నా...

బ్యాడ్మింటన్ కెరీర్‌గా ఎంచుకోవాలనుకోవడం సింధు ఛాయిసే. తన ఇష్టాన్ని మేం గుర్తించాం. దానికి సాన పెట్టాలనుకున్నాం. ఆ ప్రయాణంలో ఎన్ని కష్టనష్టాలెదురైనా భరించాం. నేను తనకోసమే నా ఉద్యోగాన్నీ వదులుకున్నా. గెలుపోటములు సహజమే అయినా! ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలనే పరిణతిని తనకి ముందు నుంచీ అలవాటు చేశాం. అందుకే చేసిన పొరబాట్లను అధిగమించడానికి ప్రణాళికలు వేసుకుంటుంది. అదే తనని విజయానికి దగ్గర చేశాయి. ఆటకోసం... స్నేహితుల్ని, సరదాల్ని...అన్నీ వదులుకోవలసి వచ్చినా అన్నీ ఇష్టంగానే వదిలేసుకుంది. ఆమె త్యాగం ఊరికే పోలేదని చెప్పడానికి ఈ రోజు సాధించిన విజయమే ఉదాహరణ.

అక్కడ మహిళా డ్రైవర్లు పెరగనున్నారు

రవాణా శాఖలో... పురుషులతో సమానంగా మహిళలనూ డ్రైవర్లుగా నియమించే పనిలో ఉంది కేరళ సర్కారు. ఈ రంగంలో లింగ వివక్షను రూపుమాపే దిశగా ఇలా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటోంది. ఇప్పటికే అక్కడ కొందరు మహిళలు బస్సు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో రవాణాశాఖలో మాత్రమే కాదు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళలు డ్రైవర్లుగా పని చేసే అవకాశం కల్పించింది అక్కడి ప్రభుత్వం.

సమానత్వం సాధ్యమే!



స్వాతంత్ర్య భారతావనికి డెబ్బయి ఏళ్లు...
అయినా అతివకు స్వేచ్ఛేక్కడిది!
తమ్ముడికేమో కాన్వెంట్ స్కూల్... ఆమెకేమో సర్కారు బడి!
గడప దాటి అడుగు బయట పెట్టాలంటే ఆంక్షలు...
చదువుకొని, ఉద్యోగం చేయాలన్నా...
తప్పని ప్రతిబంధకాలు...
శ్రమించి సంపాదించిన డబ్బును ఖర్చు చేయాలన్నా...
భర్త అనుమతి సరేసరి.
చట్టాలొచ్చినా గృహహింసకు
బాధితులవుతున్నవారెందరో...
ఇది ఒకప్పటి పరిస్థితి కాదు...
ఇప్పుడు మన ఇంట్లో, మన సమాజంలో మహిళలకు
ఎదురవుతున్న అగచాట్లు. దీనికి పరిష్కారాలు
మనచేతుల్లోనే అంటున్నారు కొందరు.

❑ బలహీనులమని అనుకోకూడదు...

స్త్రీలకు సమానత్వం అనేది అవసరంలేదు. ఎందుకంటే... స్త్రీలేనిదే పురుషుడు లేడు, సమాజం లేదు. మహిళల ఆలోచనావిధానం కొంతవరకూ మారితే చాలు. వాళ్లను మించిన శక్తిమంతులు మరొకరు ఉండరు. ఉదాహరణకు మా అమ్మ తన చిన్నతనంలోనే యూనివర్సిటీ స్థాయిలో బంగారుపతకం సాధించింది. మా పిన్నీ అంతే. తనూ డిగ్రీలో గోల్డ్ మెడలిస్ట్. నాకో అక్క, చెల్లి. అమ్మ వాళ్లిద్దరూ చదువుకునేలా, ధైర్యంగా ఉండేలా పెంచింది. మగవాళ్లతో పోల్చేది కాదు. ఇంట్లో మొదటిప్రాధాన్యం వాళ్లకే. ఆడపిల్ల తరువాతే ఎవరైనా అని చెప్పేది. ఇప్పుడు అక్క టీచర్‌గా చేస్తోంది. ఆ రోజు అమ్మ ప్రోత్సహించడం వల్లే...తన కాళ్లపై తాను నిలబడగలిగింది. ఇలాంటి మార్పు ప్రతిచోటా వస్తే ఆడపిల్లలకు గౌరవం దక్కుతుంది. ఈ రోజుల్లోని సామాజిక పరిస్థితులు, రకరకాల వ్యాపకాల దృష్ట్యా తామేదో బలహీనులమని అనుకుంటున్నారు చాలామంది అమ్మాయిలు. వాళ్లు ఏదయినా సాధించగలరని అనుకుంటే చాలు... ఎన్నో చేయగలుగుతారు. చిన్నప్పటినుంచీ మగవాళ్లతో పోల్చకుండా... ఆడవాళ్లలో ధైర్యం నూరిపోయగలిగితే వాళ్లను మించినవారు ఉండరు. ఇంటిని ఉన్నతంగా చక్కదిద్దే మహిళలు... కెరీర్, ఇంటికే పరిమితం కాకుండా... సమాజంలోనూ తమవంతుగా మార్పు తేగలిగితే ఎంతోమందికి మేలు చేసినవారవుతారు. రాజకీయాల్నీ కెరీర్‌గా ఎంచుకునే రోజు వస్తే... తమలాంటి ఎంతోమంది మహిళల్ని చక్కదిద్దగలుగుతారు.

– ప్రవీణ్‌కుమార్, వ్యాపారవేత్త, హైదరాబాద్

❑ ఇంకొన్నేళ్లు పట్టొచ్చు...

అప్పట్లో తల్లిదండ్రులే పిల్లల పెంపకంలో తేడాలు చూపించేవారు. అమ్మాయి, అబ్బాయి ఒకే పాఠశాలలో చదువుతున్నా ఇంటి పనులన్నీ ఆడపిల్లతోనే చేయించేవారు. మగవాళ్లు అన్నింట్లో ఎక్కువ అనే మనస్తత్వం అందరిలోనూ ఉండేది. మా పాఠశాలలో హాజరు పట్టికలో అబ్బాయిల పేర్లన్నీ రాసిన తరువాతే అమ్మాయిల పేర్లు రాసేవారు. వివక్ష అక్కడి నుంచి మొదలై, అన్ని విషయాల్లో ప్రతిబింబించేది. అబ్బాయిలను పెద్ద చదువులు చదివిస్తూ, అమ్మాయిలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసి పంపించేవారు. నేను రాజమండ్రి, కాకినాడలో చదువుకున్నా. వృత్తి రీత్యా బెంగళూరు, హైదరాబాద్ వంటి పట్టణాల్లోనూ పనిచేశాను. అప్పటితో పోలిస్తే ఇలాంటి విషయాల్లో ఎంతో కొంత మార్పు వచ్చింది కానీ పూర్తి స్థాయిలో లింగసమానత్వం సాధించడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. లింగనిర్ధారణ చట్టవిరుద్ధమైనా...ఇంకా దొంగచాటుగా పరీక్షలు చేయిస్తూ అమ్మాయి అని తెలియగానే కడుపులోనే చంపేస్తున్నారు. పెద్దవారిలో ఈ ఆలోచనాధోరణి పోతే సమాజంలో ఎంతో మార్పు వస్తుందని అనుకుంటున్నా.

– డాక్టర్ పద్మజ, ఆప్తమాలజిస్ట్

❑ స్వేచ్ఛనివ్వాలి....

ఈ రోజుల్లో అమ్మాయిలు అన్నిరంగాల్లో రాణిస్తున్నా... కొన్నిచోట్ల ఇంట్లో పరిస్థితులు బయటకు వెళ్లనిచ్చేలా లేవు. మా చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏవైనా సామాజిక కార్యక్రమాలు జరిగితే అబ్బాయిల్లా మేం అందులో పాల్గొనలేం. ఒకవేళ అమ్మానాన్న అనుమతిచ్చినా... చుట్టూ ఉండే సమాజం ఆడపిల్లవు నీకవసరమా... అని ఎత్తిచూపుతుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే కదా మన ఆలోచన పరిధి విస్తరించేది, బయటి ప్రపంచం తెలిసేది. స్థానిక సంస్థల్లో ఎన్నికైన మహిళ ప్రజాప్రతినిధుల విషయంలో చాలా వరకు వారి భర్తలదే పెత్తనం. అబ్బాయిల్లా వారూ బయటి కార్యక్రమాల్లో పాల్గొని ఉండుంటే వారిలో నాయకత్వ లక్షణాలు పెరిగేవి. తమ విధుల్లో భర్తలను వేలుపెట్టనిచ్చేవారు కాదు. నా స్నేహితుల్లో చాలా మందికి 18 ఏళ్లు దాటిన వెంటనే పెళ్లిళ్లు చేసేశారు. పై చదువులు, భవిష్యత్తు గురించి వారు కన్న కలలకు గౌరవం లేదు. వారు ఏది చేయాలన్నా భర్త దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితిలో మార్పురావాలి. ఆడపిల్లల నిర్ణయాలకు స్వేచ్ఛనివ్వాలి.

– పులిశెట్టి ధనలక్ష్మి, విద్యార్థి, ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్

❑ చదువుతోనే మార్పు

నా చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని విషయాల్లో అమ్మాయిలను తక్కువగానే చూస్తున్నారు. అబ్బాయిలను ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో చేర్పించడం, అమ్మాయిలను విస్మరించడం గ్రామాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. ఇప్పటికీ మాఊర్లో ద్విచక్ర వాహనంపై అమ్మాయి ఒంటరిగా వెళ్లడమూ తప్పే అన్నట్లు చూస్తారు. మా ఫౌండేషన్ ద్వారా సేవ చేసేందుకు గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడివారు రకరకాలుగా ప్రశ్నించేవారు. టీషర్ట్ వేసుకోవడం తప్పన్నట్లు చూసేవారు. 'మీకెందుకమ్మా ఇలాంటివన్నీ.. మీ పెద్దవాళ్లు ఆడపిల్లలను ఇలా ఎలా బయటికి పంపిస్తున్నారు?' అనే ప్రశ్నలు ప్రతిచోటా ఎదురయ్యేవి. ఇవన్నీ విన్నప్పుడు ఇంకెక్కడుంది సమానత్వం అనిపించేది. అన్ని విషయాలు వారందరికీ అర్థమయ్యేలా వివరించి, మా ప్రయత్నం గురించి చెప్పేవాళ్లం. సేవకు ఆడ, మగ తేడాలేదు అని అని వారికి అవగాహన కల్పించి ముందుకెళ్లేవాళ్లం. చదువుతోనే లింగసమానత్వం సాధ్యమవుతుందని నమ్ముతున్నా.

– తేజస్విని పొడపాటి, సామాజిక కార్యకర్త, భూమి ఫౌండేషన్

❑ ఎంతో మార్పు వచ్చింది... కానీ!

మా తరం ముందున్న మహిళల్ని గమనిస్తే... మగవాళ్లదే ప్రపంచం. ఆడపిల్లల్ని పెంచడం, కాస్త పెద్దయ్యాక ఓ అయ్యచేతిలో పెట్టడం... ఇలాగే గడిచిపోయాయి రోజులు. పనులు, తిండి, నిద్ర తప్ప వాళ్లకు ఏమీ ఉండేది కాదు. దానివల్ల ఆ రోజుల్లో మహిళలకు ఎలాంటి ఒత్తిళ్లు లేకపోయినా... స్వేచ్ఛ అంతంత మాత్రమే. అవి పురుషాధిక్యత రోజులు. మా ఇంట్లో పరిస్థితే చూస్తే... ఆడవాళ్లు వంటింటికే పరిమితమైన రోజులు. ఆడవాళ్లెవరూ మగవారి అభిప్రాయానికి ఎదురుచెప్పేవారు కాదు. ఏ నిర్ణయమైనా మగవారిదే. పురుషులకు రాజీ పడటం అనేది తెలిసేది కాదు. స్త్రీలకేమో తమ కోరికలు, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉండేది కాదు. మా తరం వచ్చేసరికి మా అక్కలు పెద్దగా చదువుకోకపోయినా మా ఆవిడ నాతో సమానంగా ఉద్యోగం చేసేది. ఇద్దరం కష్టపడాల్సిన పరిస్థితి. ఇంట్లో నేనూ తనకు పనుల్లో ఎంతోకొంత సాయం చేసేవాడిని. ఇప్పుడు మా కూతురు డాక్టర్. కోడలూ పనిచేస్తోంది. మా అల్లుడు, కొడుకూ ప్రతి పనిలో వాళ్లకు అందుబాటులో ఉంటున్నారు. వీళ్లతో సమానంగా ఇంటిపనుల నుంచి... ప్రతి బాధ్యతను పంచుకుంటున్నారు. పురుషులు పరిస్థితులను అర్థం చేసుకుని చాలామంది మగవారు రాజీపడుతున్నారు. రాబోయే తరాల్లో ఇది ఇంకా పెరుగుతుందే తప్ప తగ్గదు. ఇదే మార్పు సమాజంలో ఉంటే... స్త్రీలకు ఎంతో సహకారం లభించినట్లే. వాళ్లు ఏ రంగంలోనైనా ధైర్యంగా అడుగుపెట్టగలుగుతారని నా అభిప్రాయం.

–వేమూరి సుబ్బారావు, రిటైర్డ్ ఉద్యోగి

❑ చట్టాలు సరిగ్గా అమలు చేయాలి...

కొన్నేళ్ల కిందట మహిళలు చదువుకోవాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చేది. వారికి ఆస్తి హక్కు ఉండేది కాదు. కేవలం చదువు కోసమే వారు పోరాడాల్సిన దుస్థితి. ఒక లక్ష్యం, ఆదర్శం ఉన్న మహిళలు మాత్రమే ఎంతో పోరాడి చదువుకోగలిగేవారు. తరువాత కాలంలో జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో మార్పులు వచ్చాయి. సమాజంలో మహిళల అణచివేతను తొలగించాలన్న ఉద్దేశంతో ఎన్నో పోరాటాలూ జరిగాయి. వీటి ఫలితంగా ప్రభుత్వాలు స్త్రీల రక్షణ కోసం గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం... ఇలా చాలా చట్టాలు చేశాయి. ఇవి మహిళా జీవితంలో కొంత వరకు మార్పు తీసుకొచ్చినప్పటికీ...అమలులో మాత్రం ఇంకా వెనకబడిపోతున్నాం. వాటిని సరిగ్గా అమలు చేయాలి. మహిళల కోసం ప్రత్యేకంగా విమెన్ హెల్ప్‌లైన్ సెంటర్లు, పోలీస్ స్టేషన్లు ఉన్నా...వాటి సంఖ్య ఇంకా పెరగాలి.

– కొండవీటి సత్యవతి, భూమిక ఫౌండేషన్

❑ మగవారి దృక్పథం మారాలి...

మా ఊర్లో, చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటికీ ఆడపిల్ల పుడితే చిన్నచూపే చూస్తారు. ఎంతో మంది 'అయ్యో మగబిడ్డ పుట్టకపాయే' అని సానుభూతి చూపిస్తున్నారు. పుట్టిన వెంటనే భవిష్యత్తులో ఇవ్వబోయే వరకట్నం గురించి ఆలోచించి భారంగా భావిస్తున్నారు. కానీ ఈ ధోరణి మారాలి. ఆర్థిక వ్యవహారాల్లో ఎప్పుడూ మగవారి మాటే చెల్లుతుంది. మహిళల విషయంలో మగవారి దృక్పథం మారాలి. ఆర్థిక, ఇతర వ్యవహారాల్లో వారి నిర్ణయాలకు గౌరవం ఇవ్వాలి. అప్పుడు సమానత్వం సాధ్యం అవుతుంది.

– గాజుల రాహుల్, విద్యార్థి, ఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్

మొటిమ కలవరం పెడుతోందా?

ఆడపిల్లలకు ముఖంపై చిన్న మొటిమ కనిపిస్తే చాలు... అంతులేని బాధ. వయసుతో సంబంధం లేకుండా వచ్చే ఈ సమస్యను ఇంటి చిట్కాలతో తగ్గించుకోవచ్చు. అదెలాగంటే !

- కమలాఫలంలో ఉండే శాలిసిలిక్ ఆమ్లం మొటిమల్ని నిరోధిస్తుంది. రెండు చెంచాల కమలాఫలం రసంలో చెంచా తేనె కలిపి ముఖానికి పూతలా వేసుకోవాలి. పది నిమిషాలయ్యాక గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికోసారి ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.
- రెండు చెంచాల తేనెలో చిటికెడు దాల్చిన చెక్కపొడి, కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాల తరువాత చల్లని నీటితో కడిగితే, చర్మగ్రంథులు శుభ్రపడి, మొటిమలు తగ్గుముఖం పడతాయి.
- బొప్పాయిలో ఎ, సి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, జిడ్డుని అదుపులో ఉంచుతాయి. బొప్పాయి గుజ్జుని ముఖానికి లేపనంలా రాసి ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా తరచూ చేస్తే మార్పు కనిపిస్తుంది. ముఖచర్మం కాంతులీనుతుంది.

ఆయనకు ఆమే ప్రపంచం

ప్ర నేను అమెరికాలో ఉద్యోగం చేస్తున్నా. మాకు ఇరవైఏళ్ల కిందట పెళ్లయ్యింది. పదిహేడేళ్ల పాప ఉంది. మా ఆయనకు తరచూ ఇండియా నుంచి ఒకామె ఫోన్ చేస్తుంది. దీని గురించి ఆయన్ని చాలా సార్లు అడిగా. ఉద్యోగంలో భాగంగా ఆమెతో ఎప్పుడూ మాట్లాడాల్సి ఉంటుందని చెప్పారు. ఆవిడకు మెంటారింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ మధ్య మా వారు వేరే ఉద్యోగానికి మారారు. ఇప్పటికీ ఆమెతో మాట్లాడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ టచ్‌లో ఉన్నారు. ఇది తెలిసి నిలదీస్తే పాత సమాధానం ఇవ్వడమే కాదు... అనుమానిస్తున్నావని నిందిస్తున్నారు. ఆయనకు నేను ఎప్పుడు ఫోన్ చేసినా బిజీ అంటారు. నేను ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటా. ఈయన ప్రవర్తనతో అన్నింటికీ దూరమైపోతున్నా. మోసపోయాననే భావన కలుగుతోంది. ఏం చేయాలి. సలహా ఇవ్వగలరు? – ఓసోదరి

జ భార్యాభర్తల బంధం... పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. ఇన్నేళ్ల మీ బంధంలో పారదర్శకత ఎంతుందో ఆలోచించుకోండి. వృత్తిగత జీవితంలో సహోద్యోగులు, కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడటం సర్వసాధారణం. మీవారు ఓ అమ్మాయితో తరచూ మాట్లాడుతున్నారని రాశారు. స్వదేశానికి చెందిన వ్యక్తి కావడంతో ఆమెపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెంటారింగ్ చేస్తున్నారేమో! ఒకవేళ కాకపోయినా... ఇరవై ఏళ్ల సహచర్యం మీది. ఈ ప్రయాణంలో ఒకరి విషయాలు మరొకరు తెలుసుకునేంత చనువు, సాన్నిహిత్యం మీ మధ్య ఉండి ఉంటాయి. అందులోనూ టీనేజీ వయసున్న కూతురు ఉన్నప్పుడు మీరిద్దరూ మాట్లాడుకునేందుకు ఎన్నో విషయాలుంటాయి. ఈ పరిస్థితుల్లో ఆయన వేరే ఆమెతో మాట్లాడటం, మీరు ఆయన్ని ఈ విషయం అడగడం తప్పు కాదు...అడిగే విధానంలో లోపం ఏమైనా ఉందేమో సరి చూసుకోండి. ఉద్యోగం మారినా... ఇప్పటికీ మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఏముందనేదే మీ సందేహం గనుక అదే ప్రస్తావించి చూడండి. ఏ కారణాలతో ఇంకా మాట్లాడాల్సి వస్తుందో నిర్ధారించుకోండి. మీరూ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానంటున్నారు. నిజంగా అవసరం ఉంటే... మీరే ఆ అమ్మాయికి ఏమైనా సాయం చేయగలరేమో ఆలోచించండి. ఇదే విషయాన్ని మీ వారితో చెప్పి ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే మీకో స్పష్టత వస్తుంది. ఇన్నేళ్ల మీ వైవాహిక జీవితం ఎదుగుతోన్న మీ పాపకి ఆదర్శంగా ఉండాలి. అనవసరమైన అపోహలు, ఆలోచనలతో మీ బంధాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దు. పరిస్థితిని పూర్తిగా తెలుసుకోకుండానే ఆ అమ్మాయి మీ మధ్య ఉన్న అనుబంధానికి అడ్డుగోడ అవుతుందనే నిర్ణయానికి వచ్చేయకండి. ఆయన ప్రవర్తనలో, నడవడికలో, మాట్లాడే ధోరణిలో ఏమైనా అసందర్భమైన ప్రవర్తన ఉన్నా, నచ్చని విషయాలు గుర్తించినా... కంగారుపడొద్దు. నేరుగా మీ భర్తతోనే కూర్చొని మాట్లాడండి. మీ భయాలు, అభద్రత వారికి చెప్పండి. ఆ తరువాతే ఏం చేయాలనేది ఆలోచించొచ్చు. అంత వరకూ తొందరపడకపోవడమే మేలు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

డియర్ వసుంధర

డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

రంగు ఇసుకతో హంగులెన్నో!

చూద్దాం చేద్దాం

కాస్త సృజన, కొంత సమయం కేటాయించగలిగితే... అందమైన వస్తువులెన్నింటినో ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. వాటిని కానుకగా ఇవ్వొచ్చు. గృహాలంకరణగానూ వాడేయొచ్చు. అసలు గాజు సీసాలతో అందమైన కళాకృతుల్ని ఎలా తయారు చేయాలో చూద్దామా...

సీసాల్లో కాంతులు

కావలసిన వస్తువులు: పొడవాటి గాజు సీసా, అలంకరణ విద్యుత్తు దీపాలు, రెండు మూడు రంగుల్లో ఇసుక, జరీ రిబ్బను, కాగితపు ఏంజెల్ బొమ్మ.

తయారీ: ముందుగా గాజు సీసాను శుభ్రంగా కడిగి ఆరనిచ్చి దానిలో ఇసుకను నింపాలి. అందులో ఒక్కొక్క రంగు ఇసుకను నింపాలి. ఇప్పుడు కాగితంపై ఉన్న చిత్రాన్ని కత్తిరించి గాజు సీసాపై అతికించాలి. తరువాత విద్యుత్తు దీపాలను నెమ్మదిగా సీసా లోపల పెట్టాలి. చివరగా జరీ రిబ్బను కడితే చాలు. దాన్ని వెలిగిస్తే జిగేల్‌మంటుంది. చిన్నచిన్న పార్టీల్లో అలంకరణగా అదిరిపోతుంది.

నట్టింట్లో సముద్రం

కావలసిన వస్తువులు: గాజుపాత్ర, నీలం రంగు ఇసుక, తెల్లరాళ్లు, అలంకరణకు అవసరమైన వస్తువులు(వంతెన, స్టీమరు, లైట్‌హౌస్).

తయారీ: గాజుపాత్రను శుభ్రంగా తుడవాలి. దానిలో రంగు ఇసుకను కొంత వరకు నింపాలి. తరువాత తెల్లని రాళ్లను కొండలా కనిపించేటట్లు వరుసగా అమర్చుకోవాలి. చివరగా అలంకరణ కోసం స్టీమరు, వంతెన, లైట్‌హౌస్ వంటివాటిని థీమ్ ప్రకారం సర్దుకోవాలి. ఇలా చేస్తే సముద్రం మీ నట్టింట్లో ఉన్నట్లు అనిపిస్తుంది. మీ సృజనను బట్టి మరిన్ని థీమ్‌లను ఇలానే చేసుకోవచ్చు.

మిస్టరీ ఛేదించే నౌకరీ!

ఆధారాలేమీ దొరక్కుండా పకడ్బందీగా నేరాలూ, మోసాలూ చేసి చట్టం నుంచి తప్పించుకుంటున్నవారు పెరుగుతున్నారు. దీంతో ఎన్నో కేసులు మిస్టరీగా మిగులుతున్నాయి. ఇలాంటి జటిలమైన కేసుల పరిష్కారంలో ఆధునిక అస్త్రం.. ఫోరెన్సిక్ సైన్స్! రోజురోజుకూ దీని ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగంలో నైపుణ్యం ఉన్నవారి సేవలు నేర పరిశోధనలో కీలకమవుతున్నాయి. ఫోరెన్సిక్‌పై ఆసక్తి ఉండి, దీనిలో ప్రవేశించాలనుకునేవారికి వివిధ కోర్సులతోపాటు చక్కని కొలువులూ లభిస్తున్నాయి!

ఆధునిక సాంకేతికతను అస్త్రంగా మలుచుకుని, హైటెక్ రీతిలో జరిగే హత్యలు, నేరాలు, సైబర్ దాడుల గురించి తరచూ వింటున్నాం. భారత్‌తో సహా, ప్రపంచవ్యాప్తంగా నేరాలు, ఆర్థిక మోసాలు ఎక్కువయ్యాయి. వీటికి బాధ్యులైనవారిని గుర్తించి, చట్టం ముందు నిలబెట్టడానికి సాధారణ నైపుణ్యం సరిపోవడం లేదు. ఆధారాలు అన్వేషించి, అసలు దోషుల గుట్టు విప్పడానికి ఆవిర్భవించిందే ఫోరెన్సిక్ సైన్స్. ఇది కేవలం హంతకులను గుర్తించే శాస్త్రమే కాదు. మోసగాళ్లను పట్టించే దివ్యాస్త్రం కూడా. ముడుపులు తీసుకున్నవారినీ, మార్ఫింగ్ చేసినవారినీ, వన్యమృగాల వేటగాళ్లనూ, పసిమొగ్గలపై పైశాచికాన్ని ప్రదర్శించినవారినీ .. ఇలా అన్ని రకాల నేరగాళ్లనూ గుర్తించడానికి ఫోరెన్సిక్ సైన్స్ సమర్థ సాధనంగా అవతరించింది.

సాక్ష్యాలు లేకుండా ఖూనీలు చేసే నరహంతకులకూ, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేవారికీ, వస్తువులు దాచేసి దొంగలెత్తుకుపోయారని నాటకాలాడేవారికీ, ఆస్తులను తగలెట్టి ఆదుకోమని అర్థించేవారికీ, నకిలీ పత్రాలతో నిలువునా దోచుకుంటున్నవారికీ ఫోరెన్సిక్ నిపుణులు చెక్ పెడుతున్నారు. వీరు నేరాలు, ఘోరాలను అధ్యయనం చేసి, శాస్త్రీయంగా విశ్లేషించి వాటి గుట్టుమట్లను విప్పుతారు. తిరుగులేని ఆధారాలతో దర్యాప్తునకు సహకరించి, నేరగాళ్ల పని పట్టటంలో కీలక పాత్ర వహిస్తున్నారు.

ఈ రంగంలో కెరియర్ అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఇందుకోసం వివిధ స్థాయుల్లో పలు రకాల స్పెషలైజేషన్లతో భిన్న సంస్థలు కోర్సులు అందిస్తున్నాయి. సమాచారాన్ని విశ్లేషించటం, లోతుగా ఆలోచించడం, వాస్తవానికి దగ్గరగా ఊహించడం, తర్కం, సునిశిత పరిశీలన ఉన్నవారు ఈ కోర్సుల్లో రాణించగలుగుతారు. కొన్నిసార్లు ఇతర విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి వస్తుంది. కాబట్టి మంచి కమ్యూనికేటర్లుగా, బృంద సభ్యులుగా మెలగడం తప్పనిసరి.

ఏ హోదాలు.. విధులు ?

క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్: నేరం జరిగిన తీరును గమనిస్తారు. ఆ నేరం ఎలా జరిగిందో నమూనాను తయారుచేస్తారు. ఆధారాలకోసం ప్రయత్నిస్తారు. అక్కడ లభించినవి సేకరించి, ప్రయోగశాల పరిశీలనకు పంపుతారు.

వైల్డ్ లైఫ్ ఫోరెన్సిక్ స్పెషలిస్టు: అనుమానాస్పదంగా చనిపోతున్న వన్యమృగాలపై వీరు అధ్యయనం చేస్తారు. అక్కడ లభించిన ఆధారాలతో కారకులను గుర్తిస్తారు.

ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్: కొందరు విష ప్రభావంతో చనిపోతారు. అయితే వారే సేవించారా, ఎవరైనా తెలీకుండా వారి ఆహారంలో కలిపారా వీళ్లు నిర్ధరిస్తారు. అలాగే డ్రగ్స్ మొదలైనవి తీసుకుంటే ఆ మాదకద్రవ్యం పేరు, మోతాదు గుర్తిస్తారు.

ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్/ సైకాలజిస్ట్: వీరు నేరారోపణ ఎదుర్కొంటున్నవారి మానసిక స్థాయిని విశ్లేషిస్తారు. సంబంధిత వివరాలు కోర్టులో అందిస్తారు. విచారణ ఎదుర్కోగలిగేలా ఉన్నారా, లేదా గమనిస్తారు. మానసిక రోగులు, సైకోలు హత్యలో భాగమైనప్పుడు ఈ నిపుణుల సేవలే కీలకం.

ఫోరెన్సిక్ లింగ్విస్టులు/ ఫోరెన్సిక్ స్పీచ్ నిపుణులు: వీరు నేరం జరిగినచోట పత్రాలు, వాయిస్ వివరాలు ఏవైనా లభిస్తే వాటిని గమనిస్తారు. దస్తూరీని పరీక్షించి ఆ పత్రాలను ఎవరు రాశారో గుర్తిస్తారు. ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ తో అక్కడ లభించిన ఆడియో టేపుల్లో గొంతును విశ్లేషించవచ్చు. లభించిన వివరాలు అసలువో, నకిలీవో నిర్ధారిస్తారు.

ఫోరెన్సిక్ పాథాలజిస్ట్: అనుమానాస్పద మరణాల వెనుక మర్మాలను వీరు విప్పుతారు. ఇందుకోసం పోస్టుమార్టం చేస్తారు. ప్రమాదవశాత్తూ మరణించారా, సహజంగానే చనిపోయారా, హత్య జరిగిందా, ఆత్మహత్య చేసుకున్నారా... ఈ వివరాలు కచ్చితత్వంతో వీరు చెప్పగలరు.

ఫోరెన్సిక్ సిరాలజీ నిపుణులు: వీరు రక్తాన్ని, శరీర స్రావాలను విశ్లేషించి, అవి ఎవరివో గుర్తిస్తారు. డీఎన్ఏ పరీక్షలు జరిపి కారకులను గుర్తించగలరు.

ఫోరెన్సిక్ అడొంటాలజీ: బాధితుల ఒంటిపై గాట్లు ఏమైనా ఉంటే వాటికి కారకులను వీళ్లు పరిశీలిస్తారు. జంతువుల కారణంగా జరిగిందా లేదంటే మనుషులే పళ్లతో కరిచారా, గోళ్లతో రక్కారా తదితర విషయాలను వెలుగులోకి తెస్తారు.

ఫోరెన్సిక్ అకౌంటెంట్లు/ ఆడిటర్లు/ ఇన్వెస్టిగేటర్లు: ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను తెలుసుకోవడం, ఆర్థిక నేరాలను గుర్తించడం సాధ్యమవుతుంది. వివాదాల్లో ఉన్న కంపెనీల ఆర్థిక లావాదేవీలను సులువుగా అర్థమయ్యేలా కోర్టుముందు వీరు ఉంచుతారు. ఆర్థిక ఒప్పంద పత్రాలు (బాండ్స్), నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు. ఈ తరహా సేవలకు అంకెలపై పట్టు, తర్కపరిజ్ఞానం తప్పనిసరి. ఈ విభాగంలో అభ్యర్థులు తమ ప్రావీణ్య గుర్తింపు కోసం పరీక్ష రాసి సర్టిఫికేషన్ అందుకోవచ్చు. సర్టిఫైడ్ ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రొఫెషనల్ (సీఎఫ్ఏపీ)ను ఇండియా ఫోరెన్సిక్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఐసీఎస్), పుణె అందిస్తుంది. ప్రస్తుతం ఫోరెన్సిక్ అకౌంటింగ్‌లో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. అకౌంట్స్, లా నేపథ్యం ఉన్నవారు ఈ విభాగంలో రాణించడానికి అవకాశాలు ఉన్నాయి. వీరికి ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలు, లీగల్ ఫర్మ్‌ల్లో ఉద్యోగాలు ఉంటాయి.

అభ్యర్థి చదువుకున్న కోర్సును బట్టి సంబంధిత హోదాలు లభిస్తాయి. ఫోరెన్సిక్ క్రైమ్ ల్యాబొరేటరీ అనలిస్ట్, ఫోరెన్సిక్ ఇంజినీర్, ఫోరెన్సిక్ ఆర్కిటెక్ట్స్, ఫోరెన్సిక్ వెటర్నరీ సర్జన్.. తదితర హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించవచ్చు.

కోర్సులు.. స్పెషలైజేషన్లు

- సైన్స్ గ్రూప్‌తో ఇంటర్ చదివిన విద్యార్థులు బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో డిగ్రీ పూర్తిచేసినవారు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో చేరడానికి అర్హులు.
- ఎంఏ క్రిమినాలజీ కోర్సులోకి గ్రాడ్యుయేట్లు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ అనంతరం పీహెచ్‌డీ లో చేరవచ్చు.

వివిధ సంస్థలు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి. స్పెషలైజేషన్లు సైతం ఉన్నాయి. ఎమ్మెస్సీ- డిజిటల్ ఫోరెన్సిక్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ - హోం ల్యాండ్ సెక్యూరిటీ అండ్ యాంటీ టెర్రరిజం, ఎంబీఏ ఫైనాన్స్(ఫోరెన్సిక్ అకౌంటింగ్), ఎంటెక్ - సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్, పీజీ డిప్లొమా - ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, ఫింగర్ ప్రింట్ సైన్స్, క్రిమినాలజీ, ఫోరెన్సిక్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ అకౌంటింగ్, ఫోరెన్సిక్ అడొంటాలజీ, ఫోరెన్సిక్ నర్సింగ్... తదితర కోర్సులు పలు సంస్థల్లో బోధిస్తున్నారు.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్ నెలకొల్పారు. ఈ సంస్థ ఎంఏ క్రిమినాలజీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు అందిస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఏడాది వ్యవధితో పీజీ డిప్లొమా ఇన్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అండ్ లా, పీజీ డిప్లొమా ఇన్ విక్టిమాలజీ అండ్ విక్టిమ్ అసిస్టెన్స్, పీజీ డిప్లొమా ఇన్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ కోర్సులను కొత్తగా ప్రవేశపెట్టింది. గ్రాడ్యుయేట్లు ఎవరైనా వీటిలో చేరవచ్చు. ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌కి మాత్రం సైన్స్ గ్రాడ్యుయేట్లే అర్హులు.

గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఈ విభాగంలో పలు రకాల కోర్సులను అందిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ, పంజాబ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లఖ్‌నవూ, ఉస్మానియా యూనివర్సిటీ, బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, ముంబయి, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, ఔరంగాబాద్; యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, డాక్టర్ హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్, మైసూరు (ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్, ఫోరెన్సిక్ అకౌంటింగ్) ...తదితర సంస్థలు ఫోరెన్సిక్ కోర్సులకు పేరొందాయి.

అవకాశాలిక్కడ...

ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలు, ఆసుపత్రులు, ల్యాబొరేటరీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎంచుకున్న స్పెషలైజేషన్‌పై అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఫోరెన్సిక్ నిపుణులను డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకుంటున్నాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), పోలీస్ శాఖల్లో ఫోరెన్సిక్ ఉద్యోగాలు ఉంటాయి. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్, మాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ తదితర విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

నిట్, జలంధర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), జలంధర్ (పంజాబ్).. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: టెక్నికల్ అసిస్టెంట్-23, ఎస్ఏఎస్ అసిస్టెంట్-01, జూనియర్ ఇంజినీర్-03, టెక్నీషియన్-26, సీనియర్ టెక్నీషియన్-08, జూనియర్ అసిస్టెంట్-13, సీనియర్ అసిస్టెంట్-06, స్టెనోగ్రాఫర్-02, సీనియర్ స్టెనోగ్రాఫర్-02, ఆఫీస్ అటెండెంట్-09.
అర్హత: ఇంటర్మీడియట్, బీఈ/ బీటెక్, టైపింగ్ పరిజ్ఞానం.
ఎంపిక: రాతపరీక్ష, ట్రేడ్/ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు: సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 2 వరకు.
హార్డు కాపీలను పంపడానికి చివరితేది: అక్టోబరు 9
వెబ్‌సైట్: www.nitj.ac.in

సబ్ డివిజనల్ ఆఫీసర్లు

భారత రక్షణ మంత్రిత్వ శాఖ... సదరన్ కమాండ్ పరిధిలోని డిఫెన్స్ ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ కార్యాలయాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** సబ్ డివిజనల్ ఆఫీసర్ **ఖాళీలు:** 13 **అర్హత:** పదోతరగతి, సర్వేయింగ్/ డ్రాఫ్ట్స్‌మన్‌షిప్‌లో డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత. **వయసు:** 27 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** అక్టోబరు 20
వెబ్‌సైట్: http://punecantonmentboard.org/

ప్రవేశాలు

మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్).. 2020 ఏడాదికిగానూ పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్) **కాలవ్యవధి:** రెండేళ్లు **అర్హత:** సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** క్యాట్-2019 స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** డిసెంబరు 31 **వెబ్‌సైట్:** www.manage.gov.in

ఫెలోషిప్స్

డీఆర్‌డీఓ-ఎస్ఏఎస్ఈ

చండీగఢ్‌లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కి చెందిన స్పేస్ అండ్ అవలాంచ్ స్టడీ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎస్ఏఎస్ఈ)... తాత్కాలిక ప్రాతిపదికన ఫెలోషిప్ ఖాళీల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది.
పోస్టులు-ఖాళీలు: రిసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)-01, జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-05. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈ/ ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. **వయసు:** ఆర్ఏకు 35 ఏళ్లు, జేఆర్ఎఫ్‌నకు 28 ఏళ్లు మించకూడదు. **వాక్‌ఇన్ తేది:** సెప్టెంబరు 16 **వేదిక:** ఎస్ఏఎస్ఈ-ఆర్‌డీసీ, హిమ్‌పరిసర్, ప్లాట్ నెం.1, సెక్టార్ 37 ఎ, చండీగఢ్. **వెబ్‌సైట్:** www.drdo.gov.in

స్కాలర్‌షిప్స్

ఎస్సీ, ఎస్టీలకు ఓఎన్‌జీసీ ఉపకారవేతనాలు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ)... ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది.
మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 1000
విభాగాలవారీ ఖాళీలు: ఇంజినీరింగ్-494, ఎంబీబీఎస్-90, ఎంబీఏ-146, మాస్టర్ డిగ్రీ (జియాలజీ/ జియోఫిజిక్స్)-270. **ఆర్థిక ప్రోత్సాహం:** నెలకు రూ.4000 **అర్హత:** ఇంజినీరింగ్/ ఎంబీబీఎస్, ఎంబీఏ, మాస్టర్ డిగ్రీ (జియాలజీ/ జియోఫిజిక్స్) కోర్సుల్లో ప్రస్తుతం ప్రథమ సంవత్సరంలో చేరి ఉండాలి. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** అక్టోబరు 15 **ఎంపిక జాబితా వెల్లడి:** డిసెంబరు 10 **వెబ్‌సైట్:** www.ongcindia.com

Q&A

మూడు కోర్సుల్లో ఏది మేలు?

ఎమ్మెస్సీలో ఫుడ్ టెక్నాలజీ / డేటా సైన్స్/ బయో ఇన్ఫర్మేటిక్స్.. ఈ మూడింట్లో ఏది మెరుగో తెలుపగలరు. బయో టెక్నాలజీకి అవకాశాలు ఎలా ఉంటాయి?

- రమాదేవి, హైదరాబాద్

ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ, డేటా సైన్స్, బయో ఇన్ఫర్మేటిక్స్ మూడూ కెరియర్ పరంగా ఎదుగుదల ఉండే కోర్సులే. ఒక విధంగా డేటా సైన్స్, బయో ఇన్ఫర్మేటిక్స్‌లకు తక్కువ వ్యత్యాసం ఉంది. బైపీసీ నేపథ్యం ఉన్నవారికి ఐటీపై ఆసక్తి ఉంటే బయో ఇన్ఫర్మేటిక్స్ చేస్తే మంచిది.

బయోటెక్నాలజీ చేసినవారికి డ్రగ్, ఫార్మా లేబొరేటరీస్, ఫుడ్ ప్రాసెసింగ్, వేస్ట్ మేనేజ్ మెంట్, ఎనర్జీ సంస్థల్లో, డాక్టర్ రెడ్డీస్ లాంటి సంస్థల్లో అవకాశాలుంటాయి. మార్కెటింగ్‌లోనూ ఉపాధి దొరుకుతోంది.

e-mail: edc@eenadu.in

చాయిస్ వద్దు.. రివిజన్ మరవొద్దు!

'విభిన్నమైన కోర్సులో చేరి, ప్రత్యేకత చూపాలనుకున్నపుడు ముందుగా పలకరించేది కష్టమే. దాన్ని అధిగమిస్తే జయం మనదే' అంటున్నాడు చల్లా సత్యసాయి సుజిత్ రెడ్డి. హైదరాబాద్‌కు చెందిన ఈ విద్యార్థి సీఏ ఫైనల్ పరీక్షలో జాతీయస్థాయిలో పదో ర్యాంకు సాధించాడు. తొలి ప్రయత్నంలోనే ఈ ర్యాంకు చేజిక్కించుకోవడం విశేషం. తన విజయ రహస్యాలు అతడి మాటల్లోనే తెలుసుకుందాం!

సక్సెస్ మంత్ర

నేను చార్టర్డ్ అకౌంటెన్సీలో చేరటానికి ప్రేరణ .. మా నాన్న సురేంద్రరెడ్డి. వృత్తిరీత్యా ఆయన హైదరాబాద్‌లో సీఏగా స్థిరపడ్డారు. ఈ కోర్సు చేసిన వారికి మంచి ఉద్యోగావకాశాలుంటాయనీ, సమాజంలో మంచి హోదా, గుర్తింపూ ఉంటాయనీ మా నాన్నను చూశాకే అర్థమయింది. 'ఏ కోర్సూ కష్టం కాదు, తేలిక కాదు. కష్టపడితే గుర్తింపు వస్తుంది. చదువే నీ ఆస్తి' అని చెపుతూ నాలో స్ఫూర్తిని పెంచారాయన. పదోతరగతిని పి.ఓబుల రెడ్డి పబ్లిక్ స్కూల్లో చదివి, 9.8 గ్రేడ్ పాయింట్లు తెచ్చుకున్నాను.

సీఏ కోర్సుపై నాకున్న ఆసక్తిని చూసి, నాన్న నన్ను ఇంటర్ ఎంఈసీలో చేర్పించారు. ఇంటర్లో 956 మార్కులు వచ్చాయి. తర్వాత సీఏ కోర్సులో చేరాను. మొదటి రోజు నుంచే లక్ష్యం దిశగా అడుగులు వేశాను. అందరూ కష్టం అనుకున్న సీఏ కోర్సును ఇష్టంతో చదివాను. 'ఏ కోర్సయినా మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేయాలి; రెండో అవకాశం తీసుకోకూడదు' అనే ఉద్దేశం నాది. ప్రణాళికాబద్ధంగా చదివి, సీఏ కోర్సులోని అన్ని దశలూ మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేశాను. టెన్త్ తర్వాత ఆరు సంవత్సరాల్లో సీఏ పూర్తి చేయాలనుకున్నా. అలాగే పూర్తి చేయగలిగాను.

ఆత్మవిశ్వాసం పెరిగింది

మొదటి దశ అయిన సీఏ-సీపీటీలో 200కు 147 మార్కులు వచ్చాయి. దీంతో నామీద నాకు నమ్మకం బలపడింది. ఆ విశ్వాసంతో ఈ కోర్సులో కీలకదశ అయిన సీఏ-ఐపీసీసీని మొదటి ప్రయత్నంలోనే పూర్తిచేశా.. దీనిలో నాకు వచ్చిన మార్కులు..436/700. ఇక తుది దశ...సీఏ ఫైనల్‌ను తొలి ప్రయత్నంలోనే పూర్తిచేయడమే కాకుండా అఖిలభారత స్థాయిలో పదో ర్యాంకు సాధించా. ఈ విజయానికి మాస్టర్ మైండ్స్ సంస్థ అందించిన మెటీరియల్, స్టడీ అవర్స్, రివిజన్ ఎగ్జామ్స్ కీలకభూమిక పోషించాయి. అమ్మానాన్నల ప్రోత్సాహమూ ఉంది. చదివిన అంశాల పునశ్చరణకు ఎక్కువ సమయం కేటాయించా.

అన్నిటికీ సమాన ప్రాధాన్యం

సీఏ లాంటి ప్రొఫెషనల్ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఎంతో ఓపిక, కఠోర శ్రమ, సమయపాలన అవసరం. అన్ని పేపర్లకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి సబ్జెక్టులో అన్ని చాప్టర్లలోని అన్ని ప్రశ్నలూ క్షుణ్ణంగా చదవాలి.

సీఏ ఫైనల్ ఆలిండియా పదో ర్యాంకర్ సుజిత్‌రెడ్డి

ప్రాబ్లమ్స్ సాధన చేస్తున్నపుడే అనవసరం అనుకున్న లెక్కలను తీసేస్తూ వెళ్లటం వల్ల రివిజన్ సులువు అవుతుంది. సీఏ అభ్యర్థులకు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు చాలా అవసరం. అందుకని కోర్సు సమయంలోనే సెమినార్లు, వక్తృత్వ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలి.

కొన్నిటిని మాత్రమే చాయిస్‌గా తీసుకోకూడదు. విద్యాసంస్థ వారు ఇచ్చే మెటీరియల్‌తో పాటు ఐసీఏఐ వారి మెటీరియల్ పఠనం కూడా తప్పనిసరి. దాంతోపాటు రివిజన్ టెస్ట్ పేపర్లు, మాక్ టెస్ట్ పేపర్లు సాధన చేయాలి. సీఏ ఇన్‌స్టిట్యూట్ సప్లిమెంటరీ మెటీరియల్‌ను అధ్యయనం చేస్తే పరీక్షలు బాగా రాయవచ్చు.

ప్రశ్నల కఠినత్వ స్థాయి ఎక్కువ కాబట్టి చదివి అర్థం చేసుకున్న అంశాలను కనీసం మూడుసార్లు రివిజన్ చేసుకోవాలి. టాక్స్‌కు సంబంధించిన పేపర్లు చదివేటప్పుడు చట్టంలో వచ్చిన సవరణల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలి. సవరణలనూ, చట్టంలో వస్తున్న మార్పులనూ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూవుండాలి. సొంతంగా ఫాస్ట్ ట్రాక్ నోట్సు తయారు చేసుకుంటే మంచిది. ఇవన్నీ పాటిస్తే సీఏ కోర్సును విజయవంతంగా పూర్తిచేయటం సులభమే!

దేశమొక్కటే.. జెండా ఒక్కటే

శ్రీనగర్‌లోని జమ్మూ-కశ్మీర్ పౌర సచివాలయ భవనంపై సగర్వంగా రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాక మిది. ఇన్నాళ్లూ ఇక్కడ ముప్పన్నెల జెండాతో పాటు జమ్మూ-కశ్మీర్ సొంత పతాకాన్నీ ఎగరేసేవారు. అధికరణం-370 రద్దు నేపథ్యంలో తొలిసారిగా ఆదివారం సచివాలయ భవనంపై త్రివర్ణ పతాకాన్ని మాత్రమే ఎగరేశారు.

విడుదల చేస్తాం.. శాంతికి సహకరించండి

- ఒమర్, ముఫ్తీలను కోరిన కేంద్ర హోంశాఖ?
- వాస్తవం లేదన్న ఎన్‌సీ వర్గాలు

శ్రీనగర్, దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌లో శాంతి భద్రతల పునరుద్ధరణకు సహకరించాలని కోరుతూ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కోరినట్లు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. ఆ ఇద్దరు నేతలను గృహనిర్బంధం నుంచి విడుదల చేస్తామని, అయితే శాంతిని నెలకొల్పేందుకు తమకు సహకరించాలని కోరినట్లు నిఘా వర్గాలకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. ఈ సమాచారం పూర్తిగా నిరాధారమని నేషనల్ కాన్ఫరెన్స్ వర్గాలు కొట్టి వేశాయి. ప్రభుత్వ అధికారులు తమను కలసి శాంతిని కాపాడేందుకు సహకరించాలని అభ్యర్థించినట్లు పీడీపీ నాయకులు ధ్రువీకరించారు. ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు ఆగస్టు 5వ తేదీ నుంచి గృహ నిర్బంధంలోనే ఉన్నారు. నిర్బంధంలో ఉన్న కొందరు ఇతర నాయకులకు వారి కుటుంబ సభ్యులను కలిసేందుకు అధికారులు శనివారం అనుమతి ఇచ్చారు.

నిరంకుశ పాలన రుచి చూపారు: రాహుల్

దిల్లీ: "కశ్మీర్‌లో కొద్ది రోజులుగా నిరంకుశ పాలన సాగుతోంది. ప్రజల హక్కులను కాలరాస్తున్నారు. లోయలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి" అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. తమకూ ఈ విషయం అనుభవమైందన్నారు. శ్రీనగర్‌లో పర్యటించేందుకు వెళ్లిన విపక్ష నాయకులకు కూడా ఈ అసాధారణ పరిస్థితులను రుచి చూపించారని ఆయన ఆదివారం ట్వీట్ చేశారు.

ప్లాస్టిక్‌పై పోరాటం!

- కేంద్రం కసరత్తు
- ప్రత్యేక బృందం ఏర్పాటు

దేశంలో అనేక రూపాల్లో వినియోగిస్తున్న 'ప్లాస్టిక్' కొండంత సమస్యగా తయారైంది. నానాటికీ తీవ్రతరమవుతున్న ఈ సమస్యను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. 'ప్లాస్టిక్‌పై పోరు'కు వచ్చే నెల 17న ఒక జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందుకు సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు రైల్వే, గ్రామీణాభివృద్ధి, జల్‌శక్తి, వాణిజ్య, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖలతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది.

టన్నుల్లో సమస్య

15,000 టన్నులు

భారత్‌లో సగటున రోజుకు పోగవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

9,000 టన్నులు

రీసైకిల్ చేస్తున్న వ్యర్థాలు

6,000 టన్నులు

ఒకసారి వాడిపారేసే ఉత్పత్తులు. వ్యర్థాలను పారవేసే గోతుల్లోకి ఇవి చేరుతున్నాయి. మురుగు కాలవలు, నదుల ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి.

వ్యర్థాల నియంత్రణ

ప్లాస్టిక్ వ్యర్థాల్లో ఎక్కువశాతం పట్టణ ప్రాంతాల్లో నుంచే పోగవుతున్నాయి. గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖతో సమన్వయం చేసుకుంటూ 'ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2016'ను కేంద్ర పర్యావరణ శాఖ అమలు చేస్తోంది. ప్లాస్టిక్ సంచులు, ప్యాకింగ్ కోసం వాడే షీట్ల తయారీ, విక్రయం, పంపిణీ, వినియోగాన్ని నియంత్రించడం దీని ఉద్దేశం.

ఉద్యమ కార్యక్రమం

- ఒకసారి వాడిపారేసే స్టైరోఫోమ్ కప్‌లు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, స్పూన్లు, సంచులు, స్ట్రాల వంటివాటి నిర్మూలనకు పర్యావరణ శాఖ ప్రణాళికను ప్రారంభిస్తుంది. వీటిని వాడొద్దని ముందు వినియోగదారులను కోరుతారు. ఒక ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేశాక వినియోగానికి స్వస్తి పలకడాన్ని తప్పనిసరి చేస్తారు.
- ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ వస్తువుల నుంచి గ్రామాలకు విముక్తి కల్పించేలా తొలుత గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపడుతుంది.
- 31 లక్షల మంది గ్రామ పంచాయతీ సభ్యులు, స్వయం సహాయక బృందాలకు చెందిన 6 కోట్ల మంది గ్రామీణ మహిళల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రయోజనకర పనులకు ఉపయోగిస్తారు.

ప్లాస్టిక్ రోడ్లు

ప్లాస్టిక్ వ్యర్థాలతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నది యోచన. మొత్తంగా గ్రామాల్లోని 25 శాతం రోడ్లు వీటితో నిర్మించాలన్నది లక్ష్యం. దీనివల్ల తారు వినియోగం తగ్గిపోతుంది. ఇంతవరకు దేశంలో 9 వేల కిలోమీటర్ల మేర ఇలాంటి రోడ్లను నిర్మించారు.

వేగం పెంచారు..

రైల్వేశాఖ: ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ పదార్థాలను ఈ ఏడాది అక్టోబర్ 2 నుంచి తమ ప్రాంగణాల్లో నిషేధించాలని నిర్ణయించింది. తొలిదశలో 360 ప్రధాన రైల్వే స్టేషన్లలో వాటర్ బాటిల్ క్రషింగ్ యంత్రాలను ఏర్పాటు చేయనుంది. క్రమేపీ అన్ని స్టేషన్లలోనూ వీటిని ఏర్పాటు చేస్తుంది. రైల్వే స్టేషన్లలోని వ్యాపారులంతా ప్లాస్టిక్ సంచులు ఉపయోగించకుండా చూడాలని జోనల్ కార్యాలయాలను ఆదేశించింది.

వాణిజ్యశాఖ: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ కంపెనీలకు కేంద్ర వాణిజ్యశాఖ సూచించింది. ఈ దిశగా ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే చర్యలను ప్రారంభించింది.

- ఈనాడు, దిల్లీ

పొరుగు దేశం అసూయ!

మోదీకి పురస్కారాన్నిచ్చినందుకు యూఏఈ పర్యటన రద్దు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సెనేట్ ఛైర్మన్ సాదిక్ సంజ్రానీ తన యూఏఈ పర్యటనను ఆదివారం రద్దు చేసుకున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీకి యూఏఈ శనివారం అత్యున్నత పురస్కారాన్నిచ్చి సత్కరించినందుకే సాదిక్ తన అధికారిక పర్యటన రద్దుచేసుకున్నట్లు జియో టీవీ తెలిపింది. యూఏఈ ప్రభుత్వ ఆహ్వానం మేరకు సాదిక్ అక్కడ 28వ తేదీ వరకూ జరిగే పార్లమెంటేరియన్లు, ప్రభుత్వాధికారుల సదస్సుకు హాజరుకావలసి ఉంది.

ఉత్తర కొరియా బహుళ రాకెట్ లాంచర్ పరీక్ష

సియోల్: కొత్తగా అభివృద్ధి చేసిన 'అత్యంత భారీ బహుళ రాకెట్ లాంచర్'ను పరీక్షించినట్లు ఉత్తరకొరియా ఆదివారం వెల్లడించింది. ఈ పరీక్షను తమ నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ పర్యవేక్షించారని తెలిపింది. అమెరికాతో త్వరలో జరగబోయే అణు చర్చలకు ముందు తన పలుకుబడిని పెంచుకునే ఉద్దేశంతో ఆయుధగారాన్ని ఇలా పెంచుకుంటూ పోతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

దాద్రా ఐపీఎస్ అధికారి రాజీనామా

కశ్మీర్‌లో హక్కులకు భంగం కలుగుతున్నందుకేనని వెల్లడి

తిరువనంతపురం: దాద్రా నగర్ హవేలీలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి కన్నన్ గోపీనాథన్(33) తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. కశ్మీర్‌లో 370వ అధికరణం రద్దు చేసిన తరవాత అక్కడి ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా లేకుండా పోయాయని, అందుకే తాను రాజీనామా చేస్తున్నానని తెలిపారు. "నా రాజీనామా వల్ల ఏదో జరుగుతుందని నేను అనుకోవడం లేదు. అయితే అంతరాత్మకు సమాధానం చెప్పుకోవాలి. 370 అధికరణం రద్దును వ్యతిరేకించవచ్చు.. లేదా తిరస్కరించవచ్చు. ఇది సమస్యే కాదు. ప్రజల హక్కులను తిరస్కరించడమే ప్రధాన అంశం" అని ఆయన అభిప్రాయపడ్డారు. దాద్రా నగర్ హవేలీలో కార్యదర్శిగా ఉంటూ ఆయన పలు కీలక శాఖలను నిర్వహించారు. అక్కడ నష్టాల్లో మునిగిపోయిన విద్యుత్తు పంపిణీ సంస్థను లాభాల బాట పట్టించారు. మిజోరంలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు అక్కడి పిల్లలకు బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇప్పించేందుకు ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్‌ను ప్రోత్సహించి క్షేత్ర స్థాయిలో 30శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సహకరించారు.

బస్సు లోయలో పడి ఏడుగురి మృతి

జమ్మూ: జమ్మూ-కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలోని ధనామండీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు మరణించారు. 25 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. పూంఛ్ నుంచి ప్రఖ్యాత షర్దా షరీఫ్‌కు వీరంతా వాహనంలో వెళుతుండగా మధ్యలో 800 మీటర్ల లోతున ఉన్న లోయలో పడింది. మరోవైపు, దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా ఖ్రాదిపొరాలో అల్లరిమూక రాళ్లు రువ్విన ఘటనలో ట్రక్కు డ్రైవర్ మహ్మద్ ఖలీల్‌ధార్ మరణించాడు.

ఇంకా నయం.. ఇమ్రాన్ నాకు పాఠాలు చెప్పలేదు!

ఆనంద్ మహీంద్రా ట్వీట్

ముంబయి: జపాన్-జర్మనీలు రెండూ సరిహద్దు దేశాలు అంటూ పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఆదివారం ప్రస్తావించారు. 'భగవంతుడా! ఈయన(ఇమ్రాన్‌ఖాన్) నాకు భౌగోళిక శాస్త్ర టీచర్‌గా పాఠాలు చెప్పలేదు... ఇంకా నయం'అంటూ సరదాగా ట్వీట్ చేశారు.

వాణిజ్య యుద్ధాన్ని ఆపండి

- జీ7 సదస్సులో

అమెరికాకు మిత్రదేశాల హితవు

బీయరజ్ (ఫ్రాన్స్): ప్రపంచం అంతటా ఆర్థిక మాంద్యం నెలకొంటుందన్న ఆందోళనల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం ఆపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మిత్ర దేశాలు హితవు పలికాయి. ఆదివారం ఫ్రాన్స్‌లోని తీరప్రాంత విహార కేంద్రమైన బీయరజ్‌లో జరిగిన జీ7 (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్) దేశాల సదస్సులో ఈ విషయం చర్చకు వచ్చింది. చైనాతో నెలకొన్న వాణిజ్య యుద్ధంపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు తొలుత ట్రంప్ తెలిపారు. అనంతరం మాట మార్చారు. విలేకరులతో మాట్లాడుతూ చైనాపై మరిన్ని పన్నులు వేయడం లేదన్నదే తన విచారమన్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ జావేద్ జరీఫ్ ఆదివారం అనూహ్యంగా జీ7 సదస్సు జరుగుతున్న బీయరజ్ చేరుకున్నారు.

బీయరజ్‌లో బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌తో ప్రధాని మోదీ కరచాలనం

బోరిస్ జాన్సన్‌తో మోదీ భేటీ

జీ7 సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుట్రెస్‌తోనూ సమావేశమయ్యారు.

ఉగ్రవాదం ప్రభుత్వ విధానం కారాదు

- పాక్‌కు భారత్-బహ్రెయిన్ చురక

మనామా: ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే పాకిస్థాన్‌కు అధికారిక విధానంగా మారిందన్న భారత్ వాదనకు మరోసారి మద్దతు లభించింది. బహ్రెయిన్ ఈ అభిప్రాయంతో ఏకీభవించింది. ఆ దేశ రాజు హమద్ బిన్ సల్మాన్ అల్ ఖలీఫా, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండానే ఈ విషయాన్ని స్పష్టం చేశారు. రెండు రోజులపాటు ఆ దేశంలో పర్యటించిన మోదీ, రాజు హమద్‌తో వివిధ అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇతర దేశాలపై ఉగ్రవాదాన్ని ప్రయోగిస్తున్న కొన్ని దేశాల చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయాలని, ఉగ్రవాదులకు ఆర్థిక సహాయాన్ని నిలిపివేయాలని, వారిని చట్టం ముందు నిలబెట్టాలని కోరారు. సైబర్ నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలను అదుపు చేయడంలో ఇరు దేశాలు సహకరించుకోవాలని నిర్ణయించారు. చైనా ప్రతిపాదించిన వన్ బెల్ట్- వన్ రోడ్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఇలాంటి విషయాల్లో అంతర్జాతీయ చట్టాలు, ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని తప్పనిసరిగా గౌరవించాలని సూచించారు. రెండు దేశాల మధ్య సంబంధాల మెరుగుదలకు కృషి చేసినందుకు ప్రధాని మోదీకి, రాజు హమద్ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ ద రినైజాన్స్'ను ప్రదానం చేశారు. భారత దేశ పర్యటనకు రావాలని రాజును మోదీ ఆహ్వానించారు. ప్రవాస భారతీయులతో జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగిస్తూ బహుళత్వమే భారతదేశ బలమని చెప్పారు. ఈ సమావేశానికి మోదీ వచ్చినప్పుడు సభికులంతా సెల్‌ఫోన్ లైట్లు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ మనామాలోని 200 ఏళ్ల నాటి శ్రీకృష్ణ మందిరాన్ని కూడా సందర్శించారు. రూ.29.40 కోట్లతో చేపట్టిన మందిరం అభివృద్ధి పనులను ప్రారంభించారు. వివాహ పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఆలయ ప్రాంగణంలో వివాహ వేదికలు కూడా నిర్మించనున్నారు.

అరుణ్ జైట్లీకి కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు

దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి అరుణ్‌జైట్లీ అంత్యక్రియలు వేల మంది అభిమానుల అశ్రునయనాల మధ్య దిల్లీలోని యమునా నది తీరంలో ఉన్న నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆదివారం పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. భాజపా కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, అభిమానులు తరలివచ్చి తమ ప్రియతమ నేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. జైట్లీ కుమారుడు రోహన్ తండ్రి చితికి నిప్పంటించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జైట్లీ ఇక్కడి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించిన సంగతి తెలిసిందే. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, భాజపా సీనియర్ నేత అడ్వాణీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకుర్, కాంగ్రెస్ నేతలు జ్యోతిరాదిత్య సింధియా, కపిల్ సిబల్ తదితరులు నిగమ్‌బోధ్ ఘాట్‌కు వచ్చి జైట్లీకి నివాళులు అర్పించారు. దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, బిహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, దేవేంద్ర ఫడణవీస్, విజయ్ రూపాణి, బీఎస్ యడియూరప్ప, నీతీశ్‌కుమార్, త్రివేంద్రసింగ్ రావత్‌లు అంత్యక్రియలకు హాజరయ్యారు.

అరుణ్ జైట్లీ అంత్యక్రియలకు హాజరైన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్,అమిత్ షా, రాందాస్ అథవాలే, యోగా గురువు రామ్‌దేవ్ బాబా. చిత్రంలో దిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులు ★భాజపా ప్రధాన కార్యాలయం నుంచి నిగమ్ బోధ్ ఘాట్‌కు బయలుదేరిన అంతిమయాత్ర

అంతకుముందు ఉదయం 11 గంటలకు పార్టీ శ్రేణుల చివరి చూపు కోసం అరుణ్‌జైట్లీ పార్థివదేహాన్ని భాజపా కేంద్ర కార్యాలయంలో ఉంచారు. అక్కడి నుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర సాగింది. దారిపొడవునా అభిమానులు అరుణ్‌జైట్లీ 'అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. భాజపాలో జైట్లీతో కలిసి పనిచేసిన వెంకయ్యనాయుడు అప్పటి సంగతులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగంతో పార్థివదేహానికి నమస్కరిస్తూ కొద్ది నిమిషాలు నిశ్చల స్థితిలో ఉండిపోయారు. అంత్యక్రియల సమయంలో భారీ వర్షం కురిసినప్పటికీ.. అక్కడకు వచ్చిన జైట్లీ అభిమానులు ఏమాత్రం చలించలేదు.

ఆయన ముద్ర చెరగనిది: రాహుల్

పార్లమెంటు వ్యవహారాల్లో అరుణ్‌జైట్లీ గొంతు వినిపించకపోవచ్చు, ఆయన వేసిన ముద్ర మాత్రం ఎప్పటికీ చెరిగిపోదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన జైట్లీ కుటుంబసభ్యులకు సంతాప సందేశం పంపారు.

ఖరీదైన బ్రాండ్లంటే మక్కువ

రాజకీయాల్లోకి రావడానికి ముందు నుంచే ఖరీదైన బ్రాండ్ల వస్తువులంటే అరుణ్ జైట్లీకి మక్కువ. లండన్‌కు చెందిన బిస్పోక్ చొక్కా, జాన్ లాబ్‌కు చెందిన చేతితో తయారు చేసిన బూట్లు, పాటిక్ ఫిలిప్ చేతి గడియారాలు, మోంట్ బ్లాంక్ పెన్నులు వంటివి ఆయన వాడేవారు.

అమ్మను కోల్పోయినా.. ఆప్తుడిని కాపాడాడు

కర్ణాటక: భారీ వర్షాల హోరు.. కొండ చరియలు విరిగి పడుతున్నాయి.. కళ్ల ముందే కన్నతల్లి, చెల్లి శిథిలాల కింద సజీవ సమాధి అయ్యారు. రోదిస్తున్న ఆ యువకుడికి ఓ దృశ్యం కనిపించింది. స్నేహితుడొకరు బురదలో కూరుకుపోయి మృత్యువుతో పోరాడుతున్నాడు. క్షణమైనా ఆలోచించని ఆ యువకుడు ప్రాణాలకు తెగించి తన మిత్రుడిని కాపాడాడు. ఇలా కొడగు జిల్లా థోరా గ్రామ వాసి నవీన్ తెగువ చూపాడు. కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ తన స్నేహితుడు సతీశ్‌ను కాపాడి మానవత్వాన్ని చాటాడు. గాయపడిన సతీశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈ టీవీ భారత్

యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

పాముకు అరుదైన శస్త్రచికిత్స

బిహార్: చనిపోయే స్థితిలో ఉన్న ఓ సర్పానికి పట్నాలోని వెటర్నరీ ఆసుపత్రి వైద్యులు అరుదైన వైద్యం అందించారు. 2 గంటల పాటు శస్త్రచికిత్స చేసి బతికించారు. రెండు రోజుల పాటు పర్యవేక్షణలో కూడా ఉంచి.. అనంతరం అడవిలో వదిలేశారు. తోకభాగం తీవ్రంగా దెబ్బతిని కదల్లేని స్థితిలో ఉన్న పామును ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు వెటర్నరీ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఎక్స్‌రే తీసిన వైద్యులు పాముకు మత్తుమందు ఇచ్చి శస్త్రచికిత్స చేశారు. తోకలో కొంత భాగాన్ని తొలగించి, ఆ తర్వాత ఆ మేరకు తిరిగి అతికించారు.

మత సామరస్యం చూపారు..

జమ్మూ-కశ్మీర్: ఆ పల్లెలో మత సామరస్యం వెల్లివిరిసింది.. అతి తక్కువ హిందూ జనాభా ఉండే పుల్వామా జిల్లాలోని గ్రామం అది. హిందువొకరు చనిపోతే అతని అంత్యక్రియలను సంప్రదాయబద్ధంగా కొందరు ముస్లింలు నిర్వహించారు. ముర్రాన్‌లో రతన్‌లాల్ కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. అతని అంత్యక్రియలకు కట్టెలు ఇతర సామగ్రిని స్థానిక ముస్లింలే సమకూర్చారు. పాడె మోశారు. హాజరైనవారికి భోజనాలు ఏర్పాటు చేశారు. "లాల్ మాలో ఒకడు. మా తోటి కుటుంబానికి సాయం చేయడం మా విధి." అని ముర్రాన్ వాసి పర్వేజ్ అహ్మద్ తెలిపారు.

పంట బీమా ఇక ఐచ్ఛికమే

- మార్పులు ప్రతిపాదించిన కేంద్రం

ఈనాడు, దిల్లీ: పంట బీమా పథకమైన పీఎం ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇంతవరకు బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకొనే రైతులు తప్పనిసరిగా ఈ పథకంలో చేరాల్సి ఉంది. తీసుకోని వారు స్వచ్ఛందంగా చేరితే చేరవచ్చు. ఇకపై పంట రుణాలు తీసుకునే రైతులు కూడా ఇష్టం ఉంటేనే బీమా తీసుకోవచ్చు. ప్రీమియంను సక్రమంగా వసూలు చేస్తున్నా, నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్న రైతుల ఫిర్యాదులకూ కూడా కేంద్రం పరిష్కారం చూపనుంది. ప్రస్తుతం తొలిదశలో వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని అధ్యయనం చేసిన అనంతరమే పరిహారం చెల్లించాలా వద్దా అని నిర్ణయిస్తోంది. రెండో దశలో పంట కోత ప్రయోగాల్లో (ఎక్కడో ఒక చోట కొంత పంటను కోసి దిగుబడిని మొత్తం మీద అంచనా వేసే పద్ధతి) వచ్చిన ఫలితాల ఆధారంగా పరిహారాన్ని లెక్కిస్తోంది. పంట కోతల ప్రయోగాలను మచ్చుకు కొన్ని గ్రామాల్లో చేపట్టి, అక్కడ వచ్చిన ఫలితాలను అన్ని గ్రామాలకు వర్తింపజేస్తోంది. దీనివల్ల బాగా నష్టపోయిన గ్రామాల్లో కొన్ని సార్లు పంట బాగుందన్న నివేదికలు వస్తున్నాయి. వీటిపై విమర్శలు రావడంతో ఈ నిబంధనలను ఎత్తివేయనుంది. రిమోట్ సెన్సింగ్, మానవ రహిత విమానాలు, కృత్రిమ మేధస్సు పరికరాల సాయంతో పంచాయతీ స్థాయిలో పంట దిగుబడులను అంచనా వేసి, దానికి అనుగుణంగా పరిహారాన్ని నిర్ణయించాలని భావిస్తోంది. ప్రీమియం, పరిహారాలను నిర్ధరించడంలో ప్రభుత్వ ప్రమేయం అధికంగా ఉండేలా చూడడం కోసం రిస్క్ పూలింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం బీమా కంపెనీలు కేవలం పరిపాలన వ్యవహారాలకే పరిమితమవుతాయి. వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటుంది.

మాంసం కాని మాంసం!

- ప్రయోగశాలలో ఉత్పత్తి
- ఐఐటీ గువాహటి పరిశోధకుల ఘనత

దిల్లీ: మాంసాహారం భుజించాలంటే.. జంతువులను వధించి వాటి మాంసాన్నే వినియోగించాలా? ఆ అవసరమే లేదంటున్నారు గువాహటిలోని ఐఐటీ పరిశోధకులు. ఒక వినూత్న విధానాన్ని తెరపైకి తెస్తూ.. ప్రయోగశాలలోనే మాంసాన్ని అభివృద్ధి చేశారు. ఇది రుచిగా ఉండటంతోపాటు అధిక పోషక విలువలను కూడా కలిగి ఉంటుంది. జంతువధ అవసరమే లేని ఆహారం దిశగా ఇదో ముందడుగని పరిశోధకులు చెబుతున్నారు. దీనివల్ల పర్యావరణంతో పాటు జంతువుల పరిరక్షణకు వీలు కలుగుతుందని పరిశోధనలో పాలుపంచుకున్న బిమాన్ వివరించారు.

ఏమిటీ విధానం?

తొలుత జంతువుల నుంచి చిన్నపాటి బయాప్సీల ద్వారా కండర ప్రొజెనిటర్ కణాలను సేకరిస్తారు. వీటిని తినడానికి యోగ్యమైన ఒక పదార్థ బేస్‌పై ఉంచి మాంసాన్ని వృద్ధి చేస్తారు. మాంసం ఉత్పత్తిలో పోషక విలువలను పెంచడానికి రోజువారీ ఆహార యోగ్యమైన పదార్థాలనే వినియోగిస్తారు. కండరాల మూలకణాలతో కలిపి కొవ్వు, కార్టిలేజ్ లేదా ఎముక కణాలను పొరలుపొరలుగా వృద్ధిచేసే విధానంపైనా పరిశోధనలు సాగుతున్నాయి.

37368 వద్ద నిరోధం!

సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్లకు అమ్మకాలు వెల్లువెత్తడం, బలహీన దేశీయ సెంటిమెంట్‌తో గత వారం సూచీలు నష్టాలతో ముగిశాయి. విదేశీ మదుపర్లు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 నెలల కనిష్ఠానికి చేరింది. యువాన్ కరెన్సీ బలహీనపడటం ప్రభావం చూపింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు పలు నిబంధనలను సెబీ సడలించినప్పటికీ మార్కెట్లను మెప్పించలేదు. ఎఫ్‌పీఐలపై పన్ను సర్‌ఛార్జీ తొలగింపుపై మదుపర్లు ఎదురుచూసే ధోరణి పాటించారు. ఆర్థిక వ్యవస్థ మందగమనంపై ఆందోళనలు, అంతర్జాతీయ వాణిజ్య భయాలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. కార్పొరేట్ వార్తల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకున్నాయి. చిన్న, మధ్య శ్రేణి షేర్లకు అమ్మకాలు కొనసాగాయి. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. అమెరికా ఫెడ్ ఛైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల కోతపై స్పష్టమైన సంకేతాలు ఇవ్వలేదు. చమురు ధరలు దిద్దుబాటుకు లోనయ్యాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1.7 శాతం నష్టంతో 36,701 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 2 శాతం తగ్గి 10,829 పాయింట్ల దగ్గర స్థిరపడింది. స్థిరాస్తి, లోహ, బ్యాంకింగ్ షేర్లు డీలాపడగా, ఐటీ, మన్నికైన వినిమయ వస్తువులు, వాహన స్క్రిప్‌లు రాణించాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) నికరంగా రూ.3344 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.4304 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 5:4గా నమోదు కావడం.. ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } గత వారం 36400 పాయింట్ల వద్ద మద్దతు దక్కించుకున్న సెన్సెక్స్ నష్టాలను తగ్గించుకోగలిగింది. స్వల్పకాలంలో 36400 పాయింట్ల స్థాయి దిగువన ముగిస్తే. . మరిన్ని నష్టాలకు అవకాశం ఉంది. మరోవైపు సెన్సెక్స్ 200 రోజుల కదలికల సగటు అయిన 37,368 పాయింట్ల వద్ద బలమైన నిరోధం ఎదురుకావొచ్చు.

ప్రభావిత అంశాలు } ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి గత శుక్రవారం ప్రభుత్వం ప్రకటించిన పలు సంస్కరణలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేయనున్నాయి. ఎఫ్‌పీఐలపై పన్ను సర్‌ఛార్జీ ప్రతిపాదనను ఉపసంహరించుకోవడంతో మళ్లీ విదేశీ పెట్టుబడులు ఊపందుకోవచ్చు. వాహన, ఆర్థిక రంగాలకు ఉపశమనం కలిగించే విధంగా తీసుకున్న నిర్ణయాలు కలిసిరావొచ్చు. ప్రభుత్వ బ్యాంకులకు మూలధనం, రెపో రేట్లను అనుగుణంగా రుణ రేట్లు వంటివి సానుకూలం కానున్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు ఉంటాయని ఆర్థిక మంత్రి సంకేతాలు ఇవ్వడమూ తోడవ్వచ్చు. 29న ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో మార్కెట్లు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. మొదటి త్రైమాసిక జీడీపీ గణాంకాలు ఈ నెల 30న వెలువడనుండటంతో మదుపర్లు అప్రమత్తం కావొచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ముడిచమురు ధరలు, ఎఫ్‌ఐఐ పెట్టుబడుల ధోరణి వంటి వాటి నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపై కొనసాగొచ్చు. మాంద్యం భయాలు ఇందుకు తోడవ్వనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు మన సూచీలకు దిశానిర్దేశం చేయొచ్చు. 29న వెలువడనున్న అమెరికా రెండో త్రైమాసిక జీడీపీ గణాంకాలు కీలకం కానున్నాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 36,391, 36,102, 35,714;
తక్షణ నిరోధ స్థాయిలు: 37,060, 37,407, 37,807

స్వల్పకాలంలో సెన్సెక్స్‌కు 37,368 పాయింట్ల వద్ద బలమైన నిరోధం ఎదురుకావొచ్చు.

– *సతీశ్ కంతేటి, జెన్ మనీ*



కోడిగుడ్లు

25న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	313	వరంగల్	313
చిల్లరగా (ఒక గుడ్డు)	3.75	విశాఖపట్నం	361
బెంగళూరు	325	చెన్నై	345
26వ తేదీకి...		చిత్తూరు	338
విజయవాడ	334	నమక్కల్	340
గోదావరి	334		

లాభాల సరాగాలే..!

స్టాక్ మార్కెట్ ఈ వారం

- ఆర్థిక వృద్ధికి ప్రభుత్వ చర్యల నేపథ్యం
- ఈ వారం మరిన్ని నిర్ణయాలకు అవకాశం
- విదేశీ పెట్టుబడులు తరలి రావొచ్చు
- మార్కెట్ అంతటా సానుకూలతలే
- విశ్లేషకుల అభిప్రాయాలు

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	356.40	363.70	346.80
ఆర్‌కామ్	1.00	1.00	0.90
ఆర్ఐఎల్	1275.85	1319.60	1204.60
టాటా కమ్యూనికేషన్స్	421.45	441.90	391.70
వొడాఫోన్ ఐడియా	5.75	6.50	4.70

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	48.30	50.50	45.60
సీజీ పవర్	9.65	9.70	9.70
ఎల్ అండ్ టీ	1286.50	1309.40	1262.50
సీమెన్స్	1147.60	1175.60	1108.50
థెర్మాక్స్	1012.20	1035.00	981.20

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	60.25	63.10	55.60
బజాజ్ ఆటో	2749.15	2793.60	2691.90
ఐషర్ మోటార్స్	15383.45	15717.40	15098.20
హీరో మోటోకార్ప్	2640.20	2698.30	2583.50
ఎం అండ్ ఎం	533.25	553.30	499.20
మారుతీ సుజుకీ	6254.35	6430.90	5951.70
టాటా మోటార్స్	111.05	114.10	106.20
టీవీఎస్ మోటార్	365.55	376.70	347.00

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	2466.65	2556.80	2357.20
కోల్గేట్ పామోలివ్	1191.35	1214.90	1169.40
డాబర్ ఇండియా	424.40	432.40	418.80
గోద్రేజ్ కన్జూమర్	600.40	614.90	586.10
హిందుస్థాన్ యునిలీవర్	1860.00	1889.40	1836.00
ఐటీసీ	236.10	241.50	231.90
మారికో	380.05	397.60	368.90
టాటా గ్లోబల్ బేవరేజెస్	265.95	273.80	253.00

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	329.35	345.30	300.40
హెచ్‌పీసీఎల్	238.30	253.60	216.10
ఐఓసీఎల్	122.80	129.00	113.20
ఓఎన్‌జీసీ	122.25	128.20	112.80
ఆయిల్ ఇండియా	144.50	150.60	136.60

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల(ఎఫ్‌పీఐ)పై విధించిన అదనపు సర్‌ఛార్జీని తొలగించడం మార్కెట్లలో సానుకూలతలు నింపొచ్చని మదుపర్లు అంచనా వేస్తున్నారు. ద్రవ్యలభ్యత చర్యల వల్ల వాహన, ఆర్థిక సేవల రంగాల షేర్ల వైపు మదుపర్లు దృష్టి సారించొచ్చని చెబుతున్నారు. బడ్జెట్‌లో సర్‌ఛార్జీ ప్రతిపాదన చేసినప్పటి నుంచి, ఇటీవలి వరకు (రెండు నెలల్లో) ఎఫ్‌పీఐలు 3.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.24,500 కోట్ల) వరకు పెట్టుబడులను ఉపసంహరించారు. తిరిగి వారు మన మార్కెట్లపై ఆసక్తి కనబరచవచ్చు. వాహన, మౌలిక, స్థిరాస్తి రంగాలకు ఉపకరించే చర్యలు ప్రకటించడంతో, ఆయా రంగాల షేర్లు రాణించవచ్చని డీలర్లు అంటున్నారు. నిఫ్టీ ఈ వారం 11200 స్థాయిని పరీక్షించవచ్చని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యం, బ్రెగ్జిట్‌లకు సంకేతాలనిచ్చే జి-7 సదస్సు నిర్ణయాలు కీలకం కావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఆగస్టు 30న వెలువడే ఏప్రిల్-జూన్ జీడీపీ గణాంకాలు, వచ్చే వారంలో వెలువడే అంతర్జాతీయ ఆర్థిక గణాంకాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపొచ్చని అంటున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- రిలయన్స్ జియో తన కార్యకలాపాలను బలోపేతం చేసుకుంటున్న నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభాలు స్థిరీకరణకు గురి కావొచ్చు. మరో వైపు జియో నుంచి గట్టి పోటీ కారణంగా భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ఒత్తిడికి గురికావొచ్చు.
- బలమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో సంస్థాగత మదుపర్ల నుంచి వచ్చే గిరాకీతో **యంత్ర పరికరాల** షేర్లు లాభాల బాట పట్టొచ్చు.
- వినియోగదారు సెంటిమెంటు మెరుగుపడడానికి ప్రభుత్వం పలు చర్యలు ప్రకటించిన నేపథ్యంలో **వాహన** కంపెనీల షేర్లు రాణించే అవకాశం ఉంది.
- **ఎఫ్ఎమ్‌సీజీ** వంటి రంగాలకు ఉపకరించే చర్యలను ఆర్థిక మంత్రి ప్రకటించడం సానుకూలతలు తీసుకురావొచ్చు. ఈ వారం ప్రకటించబోయే మరిన్ని చర్యల కోసం మార్కెట్ ఎదురుచూస్తుంది.
- అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు మార్కెట్‌తో పాటే లాభాలు అందుకోవచ్చు. ఎటువంటి సంకేతాలు లేనందున అంతర్జాతీయ **ముడి చమురు** ధరలు, రూపాయి మారకపు విలువల ప్రభావం కనిపించొచ్చు.
- **బ్యాంకుల** షేర్లు లాభాల బాట పట్టొచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకులు ముందుండి నడిపించొచ్చు. వీటికి రూ.70,000 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుండడం ఇందుకు నేపథ్యం.
- ఆర్థిక వ్యవస్థలో గిరాకీ పెరగడానికి తీసుకున్న చర్యలు **సిమెంటు** షేర్లకు సానుకూలతలు పంచొచ్చు.
- **ఐటీ** షేర్లూ లాభాలందుకునే అవకాశం ఉన్నా.. మార్కెట్‌తో పోలిస్తే కాస్త తక్కువ సానుకూలతలు కనిపిస్తున్నాయి.
- సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు పెరిగే అవకాశం ఉన్నందున **ఫార్మా** షేర్లు రాణించొచ్చు. మొత్తం మీద మార్కెట్ లాభాలందుకోనుండటం ఈ షేర్లకూ కలిసిరానుంది.

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2162.70	2197.20	2122.40
ఐసీఐసీఐ బ్యాంక్	395.40	412.60	377.20
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	43.50	45.40	40.80
ఇండస్ఇండ్ బ్యాంక్	1310.50	1375.00	1247.90
కోటక్ బ్యాంక్	1470.20	1508.70	1426.90
పీఎన్‌బీ	63.60	65.90	59.80
ఎస్‌బీఐ	271.10	282.20	257.10

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1468.75	1496.60	1431.90
అంబుజా సిమెంట్స్	197.30	201.30	194.00
ఇండియా సిమెంట్స్	70.75	75.00	65.70
శ్రీసిమెంట్	18409.35	18621.60	18166.20
అల్ట్రాటెక్ సిమెంట్	3861.80	3959.10	3742.50

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	1087.00	1107.20	1067.50
ఇన్ఫోసిస్	802.20	816.80	788.50
మైండ్ ట్రీ	709.05	727.00	680.10
పర్సిస్టెంట్‌సిస్టమ్స్	541.10	597.30	498.90
టీసీఎస్	2247.70	2286.50	2194.50
టెక్ మహీంద్రా	683.85	700.90	670.90
విప్రో	251.40	260.20	245.10

ఫార్మా	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	598.25	617.10	575.70
బయోకాన్	224.15	231.60	211.30
సిప్లా	465.90	479.00	442.70
డాక్టర్ రెడ్డీస్	2541.25	2578.60	2505.30
లుపిన్	738.65	765.20	698.30
ఫైజర్	2900.20	2986.40	2749.20

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	180.25	187.90	168.30
హిందుస్థాన్ జింక్	202.45	210.20	189.20
జిందాల్ స్టీల్	101.95	107.70	92.20
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	220.65	229.20	209.50
ఎన్ఎమ్‌డీసీ	80.05	85.60	72.00
టాటా స్టీల్	345.25	360.10	322.90
వేదాంతా	137.40	144.90	123.80

రూ.5,000 కోట్లకు పసిడి ఈటీఎఫ్‌ల ఆస్తులు

ఏప్రిల్ నుంచి 4 నెలల్లోనే

దిల్లీ: గోల్డ్ ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు నిర్వహించే ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఆర్థిక సంవత్సరం తొలి 4 నెలల్లో రూ.5,079.22 కోట్లకు చేరింది. ఇదే సమయంలో స్టాక్ మార్కెట్లు 3 శాతం మేర క్షీణించడంతో మదుపర్లు పసిడి వైపు నిధులు మళ్లించినట్లు తెలుస్తోంది. ఆర్థిక మందగమనంలో పెట్టుబడులు సురక్షితమని భావించేవారు పసిడి ఈటీఎఫ్‌లవైపు అడుగులు వేశారు. గడిచిన 4 నెలల్లో సెన్సెక్స్ 1,191.79 పాయింట్లు (3 శాతం) కోల్పోయింది. '2012లో పసిడి ధర గరిష్ఠ స్థాయికి చేరాక, ఇటీవలి వరకు తక్కువస్థాయికి పరిమితమైంది. ధరల్లో హెచ్చుతగ్గులు కూడా అధికంగా చోటు చేసుకోలేదు. ఫలితంగా మదుపర్లు చాలా కాలం పాటు పసిడిలో పెట్టుబుడులు పెట్టేందుకు ఆసక్తి చూపించలేదు. ఈ ఏడాది ఆ పరిస్థితి మారింది. బంగారం ధరలు పైపైకి ఎగబాకుతున్నాయ'ని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్, మేనేజర్ రీసెర్చ్ హిమాన్షు శ్రీవాస్తవ వెల్లడించారు. ఆర్థిక మందగమన సమయంలో ద్రవ్యోల్బణాన్ని మించి నిలబడే ఏకైక పెట్టుబడి సాధనంగా పసిడికి పేరుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా నెమ్మదించిన నేపథ్యంలో పసిడి మరోమారు సురక్షిత పెట్టుబడిగా నిలుస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.

సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో దేశీయ సమీకరణ నిబంధనల సడలింపు!

- **ప్రతిపాదనను పరిశీలిస్తున్న ప్రభుత్వం**

దిల్లీ: దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) మరింతగా ఆకర్షించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విదేశీ ఏక బ్రాండ్ రిటైలింగ్ సంస్థలు దేశీయంగా వ్యాపారం నిర్వహించాలంటే, 30 శాతం సరకును స్థానికంగానే సమీకరించాలన్న (లోకల్ సోర్సింగ్) నిబంధనను సడలించే ప్రతిపాదన సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దేశీయంగా విదేశీ సంస్థలు విక్రయశాలలు ప్రారంభించే ముందు, ఆన్‌లైన్ అమ్మకాలు ప్రారంభించేందుకూ అనుమతించాలన్నది ప్రతిపాదనగా చెబుతున్నారు. ప్రస్తుతం విక్రయశాలలు ప్రారంభించాకే, ఆన్‌లైన్‌లో అమ్మకాలకు విదేశీ ఏకబ్రాండ్ రిటైలర్లను అనుమతిస్తున్నారు. విదేశీ ఏక బ్రాండ్ సంస్థలు ప్రస్తుతం భారత్‌లో సమీకరించే వస్తువులను తమ అంతర్జాతీయ కార్యకలాపాల కోసం వినియోగించుకోడాన్ని అనుమతిస్తున్నారు. దేశీయంగా అదనంగా సమీకరిస్తున్న సరకును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇది కూడా అయిదేళ్ల కాలావధికి మాత్రమే ఉంది. బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రతిపాదన మేరకే ఇందులో సవరణలు చేస్తున్నారని సమాచారం.

2006 ఫిబ్రవరిలో తొలిసారిగా సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి ఎఫ్‌డీఐలకు ప్రభుత్వం అనుమతిని చ్చింది. అయితే 51 శాతం వాటాకే పరిమితం చేసింది. 2012 జనవరిలో దాన్ని 100 శాతానికి పెంచుతూ, అందులో 49 శాతం పెట్టుబడులు ఆటోమేటిక్ రూట్‌లో, మిగిలిన మొత్తానికి ప్రభుత్వ ఆమోదంతో రావాల్సి ఉంటుందని తెలిపింది. 2018 జనవరిలో 100 శాతం ఎఫ్‌డీఐల్ని అనుమతిస్తూనే, ప్రభుత్వ అనుమతులు లేకుండానే సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించింది. తాజాగా మరింత వెలుసుబాటు కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం.

టయోటా డీజిల్ వాహనాల అమ్మకాలు కొనసాగుతాయ్

టీకేఎం వైస్ ఛైర్మన్ శేఖర్ విశ్వనాధన్

దిల్లీ: దేశంలో డీజిల్ వాహనాల అమ్మకాలు కొనసాగించాలని టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) నిర్ణయించింది. 2020 ఏప్రిల్ 1 నుంచి బీఎస్ 6 ఉద్గార ప్రమాణాలు అమలు కానున్న నేపథ్యంలో, వాహనాల ఇంజిన్‌లను మెరుగుపరచాల్సి ఉంది. ఇందువల్ల డీజిల్ వాహనాల ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే డీజిల్ వాహనాలకు గిరాకీ ఉన్నందున, భవిష్యత్తు సాంకేతికతతో తయారు చేస్తామని టీకేఎం వైస్ ఛైర్మన్ శేఖర్ విశ్వనాధన్ తెలిపారు. తాము నెలకొల్పిన డీజిల్ ప్లాంటులో, స్వల్ప పెట్టుబడితో మార్పులు చేయడం ద్వారా, బీఎస్ 6 ప్రమాణాల ఇంజిన్లు కూడా తయారు చేయొచ్చని వివరించారు. ఇన్నోవా క్రిస్టా, ఫార్చ్యూనర్ వాహనాలను సంస్థ విక్రయిస్తుండగా, ఇందులో డీజిల్ విభాగ వాటాయే 82 శాతమని తెలిపారు. అయితే ప్రయాణికుల కార్లనే తీసుకుంటే, పెట్రోల్, డీజిల్ వాటా చెరి సగం ఉంది. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా విద్యుత్తు వాహనాల సాంకేతికతను దేశీయ విపణికి తీసుకు వస్తామన్నారు.

ఉద్దీపన పథకాలతో వృద్ధికి ప్రోత్సాహం: సీఐఐ

దిల్లీ: వివిధ రంగాలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఉద్దీపన పథకాలు వృద్ధికి ఊతమిచ్చేలా ఉన్నాయని, దీంతో ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అభిప్రాయపడింది. వాణిజ్య మందగమనం, అంతర్జాతీయ ప్రతికూలతల నడుమ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలోనే, దేశీయంగా ఉద్దీపన చర్యలు తీసుకోవడం మంచి పరిణామమని పేర్కొంది. అమెరికా, చైనాలు పరస్పరం సుంకాలు విధించుకోవడంతో ఏర్పడిన మందగమన పరిస్థితుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి ఉద్దీపన చర్యలు అన్ని రంగాలకు ఊతమిస్తాయని సీఐఐ అధ్యక్షుడు విక్రమ్ కిర్లోస్కర్ ప్రశంసించారు. ఇందువల్ల ద్రవ్యలోటుపై ప్రభావం పడకుండానూ జాగ్రత్త వహించడాన్ని అభినందించారు. వచ్చే కొన్ని నెలల్లో ఆర్థిక వ్యవస్థ మళ్లీ పైపైకి వృద్ధి చెందుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రూ.50 కోట్లకు మించిన బ్యాంక్ మోసాల పరిశీలనకు ప్రత్యేక బోర్డ్: సీవీసీ

దిల్లీ: రూ.50 కోట్లకు మించిన బ్యాంక్ మోసాలను పరిశీలించేందుకు అడ్వైజరీ బోర్డ్ ఫర్ బ్యాంక్ ఫ్రాడ్స్ (ఏబీబీఎఫ్)ను కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఏర్పాటు చేసింది. మాజీ విజిలెన్స్ కమిషనర్ టీఎం భాసిన్ దీనికి నాయకత్వం వహించనున్నారు. బ్యాంక్ మోసాలను పరిశీలించి, తగిన చర్యలను ఈ సంఘం సిఫారసు చేయనుంది. బ్యాంక్, వాణిజ్య, ఆర్థిక మోసాల పరిశీలనకు ఇంతకు ముందు సలహా మండలి ఉండేది. రిజర్వు బ్యాంక్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం ఏబీబీఎఫ్‌ను ఏర్పాటు చేశారు. రూ.50 కోట్లు పైబడిన మోసాల కేసులను ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఈ బోర్డుకు పంపిస్తాయి. ఏబీబీఎఫ్ ప్రాథమిక పరిశోధన నిర్వహిస్తుందని సీవీసీ తెలిపింది. అనంతరం బోర్డు సిఫారసుల మేరకు బ్యాంకులు చర్యలు చేపట్టొచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో జనరల్ మేనేజర్ స్థాయి వరకు అధికారులను, నలుగురు సభ్యులతో కూడిన ఏబీబీఎఫ్ విచారించొచ్చని వెల్లడించింది. పట్టణాభివృద్ధి మాజీ కార్యదర్శి మధుసూదన్ ప్రసాద్, బీఎస్ఎఫ్ మాజీ డైరెక్టర్ జనరల్ డీకే పతాక్, ఆంధ్రా బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ సురేశ్ పటేల్‌లు ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. ఛైర్మన్, సభ్యుల పదవీకాలం రెండేళ్లు. ఈనెల 21 నుంచి బోర్డ్ నియామకం అమల్లోకి వచ్చింది.

కమొడిటీస్ ఈ వారం

పసిడి ధగధగ!

- **బంగారం, వెండి**

పసిడి అక్టోబరు కాంట్రాక్టు గతవారం రూ.37,737 వద్ద ఆరంభమైనా, ఆ తర్వాత రూ.37,605కి పడిపోయింది. అమెరికా చర్యకు ప్రతిచర్యగా టారిఫ్‌లు పెంచాలని చైనా నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం కాంట్రాక్టు 2 శాతం మేర దూసుకెళ్లి రూ.38,821 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. చివరకు వారం మొత్తం మీద 2.84% లాభంతో రూ.38,880 వద్ద ముగిసింది. ఈవారం అమెరికా- చైనాల మధ్య వాణిజ్య యుద్ధ పరిణామాలు, ఫెడరల్ రిజర్వ్ వ్యాఖ్యలు, సాంకేతికత అంశాలు పసిడి కాంట్రాక్టుకు దిశానిర్దేశం చేస్తాయి. వాణిజ్య యుద్ధం ఉద్రిక్తతలు మరింత పెరిగిన నేపథ్యంలో రూ.39,080 వరకు కాంట్రాక్టు వెళ్లేందుకు అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనల మేరకు కీలక స్థాయైన రూ.39,219ను కూడా అధిగమించొచ్చు. వెండి సెప్టెంబరు ఫ్యూచర్ కాంట్రాక్టు గతవారం రూ.43,552 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత ఒడుదొడుకుల మధ్య చలిస్తూ రూ.43,154 స్థాయికి దిగివచ్చింది. వాణిజ్య యుద్ధ పరిణామాల నేపథ్యంలో పసిడి మాదిరే వెండి కాంట్రాక్టు కూడా ఆ తర్వాత రాణించి, రూ.44,627 స్థాయిని చేరింది. ఆఖరుకు 2.38% లాభంతో రూ.44,595 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా కాంట్రాక్టు ఇప్పటికే మోతాదుకు మించి పెరిగినప్పటికీ.. రూ.43,800 వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయి కంటే కిందకు రానంత వరకు కాంట్రాక్టు పెరిగేందుకే అవకాశం ఉంది. తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసే వాళ్లు రూ.44,611 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.43,875 దిగువన కాంట్రాక్టును షార్ట్‌సెల్ చేయొచ్చు. లాంగ్ పొజిషన్లుంటే రూ.45,598 వద్ద లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది.

- **ప్రాథమిక లోహాలు**

రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.448.85 కంటే ఎగువన ట్రేడ్ కాకుంటే.. మరింత కిందకు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల స్టాప్‌లాస్ సవరిస్తూ షార్ట్‌సెల్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అలాగే రూ.445.65 దరిదాపులో మరికొన్ని పొజిషన్లు జతచేసుకోవచ్చు. సీసం నెల రోజులుగా రూ.148- 159.80 శ్రేణి మధ్య చలిస్తోంది. ఈవారం కూడా ఆ శ్రేణిలోనే కదలాడొచ్చు. రూ.158.85 కంటే పైన ట్రేడ్ కాకుంటే కొంత అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. రూ.152.65; రూ.150.35 వరకు పడిపోవచ్చు. జింక్ ఆగస్టు కాంట్రాక్టు ఇప్పటికే మోతాదు కంటే ఎక్కువగా నష్టపోయినప్పటికీ.. మరింత డీలా పడే ఆస్కారం ఉంది. అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రాణించొచ్చు. ఈవారం రూ.137.15 దరిదాపులో ముగిస్తే రానున్న రోజుల్లో రూ.142.85; రూ.144 వరకు పెరుగుతుందని భావించవచ్చు. నికెల్ ఆగస్టు కాంట్రాక్టు గత మూడు వారాలుగా నష్టాలు చవిచూస్తోంది. ఈవారం కూడా ఆ ధోరణి కొనసాగొచ్చు. అయితే కాంట్రాక్టు గడువు తీరిపోనున్న నేపథ్యంలో కొంత ఒడుదొడుకులకు లోనుకావచ్చు.

- **ఇంధన రంగం**

ముడి చమురు అక్టోబరు, సెప్టెంబరు కాంట్రాక్టులను రాబోయే రెండు మూడు వారాల్లో ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేయొచ్చు. అమెరికా ఫెడ్ సమావేశం, అమెరికా- చైనా వాణిజ్య యుద్ధం, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాల సరఫరా తగ్గుముఖం లాంటి భిన్న పరిణామాల నేపథ్యంలో ఈ వ్యూహంతో వెళ్లడమే మంచిది. అయితే రూ.3,593 వద్ద స్టాప్‌లాస్ తప్పక పెట్టుకోవాలి. సహజవాయువు సెప్టెంబరు కాంట్రాక్టుకు ఈవారం రూ.160.35 వరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారం రూ.562.75 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఎందుకంటే ఈ స్థాయి వద్ద కొంత షార్ట్ కవరింగ్ చోటుచేసుకోవచ్చు. అందువల్ల గతవారం లాంగ్ పొజిషన్లు కొనసాగించే వాళ్లు ఈ స్థాయి వద్ద బయటపడటం మంచ

సిరి
కరీంనగర్
సోమవారం ఆగస్టు 26, 2019
siri@eenadu.net

ఇల్లు కట్టాలను కున్నారనుకోండి.. ఏం చేస్తాం.. ముందుగా నిర్మాణానికి సంబంధించిన పూర్తి ప్లానును గీయిస్తాం.. దానిని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తాం.. ఇంట్లో గదులు.. బయట నిర్మాణం ఎలా ఉండాలి.. ఇలా అనేకానేక వివరాలూ.. విషయాలూ ఉంటాయి. ఇదే విధంగా.. ఒక వ్యక్తి ఆర్థిక ప్రణాళికలకు సంబంధించీ పక్కా ప్రణాళిక ఉండాలి. అనుకోని కష్టం వస్తే ఏం చేయాలి? ఆదాయపు పన్ను, ఆర్థిక లక్ష్యాలు.. పెట్టుబడుల నిర్వహణ లాంటిపై స్పష్టత ఉండాలి. అందుకోసం ఏం చేయాలో తెలుసుకుందాం...

సాగాలి ముందుకు!

మనం ఈ రోజు ఆర్థికంగా ఎక్కడ ఉన్నాం.. మనం సాధించాల్సిన లక్ష్యాలేమిటి.. వాటిని ఎలా అందుకోగలం.. సాధారణంగా ఆర్థిక ప్రణాళికలో ఉండే మూడు ముఖ్యమైన అంశాలివే. చాలామందిలో ఒక అపోహ ఉంటుంది. ఆర్థిక ప్రణాళిక అంటే.. పెట్టుబడులు ఎక్కడ పెట్టాలి అనేది మాత్రమే ఉంటుందనుకుంటారు. అందులోనూ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం ఒక్కటే ఉంటుందని భావిస్తారు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఆర్థిక ప్రణాళిక.. కేవలం పెట్టుబడుల గురించి మాత్రమే చర్చించదు. ఇది పెట్టుబడుల ప్రణాళికకు మించి ఉంటుంది. అనుకోకుండా కష్టం వచ్చినప్పుడు ఏం చేయాలి? దానికోసం ఎంత మొత్తం జీవిత బీమా తీసుకోవాలి.. ఆరోగ్య బీమా, సాధారణ బీమాలాంటివి ఎలా తీసుకోవాలి.. ఆదాయపు పన్ను ఆదా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? సరైన పెట్టుబడి పథకంలో మదుపు చేయడం ద్వారా నిర్దేశిత స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను ఎలా సాధించవచ్చు..లాంటి ముఖ్యమైన అంశాలనూ ఇది చర్చిస్తుంది.

ఆర్థిక ప్రణాళికను రూపొందించడం అంటే.. 50శాతం ఆర్థిక ప్రయాణం పూర్తయినట్లే. ఇక మిగిలింది దాన్ని ఎంత వరకూ అమల్లో పెట్టామన్నదాని ఆధారంగా విజయం ఆధారపడుతుంది. ఆచరణలో పెట్టడమే కాదు.. దాన్ని సమయానుకూలంగా సమీక్షించుకోవడం, మార్పులు చేర్పులు చేయడం కూడా అవసరం. ఇలా చేయడం వల్ల మనం అనుకున్న మార్గంలోనే ప్రయాణించేందుకు వీలవుతుంది.

- **ఆదాయం మారినప్పుడు:** వ్యక్తుల ఆదాయం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఆదాయం మారినప్పుడు ఆర్థిక అవసరాలు, బాధ్యతలూ మారుతుంటాయి. సంపాదన తగ్గితే.. అప్పటి వరకూ అనుకున్నవన్నీ నెరవేరకపోవచ్చు. ఒకవేళ ఆదాయం పెరిగితే.. అనుకున్న లక్ష్యాలను ఇంకా ముందుగానే సాధించేందుకు వీలవుతుంది. కాబట్టి, ఇలాంటి సందర్భంలో మీరు గతంలో వేసుకున్న ఆర్థిక ప్రణాళికలను మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.
- **అవసరాలు:** మనం ఆర్థిక ప్రణాళిక రూపొందించుకున్నప్పటి అవసరాలకూ.. ఇప్పటి అవసరాలకూ కొన్ని తేడాలు రావచ్చు. ఇలాంటప్పుడు ఆయా అవసరాల ప్రాధాన్య క్రమం కూడా మారొచ్చు. దీర్ఘకాలం తర్వాత అనుకున్నది ముందుకు రావచ్చు. కొన్నింటి అవసరం ఇప్పుడు లేకపోవచ్చు. ఇలా అవసరాలు, లక్ష్యాల్లో తేడా వచ్చినప్పుడు కచ్చితంగా మార్పులు చేయాల్సిందే.
- **ఆధారపడిన వారు:** ఒక్కరే ఉన్నప్పుడు ఆర్థిక అవసరాలు, లక్ష్యాలు సాధారణంగానే ఉండొచ్చు. కానీ, వివాహం అయినప్పుడు.. కొత్తగా జీవితంలోకి కొన్ని బాధ్యతలు వస్తాయి. విహారయాత్రలకు వెళ్లడం, కారు కొనడంలాంటివి ప్రాధాన్యాలుగా మారతాయి. దీంతోపాటు పిల్లలు వస్తే.. కొత్త ఆర్థిక బాధ్యతలు వస్తాయి. ఈ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలనూ మార్చుకోవాలి.
- **జీవనశైలిలో మార్పులొస్తే..:** కాలం గడుస్తున్న కొద్దీ వ్యక్తుల జీవన శైలిలో మార్పులు రావడం సహజం. ఆదాయం పెరిగినప్పుడు.. సమాజంలో హోదా మారుతుంది. ఇల్లు కొనడం లేదా.. అధిక అద్దె ఉండే మంచి ఇంటికి మారడం చేస్తుంటారు. జీవనశైలిలో మార్పులు రావడం అంటే.. ఖర్చులు పెరగడమే. దీంతో మీరు అనుకుంటున్న బడ్జెట్‌లో తేడా రావచ్చు. మిగులు మొత్తం తగ్గుతోందంటే.. కాస్త అప్రమత్తంగా ఉండాల్సిందే.
- **సమయానుకూలంగా:** మనం ఏం చేయాలనే విషయంలో ఒకసారి ఆర్థిక ప్రణాళిక రచించుకున్న తర్వాత ఆదాయం, లక్ష్యాలు, బాధ్యతల్లో తేడా రాకున్నా.. నిర్ణీత వ్యవధి తర్వాత దానిని సమీక్షించుకోవడం మర్చిపోవద్దు. ఆ సమయంలో వ్యక్తిగతంగా వచ్చిన అన్ని మార్పులనూ పరిగణనలోనికి తీసుకోవడం మంచిది. ముందుగా అనుకున్న ఆలోచనలకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితులు ఉంటే.. అవసరమైన మార్పులతో మళ్లీ అది గాడిన పడేలా చేయాలి. క్రమశిక్షణతో.. ఆర్థిక స్థిరత్వం సాధించేందుకు ప్రయత్నించాలి.

ఏం చూడాలి...

ఆర్థిక ప్రణాళికను సమీక్షించేప్పుడు.. పాటించాల్సిన అంశాలు కొన్ని ఉంటాయి.. ఇప్పటికే మీరు అనుకున్న లక్ష్యాలను సాధించి ఉండవచ్చు. ఇలాంటప్పుడు మీ ప్రణాళికలో నుంచి వాటిని తీసేయాలి. అందుకోసం కేటాయిస్తున్న పెట్టుబడులను ఇతర లక్ష్యాలకు కేటాయించేందుకు కొత్త పథకాలను ఎంచుకోవాలి.

మీరు అనుకుంటున్న లక్ష్యాల వ్యవధిని ఒకసారి పరిశీలించండి. అన్నీ సవ్యంగా సాగుతున్నాయా? లేదా చూసుకోండి. ఉదాహరణకు మీరు 10 ఏళ్ల తర్వాత ఇల్లు కొనాలనే ఆలోచనతో ఉన్నారు. కానీ, మీ ఆదాయం పెరగడంతో దాన్ని ముందుగానే కొనేందుకు వీలయ్యిందనుకోండి.. అప్పుడు ఆ లక్ష్యం వ్యవధిని తిరిగి ఆలోచించుకోవాలి.

ఎంచుకున్న పెట్టుబడి పథకం మీరు ఆశిస్తోన్న రాబడి ఇస్తుందా లేదా అని తెలుసుకోవడానికే ఆర్థిక ప్రణాళికను క్రమం తప్పకుండా పరిశీలిస్తేనే తెలుస్తుంది. 12శాతం రాబడి ఇస్తుందన్న ఆశతో మీరు ఒక పెట్టుబడి పథకంలో మదుపు చేశారనుకుందాం. కానీ, ఆర్థిక వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంతో అది 10శాతం రాబడినే ఇస్తోంది. ఇలాంటప్పుడు.. తక్కువ రాబడినిచ్చే పథకాలను వదిలించుకొని, 12 శాతం రాబడిని అందించే పథకాలకు పెట్టుబడులు మళ్లించాలి.

ఆరోగ్యంగా ఉన్నామా లేదా తెలుసుకునేందుకు సమయానుకూలంగా వైద్య పరీక్షలు అవసరం. ఇదేవిధంగా ఆర్థిక ఆరోగ్యంగా ఉన్నామా లేదా అని తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా మన ఆర్థిక పరిస్థితినీ తనిఖీ చేసుకోవాలి. కష్టపడి సంపాదించడమే కాదు.. ఆ సంపాదన మన కోసం కష్టపడేలా చేసేందుకు ప్రయత్నించినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి చేరుకుంటాం.

- నితిన్ వ్యాకరణం,
సీఈఓ, www.arthayantra.com

నిఫ్టీ సూచీలో మదుపు

మార్కెట్ హెచ్చుతగ్గులతో వచ్చే సగటు ప్రయోజనాలను అందుకునేందుకు వీలుగా నిఫ్టీ సూచీలో మదుపు చేయాలనుకునే వారికి.. మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ 500 ఫండ్ అందుబాటులోకి వచ్చింది. నిఫ్టీ 500 సూచీలో ఉండే షేర్ల నిష్పత్తిని బట్టి ఇది పెట్టుబడిని కేటాయిస్తుంది. ఇది ఇండెక్స్ ఫండ్ల విభాగంలో ఓపెన్ ఎండెడ్ పథకం. కనీసం రూ.500లతోనూ మదుపు ప్రారంభించవచ్చు. ఆగస్టు 30 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది.

- బ్యాంకింగ్ రంగంలో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడి కోసం అందుబాటులోకి వచ్చిన ఫండ్ మోతీలాల్ ఓస్వాల్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్. నిఫ్టీ బ్యాంకు సూచీలో ఉండే ప్రధాన షేర్లలో ఇది మదుపు చేయడం దీని వ్యూహం. ఓపెన్ ఎండెడ్ పథకమిది. ఆగస్టు 30 వరకూ మదుపు చేసేందుకు వీలుంది. కనీసం రూ. 500లతోనూ పెట్టుబడి ప్రారంభించవచ్చు.

కొత్త పథకం

పెట్టుబడికి రక్షణగా..

మార్కెట్లో మదుపు చేసిన మొత్తానికి కనీస రక్షణ కావాలనుకునే వారు ఎస్‌బీఐ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఓరియంటెడ్ ఫండ్, సిరీస్ ఎ (ప్లాన్ 5)ని పరిశీలించవచ్చు. అత్యంత నాణ్యమైన ఫిక్స్‌డ్ సెక్యూరిటీల్లో మదుపు చేయడం ద్వారా పెట్టుబడికి భద్రత ఉండేలా చూసుకుంటుందిది. పెట్టుబడి వృద్ధికి తోడ్పడేందుకు కొంత మొత్తాన్ని ఈక్విటీలకూ కేటాయిస్తుంది. ఇన్‌కం విభాగానికి చెందిన క్లోజ్ ఎండెడ్ ఫథకమిది. పెట్టుబడిని కనీసం 1350 రోజులు కొనసాగించాలి. కనీస పెట్టుబడి రూ. 5,000. సెప్టెంబరు 5 వరకూ మదుపు చేసేందుకు వీలుంది.

- తక్కువ నష్టభయంతో.. ఆమోదయోగ్యమైన రాబడిని అందించేలా పీజీఐఎం ఇండియా ఓవర్‌నైట్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. అధిక లిక్విడిటీ ఉండే పథకాల్లో కనీసం ఒక రోజు కోసం కూడా మదుపు చేసే ఫండ్ ఇది. కనీస పెట్టుబడి రూ.100. ఓపెన్ ఎండెడ్ పథకం. ఆగస్టు 26తో ఎన్ఎఫ్ఓ ముగియనుంది.

క్షణాల్లో బదిలీ... సమస్య వస్తే?

గ్రాఫిక్: సుధాకర్

ఒకప్పుడు ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు డబ్బు బదిలీ చేయాలంటే.. కొన్ని రోజులు పట్టేది. మరి.. ఇప్పుడు క్షణాలే. ఇదంతా స్మార్ట్ ఫోన్ వల్లే సాధ్యమవుతోంది. ఎన్నో విషయాల్లో ఇప్పుడు ఇది మన జీవితంలో భాగమయ్యింది. బ్యాంకింగ్ సంబంధిత లావాదేవీలకూ ఇది కీలకం అయ్యింది. ముఖ్యంగా మొబైల్ వ్యాలెట్ల వాడకం బాగా పెరగడంతో.. కొన్ని సమస్యలూ వస్తున్నాయి. మరి, వీటిని ఎలా పరిష్కరించుకోవాలి చూద్దామా!

మన జేబులో పెట్టుకునే సాధారణ వ్యాలెట్‌కు డిజిటల్ రూపమే ఈ-వ్యాలెట్ లేదా మొబైల్ వ్యాలెట్లుగా అనుకుంటున్నాం. మన బ్యాంకు ఖాతాను ఈ తరహా వ్యాలెట్లతో అనుసంధానించడం ద్వారా పలు సేవలను పొందేందుకు అవకాశం కలుగుతోంది. వీటిలో ఉన్న సౌలభ్యం నేపథ్యంలో చాలామంది వీటి సేవలను వినియోగించుకుంటున్నారు. ఇందులోనూ కొన్ని వ్యాలెట్లలో ముందుగా నగదు నింపి వాడుకునే వీలుంటుంది. మరికొన్నింటిలో అప్పటికప్పుడే.. యూపీఐ ఇంటర్ఫేస్ ద్వారా నగదు బదిలీ జరుగుతుంది. వేగంగా నగదు బదిలీ కావడంతో కొనుగోళ్లు, సేవలను పొందేప్పుడు ఎక్కువమంది నగదుకు బదులుగా వీటినుంచే ఆయా చెల్లింపులను చేసేస్తున్నారు. పైగా ఇందులో కొన్ని ఆకర్షణీయమైన బహుమతులు, రివార్డులను కూడా అందిస్తోండటంతో వీటిపట్ల ఆకర్షణ పెరుగుతోంది.

సౌలభ్యం వెంట కొన్ని ఇబ్బందులూ వెన్నంటి ఉంటాయి. ఇలా కొన్ని సార్లు మన ఖాతా నుంచి డబ్బు డెబిట్ అయినా.. అవతలి వారి ఖాతాలో జమకాకపోవచ్చు. ఇలా సాధారణంగా వచ్చే కొన్ని సమస్యలు.. వాటికి ఉన్న పరిష్కారాలేమిటి?

- **వ్యాలెట్ నుంచి వ్యాలెట్‌కు బదిలీ:** ఈ రకమైన లావాదేవీలలో సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ. సాంకేతిక సమస్యల వల్ల లావాదేవీ పూర్తి కాకపోతే.. కొద్ది సమయంలోనే తిరిగి మన వ్యాలెట్‌కు డబ్బులు జమ అవుతాయి. ఏదన్నా కారణంతో 24 గంటల తర్వాతా రాకపోతే.. వ్యాలెట్‌లో ఉండే ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదును నమోదు చేయాలి.
- **వ్యాలెట్ నుంచి బ్యాంకు లేదా ఇటు నుంచి అటు:** ఇటువంటి లావాదేవీలు ఎక్కువగా ఎన్‌పీసీఐ పేమెంట్ సిస్టం ద్వారా జరుగుతాయి. ఏదేని సందర్భంలో బ్యాంకు ఖాతాకు నగదు జమ కానప్పుడు.. వాలెట్‌లోనే ఫిర్యాదుల విభాగంలో మీ సమస్యను పేర్కొనాలి.
- **మోసపూరిత లావాదేవీలు:** మన ప్రమేయం లేకుండా జరిగే లావాదేవీలను ఇలా పేర్కొనవచ్చు. ఇలాంటప్పుడు మన డబ్బు నష్టపోతే...

ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ లావాదేవీలు చేసినప్పుడు.. మోసపూరిత లావాదేవీల వల్ల నగదు నష్టపోతే రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం వచ్చే ఏర్పాటు ఉంది. ఇదే నిబంధనలు మొబైల్ వ్యాలెట్లలో జరిగే మోసపూరిత లావాదేవీలకు వర్తిస్తాయి.

మొబైల్ వ్యాలెట్ ఖాతాదారులకు ప్రతి లావాదేవీ సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా తప్పక అందాలి. ఇలా లావాదేవీ సమాచారం వచ్చినప్పుడు.. అందులో మీ ప్రమేయం లేనప్పుడు వెంటనే ఆయా మొబైల్ వ్యాలెట్ల 24 గంటల సేవా కేంద్రానికి ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలి, మొబైల్ వ్యాలెట్ యాప్‌లోనూ, ఈ మెయిల్ ద్వారానూ ఫిర్యాదు చేయొచ్చు.

మన ప్రమేయం లేకుండా.. ఏదైనా లావాదేవీ జరిగితే.. సంక్షిప్త సందేశం వచ్చిన మూడు రోజుల్లోగా ఫిర్యాదు చేయాలి. ఏదేని కారణంతో మన ఫిర్యాదు 4-7 రోజులలోపు చేస్తే లావాదేవీ సొమ్ము కానీ, రూ.10,000లలో ఏది తక్కువైతే అది వస్తుంది. 7 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే వ్యాలెట్ కంపెనీ బోర్డు పాలసీ ప్రకారం రిఫండ్ వస్తుంది. మన ఫిర్యాదు అందిన తేదీ నుంచి 10 రోజుల్లోగా రిఫండ్‌ను తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది.

మోసపూరిత లావాదేవీలు జరిగినప్పుడు ఖాతాదారుడి బాధ్యతను రుజువు చేసే భారం కూడా వ్యాలెట్ సంస్థలపైనే ఉంటుంది. ఇతర వివాదాలు ఏమైనా ఉంటే.. 90 రోజుల్లోపు పరిష్కరించాల్సిన బాధ్యతా వ్యాలెట్ సంస్థలదే.

ఒకవేళ సరైన పరిష్కారం లభించలేదు అనుకుంటే. ఖాతాదారులు అంబుడ్స్‌మన్ వద్ద ఫిర్యాదును దాఖలు చేయొచ్చు. ముందుగా వ్యాలెట్ సంస్థల్లో ఫిర్యాదు చేసిన తర్వాత మాత్రమే అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి. ఆన్‌లైన్‌లోనూ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. మీ ఫిర్యాదుతోపాటు అవసరమైన పత్రాలు, మీరు ఎంత పరిహారం కోరుకుంటున్నారు అనే వివరాలనూ తెలియజేయాల్సి ఉంటుంది.

- ఫణి శ్రీనివాసు, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

రెండు పాలసీలున్నా నష్టం లేదు..

- నేను ఇటీవలే ఉద్యోగం మారాను. పాత సంస్థ ఆరోగ్య బీమా స్థానంలో కొత్త సంస్థ నుంచి వైద్య బీమా తీసుకున్నాను. నేను సొంతంగా తీసుకున్న పాలసీ.. ఇప్పుడు కొత్త సంస్థ ఇస్తోన్న పాలసీ రెండూ బీమా కంపెనీ నుంచి ఉన్నాయి. ఒకవేళ నేను క్లెయిం చేసుకోవాల్సిన సందర్భం వస్తే ఏదైనా ఇబ్బంది వస్తుందా?

- మోహన్

యాజమాన్యం అందించే బృంద బీమాతోపాటు వ్యక్తిగతంగా కూడా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం ఎప్పుడూ మంచిదే. పాలసీ ద్వారా క్లెయిం చేసుకోవాల్సిన సందర్భం వచ్చినప్పుడు.. కొన్ని విషయాలను పరిశీలించి ఏ పాలసీని వినియోగించాలన్నది నిర్ణయించుకోవచ్చు. రెండు పాలసీల్లో చెల్లింపుల నిష్పత్తి ఎలా ఉందో చూసుకోండి. వేచి ఉండే వ్యవధి, పరిమితులు, ఉప పరిమితుల్లాంటివి గమనించాలి. రెండు పాలసీలు ఉండటం వల్ల నష్టమేమీ లేదు. ఒకే సంస్థ నుంచి ఉన్నాయి కాబట్టి, పరిహారం చెల్లింపులో పారదర్శకత ఉంటుంది.

- బ్యాంకు నుంచి రుణం తీసుకొని, ఒక ఇంటి స్థలం కొనాలనే ఆలోచనతో ఉన్నాను. స్థలం కొన్న తర్వాత నిర్ణీత గడువులోగా ఇల్లు కట్టాలని అంటున్నారు. నిజమేనా? **- రవి**

సొంతంగా ప్లాటు కొన్నప్పుడు.. మన ఇష్టం వచ్చినప్పుడు ఇల్లు కట్టుకోవచ్చు. దీనికి ఎలాంటి నిబంధనలూ ఉండవు. కానీ, బ్యాంకు నుంచి రుణం తీసుకొని ఇంటి స్థలం కొన్నప్పుడు.. బ్యాంకు నిర్ణీత సమయంలోగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలనే నిబంధన విధించవచ్చు. ఆ నిబంధనను అనుసరించి, మీరు ఇంటిని నిర్మించాల్సిన అవసరం ఉంటుంది. ఒకవేళ ఆ గడువు మీరితే.. బ్యాంకు నిబంధనలను అతిక్రమించినట్లు పరిగణించి, మొత్తం రుణాన్ని ఒకేసారి తీర్చేయాల్సిందిగా ఒత్తిడి తీసుకురావచ్చు. పైగా కొన్నిసార్లు దీనికి అధిక వడ్డీ కూడా వర్తిస్తుంది. ఇది మీ సిబిల్ స్కోరుపై కూడా ప్రభావం చూపిస్తుంది.

- నా వయసు 27 ఏళ్లు. గతంలో నేను షేర్లలో మదుపు చేసేవాడిని. కానీ, నష్టపోయాను. ప్రస్తుతం ఈక్విటీల్లో మదుపు చేయడం అంటే అంత ఆసక్తిగా లేదు. నెలకు రూ.20వేల వరకూ మదుపు చేయగలను. ప్రత్యామ్నాయం ఏదైనా ఉందా?

- కుమార్

నేరుగా షేర్లలో మదుపు చేసినప్పుడు ఎంతో అవగాహన, ఓపిక అవసరం. పెట్టుబడులు వైవిధ్యంగా ఉండేలా చూసుకుంటూ.. మంచి సంస్థలను ఎంచుకొని, షేర్లు కొనాలి. అంతేకానీ, ఈక్విటీలకు దూరంగా ఉంటాననుకోవడం సరికాదు. మీరు నేరుగా షేర్లకు బదులుగా మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవచ్చు. మీ వయసు తక్కువగానే ఉంది కాబట్టి, ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి. తర్వాత బ్యాలెన్స్‌డ్, డెట్ పథకాలకు ఈ పెట్టుబడిని మళ్లించవచ్చు. మల్టీ క్యాప్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా మదుపు చేసేందుకు ప్రయత్నించండి. దీని వల్ల మీకు నష్టభయం తగ్గేందుకు వీలుంటుంది. దీనికోసం యాక్సిస్ మల్టీ క్యాప్ ఫండ్, డీఎస్‌పీ ఈక్విటీ ఫండ్, ఐసీఐసీఐ మల్టీ క్యాప్ ఫండ్లను పరిశీలించవచ్చు.

- నేను ఏడాదికి రూ.5లక్షల వరకూ సంపాదిస్తున్నాను. కొన్ని మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నప్పటికీ.. ఇప్పటివరకూ జీవిత బీమా పాలసీలేమీ తీసుకోలేదు. నాపై ఆధారపడి మా అమ్మగారు ఉన్నారు. కొత్తగా మరో రూ.5,000లను పెట్టుబడి పెట్టేందుకు ఆలోచిస్తున్నా. నేను ఏం చేయాలి?

- మహి

మీరు బీమా పాలసీని పెట్టుబడి కోసం కాకుండా.. పూర్తి రక్షణ కోసం మాత్రమే పరిగణించండి. దీనికోసం టర్మ్ పాలసీని ఎంచుకోవచ్చు. మీ వార్షికాదాయానికి కనీసం 15 రెట్ల వరకూ టర్మ్ పాలసీ ఉండేలా చూసుకోండి. ఇక మ్యూచువల్ ఫండ్లలో మదుపు కోసం కెనరా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్ (మల్టీక్యాప్ ఫండ్), ఎస్‌బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ (స్మాల్ క్యాప్)లను పరిశీలించవచ్చు. మీ పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండేందుకు ఈ ఫండ్లు తోడ్పడతాయి.

- సాయి కృష్ణ పత్రి,
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఛాంపియన్

"టోర్నీలో సింధు వరుసగా తై జు యింగ్, చెన్ యుఫెయ్, ఒకుహరలను ఓడించడం గొప్ప విషయం. ఫైనల్లో ఎక్కడా తడబడకుండా మ్యాచ్‌ను ముగించింది. సెమీస్‌లో వరుస సెట్లలో మ్యాచ్‌ను ముగించడం సింధుకు కలిసొచ్చింది. సుదీర్ఘ సెమీస్ వల్ల ఒకుహర అలసిపోయింది. ప్రతి పెద్ద టోర్నీలో సింధు పతకాలు సాధించి అత్యుత్తమ క్రీడాకారిణగా నిలిచింది"
- 'ఈనాడు'తో పుల్లెల గోపీచంద్

అమ్మకు ప్రేమతో..!

● ఈ పతకం ఆమెకే అంకితం

● 'ఈనాడు'తో పి.వి.సింధు

ఈనాడు - హైదరాబాద్

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కోసం ఆర్నెల్లుగా కష్టపడ్డానని.. అందుకు ప్రతిఫలం దక్కిందని పి.వి. సింధు తెలిపింది. ఆదివారం ఒకుహరపై విజయానంతరం సింధు ఇచ్చిన ఇంటర్వ్యూ 'ఈనాడు'కు ప్రత్యేకం.

వరుసగా మూడో ఏడాది ఫైనల్ చేరడం.. స్వర్ణం సాధించడం ఎలాంటి అనుభూతినిస్తోంది?

బ్యాడ్మింటన్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ అత్యున్నత టోర్నీ. ఒలింపిక్స్‌కు ఏమాత్రం తీసిపోదు. పోటీ అత్యున్నత స్థాయిలో ఉంటుంది. వరుసగా మూడో ఏడాది ఫైనల్ చేరుకోవడం కూడా ఓ ఘనతే. అలాంటిది స్వర్ణం సాధించడం అన్నిటికంటే గొప్ప. ఈ విజయాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. త్రివర్ణ పతాకం పైకి వెళ్తున్నప్పుడు.. జాతీయ గీతం ఆలపిస్తున్నప్పుడు ఎంతో గర్వంగా.. గొప్పగా అనిపించింది.

ఈ స్వర్ణం నెగ్గిన తొలి భారత షట్లర్ కావడం ఎలా అనిపిస్తోంది?

ఈ రోజు కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నా. నిరుడు రజతం లభించింది. అంతకుముందు ఏడాది రజతమే దక్కింది. ఈసారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న కసితో వచ్చా. ఆర్నెల్లుగా కష్టపడ్డా. ఇప్పుడు ప్రతిఫలం లభించింది. భారత్‌కు తొలి స్వర్ణం అందించడం గర్వకారణం. కోచ్‌లు గోపీచంద్, కిమ్.. తల్లిదండ్రుల సహకారంతో ఇది సాధ్యమైంది.

ఫైనల్లో ఏ వ్యూహాలతో దిగారు?

ఇప్పటి వరకు మేదిద్దరం 15 సార్లు తలపడ్డాం. ఒకరి ఆటపై మరొకరికి పూర్తి అవగాహన ఉంది. తను ర్యాలీ ప్లేయర్. సుదీర్ఘంగా ర్యాలీలు ఆడుతుంది. ఆమె వ్యూహంలో చిక్కుకుంటే బయటకు రావడం కష్టం. అందుకే మొదటి పాయింటు నుంచే దూకుడుగా ఆడా. ర్యాలీలను తిప్పికొట్టాను. డిఫెన్స్‌ను దెబ్బతీశా. దీంతో ఒకుహర ఒత్తిడిలోకి వెళ్లింది.

గత రెండు ఫైనల్స్‌లో ఓడినా.. ఈసారి ఒత్తిడి కనిపించలేదే?

ఆటలో గెలుపోటములు భాగం. కోర్టులో దిగాక నూటికి నూరుశాతం ప్రదర్శన ఇవ్వడమే ముఖ్యం. గత ఫైనల్స్ గురించి ఆలోచించలేదు. అసలు ఫైనల్‌గానే భావించలేదు. క్వార్టర్స్, సెమీస్ మ్యాచ్‌లాగే వెళ్లి సహజసిద్ధంగా ఆడా. నూటికి నూరుశాతం ప్రదర్శన ఇచ్చా.

క్వార్టర్స్‌లో తై జుపై విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంచిందా?

కచ్చితంగా. ప్రస్తుతం ప్రపంచంలో అత్యుత్తమ క్రీడాకారిణుల్లో తై జు ఒకరు. యింగ్‌ను ఓడిస్తేనే స్వర్ణం నెగ్గుతానని తెలుసు. అందుకే క్వార్టర్స్ పోరులో తొలి గేమ్ కోల్పోయినా ఆశలు వదులుకోలేదు. వెనుకంజలో ఉన్నా కూడా ప్రతి పాయింటు కోసం పోరాడా. చివరి పాయింటు వరకు గెలుపు కోసం పోరాటంతో విజయం దక్కింది. క్వార్టర్స్‌లో గెలుపే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మలుపు.

ఈ పతకం ఎవరికి అంకితం?

ఈరోజు (ఆదివారం) అమ్మ పుట్టిన రోజు. ఆమెకు ఏదో ఒక బహుమతి ఇవ్వాలనుకున్నా. ఈ పతకం అమ్మకే అంకితం. నేను ఈస్థాయికి చేరుకోడానికి తల్లిదండ్రులే కారణం.

పక్క చిత్రంలో చూశారా మన సింధును..

ఆ మోములో ఎంతో ప్రశాంతత.. అంతులేని సంతృప్తి!

దశాబ్దాల దేశం నిరీక్షణకు తెరదించుతూ.. ఎన్నో ఏళ్ల తన నిర్విరామ శ్రమకు ఫలితం పొందుతూ.. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని ఘనతను అందుకున్న వేళ సింధు హావభావమిది!

ఊరించి ఊరించి.. చిక్కినట్లే చిక్కి రెండు సార్లు చేజారిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణాన్ని పట్టుబట్టి సాధించింది మన తెలుగుతేజం.

రెండేళ్ల కిందట ఎవ్వరైతే తన పసిడి కలను భగ్నం చేశారో.. అదే ప్రత్యర్థిని మట్టికరిపిస్తూ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది సింధు.

భారత స్టార్ షట్లర్.. తెలుగమ్మాయి పూసర్ల వెంకట సింధు సాధించింది. బ్యాడ్మింటన్‌లో అత్యున్నత వేదికపై చరిత్ర సృష్టించింది. విశ్వవేదికపై ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. మరే భారత క్రీడాకారుడికి సాధ్యంకాని.. ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో ముప్పన్నెల పతకాన్ని రెపరెపలాడించింది.

మన బంగారానికి బంగారం

● చరిత్ర సృష్టించిన సింధు ● ఫైనల్లో ఒకుహర చిత్తుచిత్తు

● ప్రపంచ బ్యాడ్మింటన్‌లో స్వర్ణం నెగ్గిన తొలి భారత షట్లర్‌గా రికార్డు

బాసెల్ (స్విట్జర్లాండ్)

2013 కాంస్యం.. 2014.. కాంస్యం.. 2017.. రజతం.. 2018 రజతం.. 2019.. స్వర్ణం! ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సింధు ప్రస్థానమిది. చరిత్ర సృష్టించడం అలవాటుగా మార్చుకున్న సింధు మరో అద్భుతం చేసింది. ఎప్పట్నుంచో ఊరిస్తున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణ పతకాన్ని ఎట్టకేలకు చేజిక్కించుకుంది. వరుసగా మూడో ఏడాది ఫైనల్లో అడుగుపెట్టిన సింధు బంగారు పతకంతో మురిపించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి క్రీడాకారిణిగా భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఐదో సీడ్ సింధు 21-7, 21-7తో మూడో సీడ్ నొజొమి ఒకుహర (జపాన్)ను చిత్తుచేసింది. కేవలం 37 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించి.. 2017 ప్రపంచ ఫైనల్లో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒక స్వర్ణం, 2 రజతాలు, 2 కాంస్యాలతో ఒలింపిక్ మాజీ ఛాంపియన్ జాంగ్ నింగ్ (చైనా) రికార్డును సమం చేసింది.

సాహో సింధు

2017లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సింధు, ఒకుహర తలపడ్డారు. 110 నిమిషాల పాటు సాగిన ఆ పోరు బ్యాడ్మింటన్ చరిత్రలోనే అత్యుత్తమ మహిళల సింగిల్స్ మ్యాచ్‌గా రికార్డులకెక్కింది. కోర్టులోనే కుప్పకూలే వరకు పోరాడిన సింధు చివరికి ఓడిపోవడం కోట్లాది మంది భారతీయుల గుండెల్ని పిండేసింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో మరోసారి సింధు, ఒకుహర కలబడ్డారు. కానీ అప్పటిలా మ్యాచ్ సుదీర్ఘంగా సాగలేదు. ప్రత్యర్థి అసలు సోదిలోనే లేదు. సింధు దెబ్బకు మాజీ ఛాంపియన్ అనామక క్రీడాకారిణిగా మారిపోయింది. కళ్లుచెదిరే స్మాష్‌లకు.. మెరుపు వేగంతో సింధు సంధించిన రిటర్న్‌లకు ప్రత్యర్థి దగ్గర బదులే లేకపోయింది. 2017 ఫైనల్ 110 నిమిషాలు సాగగా.. అందులో మూడో వంతు సమయంలోనే ఆదివారం నాటి తుదిపోరు ముగియడం విశేషం. ఒకుహర ఆట.. శైలిపై పూర్తి అంచనా, పక్కా వ్యూహంతో బరిలో దిగిన సింధు ఊహించని రీతిలో ప్రత్యర్థిని దెబ్బకొట్టింది. ర్యాలీలు సుదీర్ఘంగా ఆడే ఒకుహరకు అందనంత వేగం.. అదిరిపోయే స్ట్రోక్‌లతో షాకిచ్చింది. షటిల్‌పై పూర్తి నియంత్రణ.. కచ్చితత్వంతో కూడిన షాట్ సెలెక్షన్.. వేగం.. దూకుడు.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో సింధు బెబ్బులిలా విరుచుకుపడింది. తొలి గేమ్‌లో మొదటి పాయింటు నెగ్గడమొక్కటే మ్యాచ్‌లో ఒకుహరకు సానుకూలాంశం! అక్కడ్నుంచి ఆటంతా సింధుదే. ఆమె స్ట్రోక్‌లను బదులివ్వలేక ప్రత్యర్థి చేతులెత్తేసింది. ప్రత్యర్థి ఊహించలేనంతగా ఒకే షాట్‌ను రెండు, మూడు విధాలుగా ఆడుతూ అసలైన ప్రపంచ ఛాంపియన్ అనిపించుకుంది. 16 నిమిషాల్లో ముగిసిన తొలి గేమ్‌లో వరుసగా 7 పాయింట్లతో 8-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది సింధు. సింధు దూకుడును ఎదుర్కోవడం కష్టమని భావించిన ఒకుహర ఆమెను ర్యాలీ గేమ్ వైపునకు మళ్లించినా ఫలితం లేకపోయింది. సింధు పదునైన రిటర్న్‌లకు ప్రత్యర్థి బెంబేలెత్తిపోయింది. ఒకుహర కోర్టు నలువైపులా తిప్పుతూ.. వరుస పాయింట్లతో హోరెత్తించిన సింధు 18-5తో స్పష్టమైన ఆధిక్యం సంపాదించింది. 19-7తో మరింత ముందంజ వేసిన సింధు 21-7తో తొలి గేమ్‌ను పూర్తి చేసింది. రెండో గేమ్ కూడా తొలి గేమ్ మాదిరే సాగింది. రెట్టింపు దూకుడు.. ఎటాకింగ్ గేమ్‌తో ఒకుహరను సింధు మరింత ఒత్తిడిలోకి నెట్టింది. 11-4తో ఆధిక్యం సంపాదించిన సింధు.. చూస్తుండగానే 19-7తో మ్యాచ్‌కు చేరువైంది. కళ్లుచెదిరే స్మాష్‌తో పాయింటు నెగ్గిన సింధు.. అద్భుతమైన రిటర్న్‌తో ఒకుహర ఆట కట్టించింది.

ఈ రాకెట్.. ఆగదు

అది 2012... చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ టోర్నీ.. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆ ఏడాది ఒలింపిక్స్ (లండన్ 2012) స్వర్ణ విజేత లీ బరిలో నిలిచింది. అవతలి వైపు ప్రత్యర్థేమో.. అంతర్జాతీయ స్థాయిలో అప్పుడే తన ప్రస్థానం మొదలెడుతున్న ఓ పదిహేడేళ్ల అమ్మాయి. అలాంటిది ఏకంగా ఒలింపిక్ ఛాంపియన్‌తో పోరు అనగానే ఆ అమ్మాయి ఏ మాత్రం పోటీ ఇవ్వగలదని అంతా సందేహించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. అద్భుతమైన ప్రదర్శనతో తనకంటే ఎంతో మెరుగైన లీని చిత్తుచేసింది. ప్రపంచ బ్యాడ్మింటన్‌లోకి తన ఆగమనాన్ని ఘనంగా చాటింది. ఆ అమ్మాయి ఎవరో కాదు.. తాజాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన మన సింధూనే. నిలకడైన ఆటతీరుతో సంచలనాలు నమోదు చేయడం అలవాటుగా మార్చుకున్న ఆమె విజయ ప్రయాణం నిరాటంకంగా సాగుతోంది. మరే షట్లర్‌కు సాధ్యం కాని రీతిలో ఎన్నో ఘనతలు సొంతం చేసుకున్నా కూడా ఆమె విజయాల ఆకలి తీరట్లేదు.

ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఒలింపిక్స్ పతకమైనా.. ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజయమైనా.. అతిగా పొంగిపోవడం.. ఇక చాలు అనుకోవడం.. సింధుకు అలవాటు లేని విషయాలు. ఎంత పెద్ద విజయం సాధించినా కూడా.. తర్వాత ఏంటి? అనుకోవడమే ఆమెకు తెలుసు. ఆ లక్షణమే తనను ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపింది. ప్రపంచ స్థాయి టోర్నీల్లో విజయం సాధించగానే.. ఒక్కసారిగా పేరు, ప్రఖ్యాతులు రావడంతో ఆట మీద నుంచి దృష్టి మరలి.. కెరీర్‌లో వెనకబడ్డ క్రీడాకారులు ఎంతో మంది. కానీ ఎన్ని ఘనతలు చెంతచేరినా.. ఎవరికీ సాధ్యం కాని విజయాలు దక్కినా.. ఈ తెలుగు తేజం ఆగలేదు. కీర్తి చట్రంలో చిక్కుకోకుండా.. దేనిపై వ్యామోహం పెంచుకోకుండా.. కేవలం ఆట మీదే శ్రద్ధ పెట్టిన ఆమె చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే క్రీడాకారిణిగా అవతరించింది. ఎనిమిదేళ్ల వయసులో రాకెట్ పట్టినప్పటి నుంచి.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం అందుకునే దాకా ఆమె ఎక్కడా విశ్రమించలేదు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతంతో కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరిన ఆమె అలసత్వాన్ని దరిచేరనియ్యలేదు. ఇదివరకే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో నాలుగు పతకాలు గెలుచుకున్నా కూడా సంతృప్తి చెందలేదు. తను సాధించాల్సింది ఇంకా ఉందని తలచి.. తన పతక వేటను కొనసాగించింది. కాబట్టే ప్రపంచ ఛాంపియన్ పసిడి ఆమె చెంత వాలింది.

సైనాను మించి

సైనా నెహ్వాల్.. గొప్ప ప్రదర్శనతో భారత బ్యాడ్మింటన్‌ను సత్తాను ప్రపంచానికి పరిచయం చేసిన మేటి క్రీడాకారిణి. ఆమెకు జూనియర్‌గా వచ్చిన సింధు.. సైనా తర్వాతేనని అంతా అనుకున్నారు. కానీ సైనా (2015) కంటే ముందే 2013లోనే సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడం విశేషం. ఐతే ఆ గెలుపు ఏదో గాలివాటమని భావించి ఆమెను మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఆమె ఎలాంటి ప్రతికూలతలను దగ్గరికి రానివ్వలేదు. పట్టుదలతో సాధన చేసింది. అడ్డంకులను అధిగమించింది. సైనా తర్వాత సింధు అనుకునే స్థాయి నుంచి.. సైనాను మించి దిగ్గజంగా నిలిచింది. అదేంటో కానీ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ అంటే మాత్రం సింధూకు ఎక్కడలేని పూనకం వచ్చేస్తుంది. రాకెట్ తిరుగులేని ఆయుధంగా మారి.. ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ విజయాల వైపు పరుగులు పెడుతుంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ముందు ఈ ఏడాది సింధు ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. దాంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆమె ఎలా రాణిస్తుందోననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ ఒక్కసారి టోర్నీ మొదలయ్యాక ఆమె టాప్‌గేర్‌లోకి వచ్చేసింది. ఇంతకుముందు తనను ఓడించిన ప్రత్యర్థులను చిత్తుచేస్తూ పోడియంపై అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో చరిత్ర సృష్టించడమే కాకుండా.. సిల్వర్ స్టార్ అని తనమీద పడిన ముద్రను తొలగించుకున్నట్లైంది. ఫైనల్ ఫోబియోతో గత రెండు పర్యాయాలు విశ్వవిజేతగా నిలిచే అవకాశం చేజార్చుకున్న ఆమె ఈ సారి పూర్తిస్థాయిలో చెలరేగి టైటిల్‌ను ఒడిసిపట్టుకుంది. ఇక ఆమె ఖాతాలో చేరాల్సింది.. ఒలింపిక్స్ స్వర్ణం ఒక్కటే. వచ్చే ఏడాది ఒలింపిక్స్ నేపథ్యంలో సింధు తాజా ప్రదర్శన ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందనడంలో సందేహం లేదు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ ఆమె ఇదే జోరు కొనసాగించి పసిడి పతకాన్ని సొంతం చేసుకోవాలనేదే అందరి ఆకాంక్ష.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ పతకాలు

1983	ప్రకాశ్ పదుకొనె- కాంస్యం
2011	గుత్తా జ్వాల, అశ్విని పొన్నప్ప జోడీ - కాంస్యం
2013	సింధు కాంస్యం
2014	సింధు కాంస్యం
2015	సైనా నెహ్వాల్- రజతం
2017	సైనా నెహ్వాల్- కాంస్యం
2017	సింధు రజతం
2018	సింధు రజతం
2019	సింధు స్వర్ణం, సాయిప్రణీత్ కాంస్యం

"పి.వి.సింధు మరోసారి భారత్‌ను గర్వపడేలా చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన ఆమెకు అభినందనలు. మరోవైపు 36 ఏళ్ల తర్వాత పురుషుల సింగిల్స్‌లో కాంస్యం గెలిచిన భమిడిపాటి సాయిప్రణీత్‌కు శుభాకాంక్షలు"
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నిప్పులు చెరిగిన బుమ్రా

తొలి టెస్టులో భారత్ ఘన విజయం • కుప్పకూలిన విండీస్

ఆంటిగ్వా

వెస్టిండీస్‌తో పర్యటనలో టీమ్‌ఇండియా జైత్రయాత్రను కొనసాగించింది. ఇప్పటికే టీ20, వన్డే సిరీస్‌లు చేజిక్కించుకున్న భారత్.. టెస్టు సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. ఫాస్ట్‌బౌలర్ బుమ్రా (5/7) విజృంభించడంతో వెస్టిండీస్‌తో తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 419 పరుగుల చేదనలో బుమ్రా దాటికి విండీస్ ఇన్నింగ్స్ పేక మేడను తలపించింది. బుమ్రా పదునైన బంతులకు నిలవలేకపోయిన విండీస్.. 100 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం మూటగట్టుకుంది. బుమ్రాతో పాటు ఇషాంత్‌శర్మ (3/31), షమి (2/13) ప్రత్యర్థి పతనంలో పాలుపంచుకున్నారు. టీ విరామానికి 15 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన కరీబియన్ జట్టు.. ఆ తర్వాత కూడా కోలుకోలేకపోయింది. 7 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిన విండీస్.. ఆ తర్వాత 8 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకుని కష్టాల్లో కూరుకుపోయింది. ఆ తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 26.5 ఓవర్లలోనే ఇన్నింగ్స్‌ను ముగించింది. అంతకుముందు అజింక్య రహానె (102; 242 బంతుల్లో 5×4) సెంచరీ సాధించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 343/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. హనుమ విహారి (93; 128 బంతుల్లో 10×4, 1×6) సెంచరీ కోల్పోయాడు. రెండో టెస్టు శుక్రవారం కింగ్‌స్టన్‌లో మొదలవుతుంది.

వాళ్లిద్దరూ నిలిచారు: భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగులకే 3 వికెట్లు పడిన స్థితిలో రహానె, కెప్టెన్ కోహ్లితో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ జోడీ 239 బంతుల్లో 100 పరుగులు జత చేయడంతో మూడోరోజు ఆట ఆఖరికి భారత్ 185/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. నాలుగోరోజు ఆటలో రెండో ఓవర్లోనే చేజ్ బౌలింగ్‌లో కోహ్లి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత రహానె, విహారితో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. లంచ్ సమయానికి భారత్ 287/4తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. విరామం తర్వాత సెంచరీ పూర్తి చేసిన రహానె.. కాసేపటికే ఔటయ్యాడు. పంత్ (7)తో కలిసి భారత స్కోరు 400 దాటించిన విహారి.. హోల్డర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. వెంటనే కోహ్లి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 297

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 222

భారత్ రెండో ఇన్నింగ్స్: రాహుల్ (బి) చేజ్ 38; మయాంక్ అగర్వాల్ ఎల్బీ (బి) చేజ్ 16; పుజారా (బి) రోచ్ 25; కోహ్లి (సి) క్యాంప్‌బెల్ (బి) చేజ్ 51; రహానె (సి) హోల్డర్ (బి) గాబ్రియల్ 102; విహారి (సి) హోప్ (బి) హోల్డర్ 93; పంత్ (సి) పాల్ (బి) చేజ్ 7; జడేజా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం: (112.3 ఓవర్లలో 7 వికెట్లకు) 343 డిక్లేర్డ్; **వికెట్ల పతనం:** 1-30, 2-73, 3-81, 4-187, 5-322, 6-336, 7-343; **బౌలింగ్:** రోచ్ 20-8-29-1; గాబ్రియల్ 16-2-62-1; చేజ్ 38-5-132-4; హోల్డర్ 18.3-4-45-1; కమిన్స్ 7-1-20-0; క్యాంప్‌బెల్ 6-0-20-0; క్రెయిగ్ బ్రాత్‌వైట్ 7-0-24-0

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: బ్రాత్‌వైట్ (సి) పంత్ (బి) బుమ్రా 1; క్యాంప్‌బెల్ (బి) బుమ్రా 7; బ్రూక్స్ ఎల్బీ (బి) ఇషాంత్ 2; డారెన్ బ్రావో (బి) బుమ్రా 2; హెట్‌మయర్ (సి) రహానె (బి) ఇషాంత్ 1; చేజ్ (బి) షమి 12; హోప్ (బి) బుమ్రా 2; హోల్డర్ (బి) బుమ్రా 8; రోచ్ (సి) పంత్ (బి) ఇషాంత్ 38; గాబ్రియల్ (సి) పంత్ (బి) షమి 0; కమిన్స్ నాటౌట్ 19; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం:** (26.5 ఓవర్లలో ఆలౌట్) **100; వికెట్ల పతనం:** 1-7, 2-10, 3-10, 4-13, 5-15, 6-27, 7-37, 8-50, 9-50

బౌలింగ్: ఇషాంత్‌శర్మ 9.5-1-31-3; బుమ్రా 8-4-7-5; జడేజా 4-0-42-0; షమి 5-3-13-2

చాంపియన్

ఫేవరెట్ జకోవిచ్

- రేసులో ఫెదరర్, నాదల్
- నేటి నుంచే యుఎస్ ఓపెన్

రాత్రి.8.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్‌లో

న్యూయార్క్: మళ్లీ టెన్నిస్ సందడి షురూ.. యుఎస్ ఓపెన్‌కు వేళైంది..! సోమవారం న్యూయార్క్ వేదికగా ప్రారంభమయ్యే ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో టాప్‌సీడ్ జకో.. అన్‌సీడెడ్ కార్‌బాలెస్ (స్పెయిన్)తో తలపడనున్నాడు. మూడో సీడ్‌గా బరిలో దిగుతున్న రోజర్ ఫెదరర్ కూడా అతని పార్శ్వంలోనే ఉన్నాడు. వీళ్లిద్దరూ సెమీస్‌లో ఎదురుపడే అవకాశాలున్నాయి. తొలి రౌండ్లో ఫెదరర్.. భారత్ యువ కెరటం సుమిత్ నగాల్‌తో తలపడనున్నాడు. రెండో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) తొలి రౌండ్లో మిల్‌మన్ (ఆస్ట్రేలియా)తో ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో నొవామి ఒసాకా (జపాన్) టాప్‌సీడ్‌గా బరిలో ఉంది. ఆమె తొలి రౌండ్లో బిలింకోవా (రష్యా)తో పోటీపడనుంది.

జైపుర్‌పై బుల్స్ విజయం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైడింగ్‌లో రోహిత్ కుమార్ (13), పవన్ సెరావత్ (8).. ట్యాక్లింగ్‌లో మహేందర్ సింగ్ (6), మోహిత్ (5), సౌరభ్ (5) చెలరేగడంతో పీకేఎల్ ఏడో సీజన్‌లో బెంగళూరు బుల్స్ మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు 41-30 తేడాతో జైపుర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. ఆరంభం నుంచే రోహిత్, పవన్ పాయింట్ల వేట కొనసాగించడంతో తొమ్మిది నిమిషాలకే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన బుల్స్ 13-4తో ఆధిక్యం సంపాదించింది. డిఫెండర్లు కూడా లయ అందుకోవడంతో 22-8తో ఆ జట్టు తొలి అర్ధభాగాన్ని ముగించింది. విరామం తర్వాత ప్రత్యర్థిని మరోసారి ఆలౌట్ చేసి ఓ దశలో 27-10తో నిలిచింది. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లతో దూసుకెళ్లిన ఆ జట్టు మరో నాలుగు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా 40-26తో విజయం ఖాయం చేసుకుంది. జైపుర్ తరపున నితిన్ రావల్ (8), అజింక్య పవార్ (5) ఆకట్టుకున్నారు. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 36-27తో యూపీ యోధపై గెలిచింది.

ప్రొ కబడ్డీలో ఈనాడు

బంగాల్ వారియర్స్ × హరియాణా స్టీలర్స్ (రా.7:30 నుంచి)
యూపీ యోధ × పుణెరి పల్టాన్ (రా.8:30 నుంచి)

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు..

స్టోక్స్ అసమాన పోరాటం

- ఇంగ్లాండ్ అద్భుత విజయం
- మూడో టెస్టులో ఆసీస్ అనూహ్య ఓటమి

అద్భుతం.. అమోఘం... అద్వితీయం.. అతడి ఇన్నింగ్స్‌ను ఎంత పొగిడినా తక్కువే! ప్రపంచకప్పులో తన జట్టుకు ఒంటి చేత్తో విజయాన్నందించిన అతడి చిరస్మరణీయ పోరాటం అభిమానుల్లో స్మృతిలో ఇంకా తాజాగా ఉండగానే బెన్ స్టోక్స్ మళ్లీ అద్భుతం చేశాడు. క్రికెట్ ప్రపంచంతో బెరా అనిపిస్తూ.. ఉత్కంఠను జయిస్తూ అసమాన పోరాటంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. యాషెస్ మూడో టెస్టులో ఇంగ్లాండ్‌కు అపురూప విజయాన్నందించాడు. మామూలు పోరాటమా అది! 286/9. 359 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ స్కోరిది. ఆఖరి ఇంగ్లాండ్ అభిమాని కూడా కలలోనైనా ఊహించి ఉండడు తమ జట్టు గెలుస్తుందని! కానీ స్టోక్స్ (135 నాటౌట్) కలకాలం గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియాకు షాకిచ్చాడు. ఆఖరి బ్యాట్స్‌మన్ లీచ్‌ను కాపాడుకుంటూ, కంగారూలను దిగ్భ్రాంతికి గురి చేస్తూ లక్ష్యాన్ని ఛేదించేశాడు.

లీడ్స్

విజయం ఖాయమనుకున్న ఆస్ట్రేలియాకు షాక్. బెన్ స్టోక్స్ (135 నాటౌట్; 219 బంతుల్లో 11×4, 8×6) చరిత్రలో నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడిన వేళ. ఆదివారం, నాలుగో రోజు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన యాషెస్ మూడో టెస్టులో ఒక్క వికెట్ తేడాతో ఇంగ్లాండ్ గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. స్టోక్స్ రాణించడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టెస్టు క్రికెట్లో ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక లక్ష్యఛేదన. లీచ్ (17 బంతుల్లో 1 నాటౌట్) ఒక్క పరుగే చేసినా ఒత్తిడిలో.. స్టోక్స్‌కు గొప్పగా సహకరించాడు. అతడితో అజేయమైన ఆఖరి వికెట్‌కు స్టోక్స్ 76 పరుగులు జోడించాడు.

వారెవ్వా స్టోక్స్: 359 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 156/3తో ఆదివారం ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. కాసేపటికే రూట్ వికెట్‌ను కోల్పోయినా స్టోక్స్‌కు బెయిర్‌స్టో (36) అండగా నిలవడంతో ఓ దశలో 245/4తో మెరుగ్గానే కనిపించింది. కానీ చకచకా ఐదు వికెట్లు కోల్పోయి 286/9కు పరిమితమైంది. ఇంగ్లాండ్ ఓటమి లాంఛనమే అనుకున్నారంతా! కానీ స్టోక్స్ పోరాడితే పోయేదేమీ లేదనుకుని రెచ్చిపోయాడు. ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించిన అతడు.. వీలైనంత వరకు చివరి బంతికి పరుగు తీస్తూ, టెయిలెండర్ లీచ్‌ను కాపాడుకుంటూ సాగిపోయాడు. అతడు అలవోకగా సిక్స్‌లు, ఫోర్లు బాదుతుంటే ఇంగ్లాండ్ వడివడిగా లక్ష్యం దిశగా సాగింది. పేసర్లు ప్యాటిన్సన్, కమిన్స్, హేజిల్‌వుడ్‌లను గానీ, స్పిన్నర్ లైయన్‌ను గానీ స్టోక్స్ వదిలిపెట్టలేదు. హేజిల్‌వుడ్ ఓవర్లోనైతే వరుసగా 6, 6, 4 బాదేశాడు. లీచ్ ఉత్కంఠను తట్టుకుంటూ మొండిగా నిలబడ్డాడు. ఇంగ్లాండ్ లక్ష్యానికి చేరువవుతున్న కొద్దీ ఉత్కంఠ తీవ్రమైపోయింది. 357 వద్ద లీచ్ ఓవర్ మొదటి నుంచీ బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు మూడో బంతికి అతడు సింగిల్ తీయడంతో స్కోరు సమంమైంది. వెంటనే స్టోక్స్ ఫోర్‌తో చరిత్రాత్మక విజయం ఇంగ్లాండ్ సొంతమైంది.

> ఈ మ్యాచ్‌లో విజయానికి ఇంగ్లాండ్ సంపూర్ణ అర్హురాలే. కానీ అదృష్టం కూడా ఎట్టిపరిస్థితుల్లో ఇంగ్లాండ్‌ను గెలిపించాలని కంకణం కట్టుకున్నట్లుంది. ఇంగ్లాండ్ స్కోరు 342 వద్ద కమిన్స్ బౌలింగ్‌లో స్టోక్స్ ఇచ్చిన క్యాచ్‌ను హారిస్ చేజార్చాడు. 357 వద్ద లీచ్‌ను అత్యంత తేలిగ్గా రనౌట్ చేసే అవకాశాన్ని లైయన్ వదిలేశాడు. అదే స్కోరు వద్ద స్టోక్స్ ఎల్బీ కోసం లైయన్ చేసిన అప్పీలును అంపైర్ విల్సన్ తిరస్కరించాడు. అప్పటికే ఆసీస్‌కు సమీక్షలు అయిపోయాయి. ఉండుంటే స్టోక్స్ ఔటయ్యేవాడే.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 179
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 67
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 246
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 362/9

సమావేశంలో ప్రసంగిస్తున్న జస్టిస్ చలమేశ్వర్. చిత్రంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రొఫెసర్ రాధాకృష్ణ, అంపశయ్య నవీన్, కె.శ్రీనివాస్, చింతకింది మల్లేశం, జయరాజ్, సీరాజుద్దీన్

సమానత్వ భావన లోపిస్తే అశాంతే

'భారత్ శాంతిదూత్' అవార్డుల ప్రదానోత్సవంలో జస్టిస్ చలమేశ్వర్

నయీంనగర్ (హన్మకొండ), న్యూస్‌టుడే: సమాజంలో అందరూ ప్రతిబంధకాలు వీడి శాంతియుతంగా ముందుకు సాగాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హన్మకొండలో జరిగిన 'భారత్ శాంతిదూత్' అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మనిషిలో సమానత్వ భావన లోపిస్తే అశాంతి కలుగుతుందన్నారు. శాంతియుతంగా జీవించాలంటే నిజం మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసినట్లు తెలిపారు. శాంతిదూత్ అవార్డులు అందుకున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రొఫెసర్ రాధాకృష్ణ, కె.శ్రీనివాస్, పద్మశ్రీ అవార్డు గ్రహీత.. ఆసు యంత్రం సృష్టికర్త చింతకింది మల్లేశం, ప్రముఖ కవి, గాయకుడు జయరాజ్‌ను ఆయన సత్కరించారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ సభకు అధ్యక్షత వహించారు. నిర్వాహకులు మహ్మద్ సిరాజుద్దీన్, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలల్లో ఖాళీలు భర్తీ చేస్తాం

- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. 'విశ్వ ఆయుర్వేద పరిషత్' తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారమిక్కడ 'చర్మరోగాలు- వ్యాధి నిరోధక విజ్ఞానం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఈటల.. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్(సీసీఐఎం) సభ్యులు మల్లు ప్రసాద్ తదితరులు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఆది వైద్యంగా ప్రసిద్ధి చెందిన ఆయుర్వేదం అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆయుర్వేద డిస్పెన్సరీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టిసారిస్తామన్నారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ సలహాదారు పీబీఏ వెంకటాచారి, తెలంగాణ కమిటీ అధ్యక్షుడు ఎ.సమ్మిరెడ్డి, కార్యదర్శి ఎ.శ్రీధర్ తదితరులు మంత్రి ఈటల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. వైద్యుల జియో ట్యాగింగ్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే అన్ని ఆయుర్వేద వైద్యశాలల్లో వసతులు కల్పించాలని, ప్రభుత్వమే వైద్యులకు సెల్‌ఫోన్లు అందజేయాలని కోరారు. అనంతరం సీసీఐఎం సభ్యులు మల్లు ప్రసాద్, పరిషత్ ప్రతినిధులను మంత్రి సన్మానించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ విక్రమ్‌సింగ్, తెలంగాణ ఆయుష్ విభాగం డైరెక్టర్ వర్షిణి తదితరులు మాట్లాడారు.

మల్లుప్రసాద్‌ను సన్మానిస్తున్న మంత్రి ఈటల

మానవతావాది.. మేధావి

అరుణ్ జైట్లీ పార్థివ దేహానికి చంద్రబాబు నివాళి

ఈనాడు, దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ మృతితో దేశం ఓ మానవతావాది, మేధావి, సంస్కరణకర్తను కోల్పోయిందని తెదేపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అరుణ్ జైట్లీ పార్థివ దేహానికి ఆదివారం ఉదయం ఆయన నివాళులర్పించారు. జైట్లీ సతీమణి సంగీత, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ.. జైట్లీ మంచి వ్యక్తి అని, అందరితో సత్సంబంధాలున్నవారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు స్నేహితుడిగా ఉంటూ అనేక విధాలా సహాయం చేశారని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు జైట్లీ సన్నిహితుడని.. అటువంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. జైట్లీ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రాష్ట్ర విభజన చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ నగరం తెలంగాణకు వెళ్తోంది కాబట్టి ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా కోలుకోవాలంటే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని గట్టిగా డిమాండు చేశారని తెలిపారు.

పులిచింతల రహదారిలో మొసలి మృతి

అచ్చంపేట, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పరిధి పులిచింతల ప్రాజెక్టు సమీపంలోని రహదారి పైకి వచ్చిన ఓ మొసలి ఆదివారం ఉదయం లారీ కిందపడి మృతి చెందింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం వజినేపల్లివద్ద వాగులో నుంచి అది రహదారి మీదకు వచ్చింది. ఇటీవల కృష్ణా నదికి వరదలు వచ్చిన నేపథ్యంలో పులిచింతల ప్రాజెక్టులో మొసళ్లు సంచరిస్తున్నాయని అధికారులు గుర్తించారు.

మణుగూరు ఎన్‌కౌంటర్ బూటకం

- పౌరహక్కుల సంఘం

పీవీకాలనీ (మణుగూరు), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిధిలో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్ పచ్చి బూటకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ఆరోపించారు. బుడుగుల గ్రామంలో జరిగిన ఎదురుకాల్పుల్లో జాడి వీరస్వామి(26) అనే మావోయిస్టు దళ సభ్యుడు మృతిచెందిన నేపథ్యంలో నిజ నిర్ధారణకు పౌరహక్కుల సంఘం నాయకులు ఆదివారం మణుగూరు వచ్చారు. ఎన్‌కౌంటర్ జరిగిందని భావిస్తున్న అటవీ ప్రదేశాన్ని పరిశీలించి, బుడుగుల గ్రామస్థులతో మాట్లాడారు. నారాయణరావు విలేకర్లతో మాట్లాడుతూ.. వీరస్వామిని పోలీసులు బుడుగుల గ్రామంలో ఓ ఇంట్లో పట్టుకుని, చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్తున్నారన్నారు. అతన్ని న్యాయస్థానం ముంగిట హాజరుపర్చే బాధ్యతను విస్మరించి అన్యాయంగా కాల్చిచంపారని ఆరోపించారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయమిస్తున్నారని బుడుగుల గ్రామస్థులను పోలీసులు కొట్టారని, ఈ క్రమంలోనే ఎట్టి నందయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందాడని ఆరోపించారు. మణుగూరులో జరిగిన ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం తరపున న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీమన్నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

ఆ ఆరోపణలు అవాస్తవం: మణుగూరు డీఎస్పీ

మణుగూరు మండలం బుడుగుల గ్రామస్థుడు ఎట్టి నందయ్య పోలీసులు కొట్టడంతోనే చనిపోయాడని పౌరహక్కుల సంఘం నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మణుగూరు డీఎస్పీ ఆర్.సాయిబాబా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు కొడితేనే నందయ్య చనిపోయినట్లు చెప్పమని కుటుంబ సభ్యులతో హక్కుల సంఘం నాయకులు చెప్పించారన్నారు. అలా చెబితేనే ప్రభుత్వం నుంచి సాయం వస్తుందని నమ్మించారని తెలిపారు. ఐదు రోజులుగా నందయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడని, వాగులు పొంగటంతో అతణ్ని ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయినట్లు, అందుకే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారని డీఎస్పీ తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

LOVED IN 70 COUNTRIES

BAJAJ | THE WORLD'S FAVOURITE INDIAN

BAJAJ

అధిక ధరల నుండి స్వేచ్ఛ

సగర్వంగా మీ సవారీని తీసుకెళ్ళండి కేవలం ₹999/*లకే.

డౌన్ పేమెంట్ ₹999/* CT

డౌన్ పేమెంట్ ₹1 199/* PLATINA

డౌన్ పేమెంట్ ₹4 999/* pulsar

లో డౌన్ పేమెంట్ సౌకర్యం Discover మరియు Avenger బైకుల పైన కూడా ఉంది. స్కీము 2019 ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుంది.

Call 7219821111 | For Institutional / Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in

*నియమ నిబంధనలు వర్తిస్తాయి. వివరాల కోసం సందర్శించండి www.bajajauto.com/999offer. ఎంపిక చేసిన ప్రదేశములలో మాత్రమే బజాజ్ ఆటో ఫైనాన్స్ ద్వారా CT, Platina, Pulsar 150, Discover మరియు Avenger మోడళ్ళ పైన ఈ స్కీము చెల్లుతుంది. సూచించిన మొత్తాలు వరుసగా CT, Platina మరియు Pulsar బైకులకు చెందిన కనీస డౌన్ పేమెంట్లు. ప్రాసెసింగ్ ఫీజు అదనం. ఫైనాన్స్ విషయంలో తుది నిర్ణయం ఫైనాన్సరుదే. ముందస్తు నోటీసు లేకుండా ఏదైనా ఆఫరును లేదా అన్ని ఆఫరులను సవరించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి సర్వ హక్కులు బజాజ్ ఆటోకి చెంది ఉంటాయి.

BAJAJ FINANCE LTD - AF

Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 9703614888, 8008796695 • Nizamabad BIJAY BAJAJ 08462-234013, 234014, 8885671855, VIJAYA GANAPATHI AUTOMOTIVES 08462-238239, 9849590160 • Mancherial MAHI BAJAJ 08736-259088 9912278641 • Adilabad SRR MOTORS 9491249451, 9491159452, 2221966 • Warangal ANIKA BAJAJ 0870-2422299, 9885953888 • Hanamkonda SELECT BAJAJ 7702611220, 0870-6565205 • Nalgonda SANSAI BAJAJ 9160789555, 9160888876 • Miryalaguda SANSAI BAJAJ 9247020304, 9160059997 • Khammam VENKATRAMANA BAJAJ 9100266191, 9618378135 • Kothagudem SAI ANJANA BAJAJ 7799444544, 9912162299 • Mahboobnagar HAROON BAJAJ 08542-220060, 220070, 9010844457 • Gadwal SRI SAI BAJAJ 8886667721 • Siddipet TALWAR BAJAJ 7702015577. **Authorised Service Centre:** JAGITIAL 8522038460, 9949565692 SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849184700, 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, , NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, , NIRMAL 9010792792, THORRUR 9440874469, MAHABUBABAD 9949518874, 9063932333 MARRIPEDA 9908243623, KESAMUDRAM 9705580303, NARSAMPET 9346070143, MULUGU 7396336262, JANGAON 7702711220, STN GHANPUR 7702322110, PARKAL 7702922110, BHUPAL PALLY 8341027588, CHOUTUPAL 9290121333, BHONGIR 9247023637, MUNUGODE 9912996208, SURYAPET 8886936767, KODAD 9160079855 9848644441, THALLADA 9701802572, YELLANDU 9849869835, SATHUPALLI 9491924400, MADHIRA 8886888789, ENKURU 7732020146, ASWARAOPET 8367219219, WYRA 9052528181, NELAKONDAPALLI 9959691501, BHADRACHALAM 7799555355, PALAVANCHA 9848382500, MANUGURU 9440509779, WANAPARTHY 9010878618, KODANGAL 9010844470, KOTHAKOTA 9666211068, KALWAKURTHY 9010878619, SHADNAGAR 9010844462, NAGARKURNOOL 9666100050, Makthal 9640783999, PEBBAIR 9603926999, NARAYANPET 9108064786, ATHMAKUR 9010244473, KALLURU 9000380161, AMANGAL 8978934455, IEEJA 9989922894, SHANTINAGAR 9494767233, YERRAVALLI 9948276249, ALAMPUR 9849304403.

SUZUKI | Way of Life!

SUZUKI

పండుగ కొరకు కానుక

ఈ ఫెస్టివ్ సీజన్‌ని చేసుకోండి మరపురానిదిగా
సుజుకి టు-వీలర్ పైన స్పెషల్ డీల్స్‌తో పాటుగా

ఋణం లభిస్తుంది 48 EMI* వరకూ

100%* వరకూ అక్కడికక్కడె ఫైనాన్స్ ఆమోదం

కార్పొరేట్ ఆఫర్ అన్ని ప్రభుత్వ, పిఎస్‌యు, మరియు ఎంపిక చేయబడిన కార్పొరేట్‌లకు ప్రయోజనాలు ₹3,000/- వరకూ

పేటిమ్ పైన షాపింగ్ చేయండి & పొందండి లాభాలు ₹8,500/- వరకూ paytm CASHBACK

Access125 Special Edition | BURGMAN STREET | GIXXER SF | INTRUDER

*నియమనిబంధనలు వర్తిస్తాయి.

నిరాకరణ : • ఉపయోగించబడిన చిత్రాలు కేవలం ఉదాహరణ ఉద్దేశ్యానికి మాత్రమే. • చిత్రాలలో చూపిన విడిభాగాలు ప్రామాణిక వాహనంలో భాగం కాదు మరియు ఒక రకం నుండి మరొక రకానికి మారిపోవచ్చును. • ఇంధన సామర్థ్యత CMVR, 1989 నియమం 115 క్రింద టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా సర్టిఫై చేయబడినట్లుగా. • ఫైనేన్స్, ఫైనేన్స్ కంపెనీ యొక్క ఏకైక వివక్షణ ప్రకారం. • పేటిఎమ్ ప్రయోజనాలు పేటిఎమ్ ఆఫర్(ర్లు) ప్రకారం. • ఆఫర్లు సుజికి మోటార్‌సైకిల్ అధీకృత డీలర్ల నుండి. • ఈ పథకం ఎంపిక చేయబడిన మోడల్(ల్స్)పైన మరియు పరిమితమైన స్టాకుపైన వర్తిస్తుంది. • ఆఫర్ 31 ఆగష్టు, 2019 వరకూ వర్తిస్తుంది.

Ride safe. Wear a helmet.

For further information, call Suzuki Motorcycle India Private Limited (toll-free): 1800 - 121 - 7996 (09:00AM To 06:00PM), or write to us at: customer.queries@suzukimotorcycle.in, Visit website: www.suzukimotorcycle.co.in for *T&C and more.

Hyderabad: Secunderabad: Saboo Suzuki, Ph: 040-66388888, 9848688888, **Safilguda: Saboo Suzuki,** Ph: 8186022222, **Bowenpally: Prime Suzuki,** Ph: 8886690104, 6309678991, **Habsiguda: Mahalaxmi Suzuki,** Ph: 040-27004441, 9030068701, **Uppal: Om Sai Suzuki** Ph: 9121166214, 9121166216; **Himayatnagar: Maanya Suzuki,** Ph: 040-48516660, 8080663311, **Malakpet: Midas Suzuki,** Ph: 040-66021132, 7702775555, **Vanastalipuram: A.V. Suzuki,** Ph: 9542111185, **Tolichowki: Malik Suzuki,** Ph: 8008967000, 8008910000, **Attapur: Aarush Suzuki,** Ph: 9133536633, 9133206633, **Somajiguda: Gem Suzuki,** Ph: 9912342653, 9133392314, **Kondapur: Gem Suzuki,** Ph: 040-45464546, 9133392319, **Madinaguda: Gem Suzuki,** Ph: 9912349850, **Kukatpally: Jayan Suzuki,** Ph: 6281732403, 9100577746, **RC Puram: Shri Sai Suzuki,** Ph: 7799963004, 7799733004, **Ramagundam: Sandeep Suzuki,** Ph: 9948481135, **Mancherial: Omshriram Suzuki,** Ph: 9949620343, 9581320002, **Nalgonda: Casa Suzuki,** Ph: 08682-248333, 8184900090, **Khammam: Rayapudi Suzuki,** Ph: 9701188007, 9885456105, **Kotthagudem: Rayapudi Suzuki,** Ph: 8297192277, **Warangal: Chilupuri Suzuki,** Ph: 9849841155, 9849140300, **Hanamkonda: Mithra Suzuki,** Ph: 9849654891, 9581320077, **Nizamabad: Sarang Suzuki,** Ph: 9393164848, 8462236671.